
# పులికంటి కృష్ణారెడ్డి




"అయితే మీరంతా యిప్పుడనేది నేనే దానిమొగుణ్ణి సంపేసినాననిః" వసి
వాడని పందిరిమీద పచ్చని ఆకుపైపు కసికసిగా చూస్తున్నట్లే మూతికి
ముసిముసి నవ్వులు పులుముకొని అతడన్నాడు. మోటబాన కుమ్మరిల్లి దోనె
గుండా నీళ్ళు బయటపడుతున్నట్లు వెలువడినాయి మాటలుః

పందిరికింద గుంపు ఊపిరి బిగపట్టింది.

---

*1983 చక్రపాణి మొదటి అవార్డు పొందిన నవల*

---

ఊరు మాటు మణిగింది.

ఆ మాటు మణిగిన వేళలో—

పట్టెమంచం మీద పదిలంగా కూర్చుని, కాలుమీద కాలేసి, రెండుచేతుల మోపున భారీ కాయాన్ని బాగా వెనక్కు వాల్చి తలను మాత్రం పైకిలేపి ఆలోచనా ముద్రలో అవతార పురుషుడిలా కనుపిస్తున్నాడు ఓబులేసురెడ్డి!

పట్టెమంచమంటే సాధారణంగా పడకగదుల్లోనే ఉంటుంది. కానీ ఆ యింట్లో మాత్రం యింటిముంగిట విశాలమైన వాకిలి. ఆ వాకిలి మొదట్లోనే పట్టెమంచం. ఆ పట్టెమంచం దాదాపు ముక్కాలు మువ్వీసం ఊరికి రచ్చబండ. ఓబులేసురెడ్డి ఆ గ్రామస్థుల పాలిటకొక న్యాయమూర్తి.

ఆ ఊళ్ళో రంగవల్లిలో గొబ్బెమ్మలా నిబ్బరంగా ఉంది ఓబులేసు రెడ్డిగారి పాతకాలపు మేడ. ఆ మేడచుట్టూ ప్రహరీగోడ ఆ ఊరిని సగానికి సగం మింగింది. ఆ పాతకాలపు మేడలో తాతల కాలంనాటి ఒక యినప్పెట్టె. ఆ పెట్టెలో మూలుగుతున్న లక్ష్మీదేవి. ఆ మహాతల్లి యినప్పెట్టెలో మూలుగుతూ కూలబడినట్లున్నా, ఆ ఊళ్ళోవాళ్ళ అభిప్రాయాల్ని, అభిమానాల్ని, ఆత్మగౌరవాల్ని అన్నింటినీ కలిపి ముద్దచేసి ఆకలిగొన్న కడుపు సంకటిముద్దను మింగినట్లుగా మింగేసింది.

అందుకే ఆ ఊళ్ళోవాళ్ళు జుట్లు పట్టుకోవాలన్నా, జుట్లు విడిపించుకోవాలన్నా, భాగ పరిష్కారాలు కావాలనుకొన్నా, పెండ్లి పేరంటాలు వైభవంగా జరుపుకోవాలనుకొన్నా, కోర్టులకెక్కాలన్నా, కోర్టులనుండి బయటపడాలన్నా ఓబులేసురెడ్డిగారి వాకిట్లో పట్టెమంచంముందు చేతులు కట్టుకొని నిలబడాల్సిందే!

ఆ రోజు కూడా ఓబులేసురెడ్డి అందుకే కూర్చున్నాడు.

అతగాడికి తాళగాళ్ళున్నారు. మేళగాళ్ళున్నారు. ఎదజల్లితే యారకతినే యదవనాయాండ్లున్నారు. అటుయిటు చెందని కొజ్జాకొడుకులున్నారు. రెడ్డిగారి కనుసన్నల్లో మెదులుతూ మాటమాటకూ తాళం వేయడమంటే వాళ్ళకు మహా తృప్తి. కాకితో కబురు అవసరం లేకనే కొలువుకూటానికి రావడమంటే పరిపాటే కాదు— పరమానందకరం.

ఆరోజు కూడా వచ్చినారు.

నలుగురైదుగురు తాళగాళ్ళు మేళగాళ్ళు మంచంమీదనే రెడ్డిగారి కటు యిటుగా వొదిగి వొదిగీ వొకడిలో వొకడు దూరుకున్నట్లుగా కూర్చున్నారు. కొజ్జా కొడుకులు కొంతమంది రెడ్డిగారికి అందుబాటుగా మంచం పక్కన్నే

కూర్చున్నారు, అవసరమైతే కాళ్ళు పిసకడానికి. యారకతినే యదవలు మాత్రం ఆ యింటి వాకిట్లో తమకంత తావు దొరకడమే జన్మ తరించినంత తృప్తిగా నేలకే పరిమితమైనారు.

ఆ యింటికి తూర్పు వాకిలి. ఆ వాకిల దాదాపు ఆరారు పన్నెండు బారల పొడవుంటుంది. ఆ వాకిలి చివర ఉత్తరదక్షిణంగా మూడుమూడు అరంకణాల పశువులకొట్టం. -- కొట్టాన్ని మేడనూ కలుపుతూ పందిరి. నిరంతరం వచ్చే పొయ్యే వాళ్ళతో ఆ యిల్లు కళకళలాడినట్లే ఆ పందిరి కూడా నేరేడు మండల తోనో, టెంకాయ మట్టలతోనో పచ్చంగా కళకళలాడుతూ ఉంటుంది. పందిరి మీద 'ఆకు వాడితే రెడ్డిగారి ముఖం మాడుతుందని ఆ గ్రామస్థులకు బాగా తెలుసు. అందుకే చాలా జాగ్రత్తపడుతుంటారు. ఎప్పటికప్పుడు వంతులమీద ఆకు మార్చి రెడ్డిగారి దయకు పాత్రులవుతుంటారు.


ఆ పందిరి మధ్యగా ఒక ట్యూబ్‌లైట్. మాటుమణిగిన వేళల్లో ఆ వాకిట్లో వెన్నెల వెలుగుల్ని నింపుతూ ఉంటుంది. ఆ వెన్నెల వెలుగులో వెలుగుకు చీకటికి ప్రతిదినము కాకున్నా రెండుమూడు రోజులకొకసారైనా తీవ్రంగా ఘర్షణ జరుగుతూ ఉంటుంది. వెలుగే ఎగిరిపడుతుందో? చీకటే చిన్నబోతుందో? లేక వెలుగే తోకముడిచి చీకటే చిందులు తొక్కుతుందో? అంత రెడ్డిగారి దయ.

ఆ రోజు ఆ మాటుమణిగిన వేళలో ఓబులేసురెడ్డిగారు పట్టెమంచంమీద అవతార పురుషుడులా దర్శనమిస్తూంటే అతని అనుయాయులు అటుయిటుగా ఆసీనులై ఉంటే- పశువుల కొట్టం ముందర చేతులు కట్టుకొని నిలబడినారు కొందరు.

సమత మనధ్యేయం. మమత మన వారసత్వం. అయినా ఒకరు మంచం మీద దర్జాగా కూర్చున్నారు. ఆ మంచం మీదనే కొందరు వొదిగి కూర్చున్నారు. కొందరు నేలమీదనే పరిమితమైనారు. ఇంతమందీ ఏదో ఒక విధంగా కూర్చుంటే యింకొంత మంది చేతులు కట్టుకొని నిలబడినారు!

ఎవరు వాళ్ళు?

ఈ దేశంలో మాటకుచేతకు మనువుకుదరని నిరూపించడానికి నిలబడిన నిదర్శనాలు వాళ్ళు మనుష్యులంతా ఒక్కటేనంటూ మళ్ళీ మనుష్యుల్లో మనుష్యుల్ని కలవనీయకుండా చేస్తున్నందుకు దృష్టాంతాలు వాళ్ళు అందుకే వాళ్ళు పట్టెమంచానికి పన్నెండుబారల దూరంలో పశువుల కొట్టంచాటులో పశువుల సరసన్నే నిలబడినారు.




ఆ పందిరి నడిమయాన వేలాడదీసిన ట్యూబ్‌లైట్ పనిగట్టుకొన్నట్లుగా వాళ్ళమీద వెండివెలుగుల్ని కుమ్మరిస్తూ ఉంది. దానికి శక్తివుంది కానీ ప్రాణం లేదు. ప్రాణమే ఉంటే అది కూడా ఆ ప్రాణుల్ని చిన్నచూపు చూసేదేమో:– ఆ వెలుగుల్లో వాళ్ళని పరిశీలించి చూస్తే దట్టంగా తారుపూసిన నిలువురాళ్ళ మాదిర నిలబడివున్నారు. ఆ నిలువురాళ్ళల్లో చలనంలేదు. చైతన్యంలేదు. పార గడ్డిపార చేతికిచ్చి పొలాల్లో పనిమీద వదిలితే పట్టపగ్గాల్లేని బలప్రదర్శన రెడ్డిగారి వాకిట్లో తోకముడిచి నిలబడింది. చేతులుకట్టుకొని నిలబడింది. నోరుమూసుకొని నిలబడింది.

తరతరాలుగా వాళ్ళ నరనరాల్లో జీర్ణించుకపోయిన వినయవిధేయతలు, ఒక్కరోజులో పొమ్మంటే పోతాయా? అసలు అట్లా ఆశించడంకూడా తప్పుకదూ?

వాళ్ళకు బారెడు దూరంలో ఒక ఆడది. అందీఅందని పైటచెరగునులాగి లాగి వొళ్ళంతా కప్పుకోలేక వంచిన తలఎత్తకుండా నిలబడింది. ఆమె పక్కన్నే పద్నాలుగేండ్ల పసివాడు. ఆమె కొంగుచాటున నిలబడదానికి ఆ కొంగుచాలక పక్కన్నే నిలబడినాడు. వాడి కాళ్ళమీద వాడు నిలబడినవాడు తల్లిచాటు బిడ్డ:–

ఆ తల్లిచాటుబిడ్డ కాళ్ళు తడబడుతున్నాయి. ఒళ్ళు కదురుపుడుతూ ఉంది. నోరు పిడచగట్టకపోతా ఉంది. వాడికి తెలియకనే కండ్లు నిండుకొంటున్నాయి.

ఎవరి ఆలోచనల్లోపడి వాళ్ళు కొట్టుకపోతావుంటే- ఆ బుడంకాయంత బుల్లోడు అడ్డంపడలేక పోతున్నాడు.

ఓబుల్‌రెడ్డి ఒక్క మోపున పైకి చూస్తున్నాడు. పక్కన కూర్చున్న వాళ్ళందరు రెడ్డిగారి ముఖాన్ని పరికించి చూస్తున్నారు. కొట్టం ముందు నిలువు రాళ్ళకు నిలువుగుడ్లే పడినాయి.

కాలపురుషుడు మెల్లగా కాలాడిస్తున్నాడు. ఆ పందిరికింద నెలకొన్న ప్రశాంతతను పారదోలడానికన్నట్లుగా 'ట్యూబ్‌లైట్' గుయ్‌మని శబ్దంచేస్తూ ఉంది. ఊరి ముందర పొలాల్లో కావలికాస్తున్న రైతుల అదలింపులు లీలగా వినిపిస్తున్నాయి. ఊరి కెగుదుల మంచినీళ్ళగుంటలో ఎంద్రకాయల్ని మెక్క డానికి వచ్చిన 'పొట్టిబాతలు' ఊళలేస్తున్నాయి. ఓబుల్‌రెడ్డిగారి యింట్లో మాత్రం మాటుమణిగింది- వాకిట్లో మాటుమణగక పోయినా!- ఉన్నట్లుండి అప్పుడప్పుడు నిద్రపోతున్న వాళ్ళ గురకలు ఉధృతంగా వినిపిస్తున్నాయి.

అయినా పందిరికింద ప్రశాంత వాతావరణం కొనసాగుతున్నట్లే లెక్క!-

ఓబుల్‌రెడ్డిగారిది 'ఓయబ్బ!' అనగలిగినంత కాయం. అరడుగులకు పైబడి బెత్తెడు అటోయిటోగా ఉంటుంది. ఆయన కట్టుకునే మొలపంచ మోకాళ్ళ పైకి ఎగబడదు. ముంగాళ్ళకు దిగబడదు. గడపదాటి అడుగు బయటపెడితే- భుజం పైన నాలుగు మూరల తుండుగుడ్డ ఉంటుంది. పట్టెమంచం మీదయితే అదిగూడ ఉండదు. రెడ్డిగారు రెండుచేతుల మోపున వెనక్కువాలి ఉంటే- రెండు అరటి దోనెల్ని ఏటవాలుగా మంచానికి ఆనించి వాటిమీద ఒక చిన్నసైజు బానను పెట్టి ఆ బానమీద సుమారుపాటి ఒక గుమ్మడికాయను కుదించిపెట్టినట్లుంది. ఆయన దీర్ఘంగా ఆలోచిస్తూంటే ఆ బాన వెనక్కు ముందుకు ఊగులాడుతున్నట్లుంది.

అందరు రెడ్డిగారి వంక తదేకంగా చూస్తున్నారు!

నిమీలిత నేత్రుడైన రెడ్డిగారు అరమోడ్పు కన్నుల్లోకి జారినారు. చిన్న సైజు బానలాంటి కడుపు బాగా ముందుకు వచ్చినట్లు వచ్చి వెనక్కుతగ్గి కాసేపు కదలికల్ని మానింది. కడుపు కదలికల్ని మానేసరికి తల రెండు మూడుసార్లు అటుయిటు ఊగిసలాడింది.

ఆకాశం మేఘావృతమైతే వర్షం రావచ్చు. రాకపోవచ్చు!

ఉరుములు ఉరిమితే పిడుగులు పడవచ్చు. పడకుండా పోవచ్చు.

కానీ రెడ్డిగారిలో ఈ ఒన్నెలు కనిపిస్తే మాత్రం తప్పనిసరిగా నోరు పెగులుతుంది.

అందుకే అందరు ఊపిరి బిగబట్టి ఎదురుచూస్తున్నారు.

"అయితే మీరందురూ యిప్పుడంటావుండేది దాని మొగుణ్ణి నేనే సంపేసి నాననిః"—

మళ్ళీ ఒకసారి అదే మాటను వత్తిపలికినాడు రెడ్డిగారు. తొత్తుగాళ్ళు అందుకొన్నారు.

"రాంవః రాంవః! ఎంత మాటెంత మాటః"

రెడ్డిగారి మాటను నిట్టూర్పుతో అందించినాయి కొన్ని గొంతులు.

"అయితే మీరిప్పుడనేదేందిః"

ఆ మాటతో నిలువురాళ్ళు పట్టికుదిపినట్లు కదిలినాయి. ఆ కంపనతో కూడా నసుగుడు మొదలయింది.

"మేంవనేదదిగాదయ్యాః"

"ఇంకేంది?"

"దాని మొగుడు మీ బాయిలో పూడెత్తా వుణ్ణాడు."

"అవునుః"

"బాయిలో బండ పడింది."

"అవును."

"ఆ బండకు నాట్లుపెట్టి పగలగొడ్తా వుణ్ణింది దీని మొగుడేః"

"నేను కాదన్లేదేః"

"పగలగొట్టేసిన రాళ్ళను తట్లకెత్తి పైకిసేదేస్తావుంటే ఒకతట్ట తెగి సరిగ్గా దాని మొగుడినెత్తిన్నే పడిందిః"

"పద్దే తలబగిలి వాడు సచ్చినాడు."

"అవును కదయ్యా మరిః"

"అయితే ఆ తట్లో నేను సెప్పేట్నానన్నమాట— తెగి సరిగ్గా దాని మొగుడినెత్తిన్నే పడమనిః"

"అదిగాదయ్యాః"

"ఇంకేందయ్యా?— బాయిలో పూడెత్తావుణ్ణింది వాడొక్కడేనా?— అహాఁః వాడొక్కడేనా అనిః వాడితోకల్సి ఎంతమంది?— అహాఁః ఎంతమంది పూడెత్తా వుణ్ణింది. వాళ్ళెవ్వరిమీద పడకుండా దాని మొగుడినెత్తిన్నే పడిందంటే...."

"వాడి గాచ్చారంవయ్యాః"

"కట్టన్నారు. బాగుండాది. అదంతేనయ్యాః తీరిపొయ్యిందంటే పట్టుకునే

దానికెవురి తరఁవవుతుంది? ఇప్పుడు నేనుండానా?.... మంచంమీద గుమ్మటంగా గుమ్మడికాయి మాదిర కూసోనుండానా?– తెల్లారేకుందికి యిడ్నేనిగడకపోవచ్చు. ఎవుర్జూసినారయ్యా?"

"సాఁవీ! సాఁవీ!!.... అంత మాటెందుకంటారు సాఁవీ!– మీలాంటోళ్లు లచ్చణంగా వుంటేనేకదా మాలాంటోళ్ళకు నాలుగేళ్ళు నోట్లోకి పోతావుండేది. మా ఆయుస్సుకూడా పోసుకోని సల్లంగా నూరేండ్లు బతకండయ్యా!"

"ఎందుకురా తండ్రీ!....వానల్లో పూడెత్తించి యింకా మీలాంటోళ్ళను సంపేదానికా?"

"మల్లా మల్లా మీరా మాటంటావుంటే మా గొంతులుగోసి నెత్తురు తాగినట్లే!–అట్టనద్దండయ్యా!– మీర్సంపినారని మేఁవేఁవన్నా సెప్తావుండావా?"

"సెప్పకుండా సెప్తావుండార్రా మీరు. అదే మీ గొప్పతనం."

"గొప్పోళ్ళు. మీ రట్లా మాట్లాడద్దయ్యా!"

"మాట్లాడాలని దొమ్మికట్టుకొనొచ్చింది మీరు. మాట్లాడ్తావుండేది మీరు. మాట్లాడద్దనేది మీరు ఎట్టా సావర్రా ఈ సావు?"

"తఁవరు కాసింత గొప్ప మణుసు సెయ్యాలయ్యా!"

"అఁ–ఁటే?"

"అది మీబాయి...."

"ఆ మాట చెవిని పడడంతో పందిరి అమాంతంగా పైకెగిరిపోతుందేమో? అన్నంతగా విరగబడి నవ్వుతున్నాడు ఓబుల్ రెడ్డి.

ఆ నవ్వులోని అంతరార్థం అంతుదొరక్క– నిలువురాళ్ళు తేలమొగమేసినాయి.

నవ్వి నవ్వి యింక నవ్వలేనట్లుగా సేద తీర్చుకొంటున్నారు రెడ్డిగారు.

పందిరికింద మళ్ళీ కొన్నిక్షణాలు మౌనం నెలకొనింది.

రెడ్డిగారు గొంతు సవరించుకొన్నారు.

పందిరికింద జీవులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

"అది నా బాయి కాబట్టీ.... వాడు నా బాయిలో పూడెత్తా వుణ్ణాడు కాబట్టీ పూడెత్తావుండి సచ్చినాడు కాబట్టీ – సంపింది నేను కాకపోయినా సచ్చిందానికి వారసుణ్ణి నేను!– అంతేనా మీ రనేది?"

ఆ కూత కూసేదానికి మేఁవేఁవన్నా కడుపుకు గడ్డి తింటావుండాఁవా?

"అయితే మీరనేదేఁది?"

"సచ్చినోడి రెక్కలు కష్టాన బతకతావుండ్రి - అదీ దానికొడుకు యిద్దో యీ బుడంకాయంటి బుల్లోడు. ఇప్పుడు దిక్కూదరీ లేకుండా నిలబడిపోయిరి. వాళ్ళ కేదైనా వొకదోవ సూపించమని మే వంగలారస్తావుండేది."

"ఒరె అబ్బోళ్ళూరా! నాకు తెలియకుండా అడగతావుండా ఎవుడో ఒకడు దారినబొయ్యే దానయ్య. మా కయ్యల్లో గెనివిలమింద నడస్తావుంటాడు. యాణ్ణుంచొస్తుందో ఒకపాము వస్తుంది. వచ్చి కాటేస్తుంది. వాడు నడస్తావుణ్ణింది మా గెనివిమింద కాబట్టి.... ఆ పాంవుగూడ మా కయ్యల్లోనుండే వచ్చింది కాబట్టి_అప్పుడు కూడా యిదేమాదిర మీరందరూ నాయింటిమిందబడి ఆ పాంవు గర్చి సచ్చినోడిగ్గూడా వొకదోవ సూపించమని నిల్దీసేటట్టుగా వుండికదరా?"

"ఎవరి కరమ కెవరు బాద్దులయ్యా!_ దీని కరమిట్టా కాలింది కాబట్టి మీ కాళ్ళకాడబడి యేడస్తావుండాం. బతికేదానికి దానికొక దోవ సూపించమని అంగ లారస్తావుండాం!"

"బలే యిచ్చిత్రంగా మాట్లాడ్తావుండారు గదరా మీరు. నేనేంవన్నా ఈ మంచాన్నొదిలి పైకి లేస్తావుండానా? యాడైనా తిరగతావుండానా? పదిసోట్ల తిరి గేది మీరు. పద్దోవలు తెలిసినోళ్ళు మీరు. యాదోవ ఎట్లాపోతుందో? యాడికి పోతుందో?_ నే జెప్పాల్నా మీకు?_ నేనా మీకు దోవలు సూపించాల?"

ఆ మాటలతో ఆ నిలువురాళ్ళల్లో ఒకరాతికి అంత చల్లటిపూట కూడా కడుపుమండినట్లుంది. ఆ కడుపుమంటను తట్టుకోలేక నోరు చేసుకొనింది.

"అయ్యా! మీరు పెద్దోళ్ళు. పెద్దోళ్ళు పెద్దోళ్ళు పరాసికాలాడుతుంటే యినే దానికింపుగాఉంటుంది. మేవేంది?_ మీ మోసేతలకింద బతికేవాళ్ళం. మీకు సెప్పగలిగినంతోళ్ళం గాంవు. మాటకుమాట తెగులు నీళ్ళకు పాసితెగులు."

"అయితే నేను మాటకుమాట మాట్లాడ్తా వుండాననా మీ రనేది?" రెట్టిం చినాడు ఓబుల్ రెడ్డి.

"ఆ యదవకేం తెల్సులేవయ్యా?_ నోరు పారేసుకుండేది తప్పితే - ఒరే!_ నువ్వు నోరు మూసుకుంటావా? లేదా? "

"వాణ్ణెందుకురా నోర్మూయ్యమంటావ్? మాటకు మాట మాట్లాదే నేను నోర్మూయ్యల్లగానీ!"

వ్యంగ్యం తొణికిసలాడుతూ వుంది రెడ్డిగారి మాటల్లో?

"మేంవేంవీ మీతో జగడానికి రాలేదయ్యా!"

మళ్ళీ నోరుచేసుకొనిందా కడుపుమండిన నిలువురాయి.

"ఒరే సాఁవీ! నీ కాళ్ళకు మొక్కుతాం. నువ్వు కాసేపు ఊరికేవుంటావా లేదా? రెడ్డిగారంటే అలససొలస్సయిన మణిసనుకున్నావా?– పాలన్నం తినే పది మంది పెద్దోళ్ళకు పెద్ద. అయనకు మనం చెప్పాల్నా? సేసేదేందో ఆ మహాన్న బావుదే సేస్తాడు."

ఆ మాటలతో ముసిముసిగా నవ్వుకున్నారు రెడ్డిగారు.

"అయితే నన్నిప్పుడేం జెయ్యమంటార్రా!– పెద్దోళ్ళకు పెద్దోణ్ణికాబట్టి సచ్చినోణ్ణి బతికించిగానీ తెమ్మంటారా?"

"అదయ్యేపనా? పొయ్యేపనా సాఁవీ!"

"సరే! అదయ్యేపనిగాదని మీరే వొప్పుకుంటా వుండారు. బాగుండాది. శానా బాగుండాది. అయితే యింక జరిగేపనేదో మీరేచెప్పండి."

"సెప్పింది సేసిపెట్టి పెట్టింది తినే జలమాలు మావి. మేఁవేఁవని సెప్పే దయ్యా!– మా మొకాల కంతమాత్రంబగిశా!"

"........పొయ్‌నోడెట్టా పొయ్‌నాడు. పోనీ! వాడిస్తావుణ్ణనుకఁవన్నా యిద్దాఁవనుకుంటే!...."

ఆ మాటలతో కూడా నవ్వందుకున్నారు రెడ్డిగారు. ఆయన నవ్వుతూంటే చిన్న బానసైజు కడుపు చిత్రంగా కదులుతూ ఉంది. అతని అనుయాయులు విరగబడి నవ్వుతుండారు. నిలువురాళ్ళ ఎఱ్ఱబడిన కండ్లు ఎవరికంటా పడకుండా తలలు వంచుకున్నాయి.


అంతవరకు తలవంచుకొని నిలబడి వుండిన ఆతడి తోకతొక్కిన త్రాచులా తల పైకెత్తింది.

ఆమెకండ్లు నిప్పులు కక్కుతున్నాయి.

ఆమెపక్కన నిలబడుకొన్న కుఱ్ఱవాడి పెదవినిమునిపల్లు కొరుకుతూఉంది.

'చాలు చాల్లేబ్బా యింక నవ్వింది!' అన్నట్లుగా రెడ్డిగారు నవ్వు అపుకొన్నారు. నవ్వు నాపుకొంటూ రెడ్డిగారు నాజూగ్గా ఆ ఆడదానివైపు చూచినారు.

"అదేందే? నీ యమ్మమగొట్టా!– అట్లా సూస్తావుండావ్?– నేనేవన్నా మాడి మసైపోతే కష్టఁవే!– నీ మొగుడిమిందాదారపడింది నువ్వా నీ కొడుకే! నా మింద శానామంది దాదారపడ తుంటారే!– నువ్వు జూసే సూపుల్తో నేనేఁవన్నా అయ్‌పోతే శానాకష్టఁవే!– ఆయినా నీ యమ్మాబడవా?– నువ్వెందుకే అట్లా సూస్తావుండావ్?– పోనీ! నాకేఁవయినా వయిసా? వల్లకాదా?– నేనేందో మాటొ రసకంటే దాన్నే పట్టుకో నూగులాడ్తే ఎట్నే?"




“లేదులే మాఁవా, సీతమ్మోరు పోతాపోతా వుంది దీన్నిట్టా భూమ్మీద పెట్టేసిపొయ్యింది. అందుకే దానికంత ఉక్రోషం!– సూడుమాఁవాసూడు దానికా ముక్కు–మీద కోపంసూడు!”

రెడ్డిగారి తొత్తుల్లో ఒక తొత్తు 'వక్కా–కుతిత్తి'లో చెయ్యేస్తూ కులకతా పలికింది.

ఆ ఆడది పందిరి చుట్టూ కలయచూసింది.

రెడ్డిగారు ఒకమాదిరిగా చూస్తూ యింకొక మాదిరిగా నవ్వుతున్నారు. చుట్టూ కొలువుతీరిన తాళగాళ్ళు, మేళగాళ్ళు ఒకరి మొగం ఒకరు చూసుకొంటూ ముసిముసిగా నవ్వుతున్నారు. కొందరు ఆనందాన్ని చేతివేళ్ళకెక్కించి ఆ ఆనందాన్ని తట్టుకోలేకుండా ఆ వేళ్ళని ఒక్క–మోపున నలుపుతున్నారు. నిలువు రాళ్ళ వంచిన తలెత్తలేదు. ఆమె గబాలున తలవంచింది. భూదేవికి కూడా ఆమెమీద కనికరం కలిగినట్లులేదు.

ఆమె అలనాటి సీతమ్మతల్లి కాదుగదా మరి!–

అందుకే ఆమె గిరక్కు–న వెనక్కు– తిరిగింది. చరచర నడుస్తూ ఆ పశువుల కొట్టాన్ని– కాదు ఆ కాలకూట విషకూటాన్ని దాటి వీధిన పడింది. పద్నాలుగేండ్ల పసివాడు కన్నీళ్ళ సందుల్లోనుండి ఆ సంతను కసికసిగా తిరిగి తిరిగి చూస్తూ తల్లి వెంట పడినాడు.

నిలువురాళ్ళ వంచిన తలలెత్తలేదు.

కట్టిన చేతులు కూడా విప్పలేదు.

"ఇదింకా బలే బాగుండాదే- అత్తమీద కోపం దుత్తమీద సూపించి నట్టుండాదే దీనెవ్వారం. ఇదేఁవన్నా గెవర్నమెంటా?- కాలిరిగితే రెండువేలు.... కండ్లుబోతే మూడువేలు.... సస్తే పదివేలు అని లెక్కగట్టిచ్చేదానికి అదంతా యేఁవీ కుదర్దు గనీ- కావాలంటే తల్లీకొడుకులిద్దర్నీ యీ యింట్లో పనీపాట సేసుకోని బతకమనండి."

రెడ్డిగారి తీర్పుకు మార్పురేదు.

అంతేనంటే అంతేనని తాళం వేసినారు తొత్తుగాళ్ళ.

నిలువురాళ్ళ చేసేది లేక వెనక్కు తిరిగినాయి. నెమ్మదిగా ముందుకు కదిలినాయి. పశువుల కొట్టం దాటబోతున్నాయి.

"ఒరే నర్సిమ్మా!"

గారమీద పడిన పాదరసంలా రసమయంగా జాలువారిందీ మాట రెడ్డిగారి నోటినుండి.

"ఏం మాఁవా?-" రెడ్డిగారి పక్కన ఆసీనులైన మేళగాళ్ళ, తాళగాళ్ళల్లో వొక తొత్తుగాడు బదులు పలికినాడు?

రెడ్డిగారేం చెబుతారో? ఏమో? అని నిలువురాళ్ళ ఒక్క క్షణం నిల బడినాయి.

రెడ్డిగారి వాకిట్లో ట్యూబ్‌లైట్ రాత్రిపూట విద్యుచ్ఛక్తి సరఫరా ఎక్కువ అయిందేమో? మరింత కాంతివంతంగా ప్రకాశిస్తూ ఉంది. ఆ వెలుగులకే వెలుగుదెచ్చే రీతిలో రెడ్డిగారి కొలువు కూటం వెలిగిపోతూ ఉంది.

"ఒరే నర్సిమ్మా! నీకేఁవయినా అంతుండాదంట్రా తలకాయలో?"

రెడ్డిగారు అడగడంతో నర్సిమ్ముడికూడా సందేహం వచ్చినట్లుంది. ఒక మాదిరిగా నవ్వుతూ యింకొక మాదిరిగా తలగోక్కుంటున్నాడు.

"ఒరె! ఒరే! ఆ తలకాయిలో యాఁవుంది వుండకపోయినా దిక్కు మాల్నన్ని పేన్లు మాత్రం వుంటాయి. ఎందుకట్లా గోకతావ్?- రేప్పొద్దున్నే కావాలంటే ఆ తలకాయికిఁత అగ్గి పెట్టచ్చులే!- యిప్పుడేఁవయినా జరగాల్సిన పని సూసేదుండాదా? లేదా?"

మేళగాళ్ళ, తాళగాళ్ళ ముసిముసిగా నవ్వుతూ ఉంటే నర్సిమ్ముడు సిగ్గ

పడిపోయినాడు. ఆ సిగ్గులోనుండి తేరుకోవడానికి రెండునిముషాలు పట్టింది. ఆ తరువాత–

"జరగాల్సిందేదో జరిగిపాయినే!– యింకా జరగాల్సిందేవుండాదబ్బా!"

"అందుకే గదరా నీకు మూళ మోకాళ్ళల్లో వుండాదనేది!"

"మాఁవా! నువ్వుండావే!– సేతికట్టా దొరికితే సాలు మాఁవా!– సాగ బెరికేదే గదా పని. తలజుట్టు నోటికాడికి రాకపోతే ఆ సెప్పేదేందో సరిగ్గానే సెప్పేస్తే పోలా?"

"ఒరె ఒరె! నాయాలా నీకు కోపం గూడా వస్తుంది గదరో!– నాకు తేల్నెల్లు. అయితే యింక పరవాలే!– బతికిపోతావ్!"

"నీ బొందిలో వూపిరుణ్ణంతవరకు మాలాంటోళ్ళకేం దిగులు మాఁవా! ఎట్నో ఒకట్ట బతికిపోతాంలే!"

ఆ మాటతో ఓబుల్‌రెడ్డి నిజంగా ప్రసన్నచిత్తుడైనట్లుంది. ఆ ప్రసన్నత అందు యిందు అన్న సందేహం లేకుండా వాళ్ళంతా కళ్ళు చేసుకుంటే ఓబుల్ రెడ్డిని చూడడానికి కండ్లు చాలడంలేదు.

నర్సిమ్ముడికి కాస్త హుంషారెక్కింది.

"ఇప్పుడు నన్నేం జెయ్యమంటావు సెప్పు మాఁవా!"– కొండల్ని పిండి చెయ్యగలిగినంత ధీమాగా అడిగినాడు.

"అదిగాదురా నర్సిమ్మా!.... ఈ మద్దిస్తానికని వాళ్ళొచ్చిందెప్పుడు? సంద కాడొచ్చినారా? ఊరుమాటు మణిగేదాకా నిలువుగాళ్ళమింద నిలబడినారా? అహఁ! వాళ్ళేఁవన్నా తూగుటుయ్యాలమీద హంసోని ఊగులాడ్తా వుండొచ్చినారను కుణ్ణావా? పొద్దుగూకులూ పొలాల్లో వంచిన్నడువెత్తకుండా పోరకలాడ్తా వుండి గదరా వచ్చినారు, ఈ మద్ది స్తం గిద్ది స్తం లేకుండా వుంటే పాపం! యియ్యరవకు యాడోళ్ళాడ పడి నిద్దరబొయ్యేవాళ్ళు. అట్టాంటోళ్ళను యాఁవయినా గెవినిద్దాఁవనే బుద్దుండక్కర్లా నీకు? అహఁ! ఉండాల్నా? పన్లేదా నువ్వే జెప్పు."

నిలువురాళ్ళు నిలువుగుడ్లేసి ఒకదాని మొగం యింకొకటి చూసుకొంటు న్నాయి. రెడ్డిగారు అమాంతంగా కుమ్మరించిన దయారసంలోపడి అటుయిటు కదలలేకపోతున్నాయి. మోడులు చిగిరించినట్లు మాడిన మొఖాల్లో మొలకనవ్వులు మొలకెత్తుతున్నాయి.

"నువ్వు జెప్పింది అచ్చిరాలా నిజంగద మాఁవా!– ఆ మాత్రం వాళ్ళను గెవనించకపోతే వాళ్ళుసురుకొట్టదా మనకు!– దీనెమ్మనుగొట్టా ఈ బుద్దుండాదే

అప్పుడప్పుడు కాసింతడిమ్ముగొట్టేస్తింది మాఁవా!- నీబోటోళ్ళు అప్పుడట్లా తట్టొదిత్తే నాసాఁవిరంగా!- యింకడ్డం అపూవుండదనుకో!"

ఆ మాటంటూనే- నర్సిమ్ముడు చివుక్కున పైకిలేచినాడు. తుండుగుడ్డ విదిలించి భుజాన వేసుకొంటూ, 'ఒరే చెంగా! వాళ్ళందర్నీ తీసుకోని అట్టతిరిగి యింటెనక్కు రారే!' అంటూ నర్సిమ్ముడు యింటివెనక్కు నడిచినాడు.

నిలువురాళ్ళు గబగబ వీధిన పడినాయి.

పందిరికింద వెండివెలుగుల్ని వెదజల్లుతుండిన 'ట్యూబ్‌లైట్' ఆరిపోయింది. ఒక్కసారిగా పందిరి కింద చీకట్లు ఆవరించినాయి. మేళగాళ్ళు, తాళగాళ్ళు ఒక్కొక్కరుగా బయటపడినారు. 'సేతిలో కవళమున్నంత వరకు యా కుక్కయినా తోకాడించాల్సిందే!' అనుకొంటూ రెడ్డిగారు తృప్తిగా పట్టె మంచంమీద పవళించినారు. మరి కాసేపటికి యింట్లోనుండి వెలువడుతున్న గురకలకు తాను కూడ శ్రుతికలిపినాడు.

## 2

ఆ ఊరిపేరు దశకంతాపురం.

రామ రావణయుద్ధం మహాభీకరంగా జరుగుతూ ఉందట! రాముడు రావణుని తలల్ని తెగనరుకుతున్నాడట! ఆ తలలు మళ్ళీ మొలుస్తున్నాయట! రాముడు తెగనరకడం అవి మళ్ళీ మొలవడం క్రమం తప్పకుండా జరుగుతూ ఉందట!- పాపం 'సీతాపతి యిక చిరుచాపేగతి!' అని అనుకొంటున్న తరుణంలో విభీషణుడు రాముడికి రావణుని కడుపులోని అమృతభాండ రహస్యాన్ని చెవిలో ఊదాడట! అప్పుడు సాక్షాత్ శ్రీరామచంద్రమూర్తి కలగన్నట్లుగా మేల్కొని రావణాసురుడి ఉదరంలోని అమృతభాండాల్ని తునాతునకలుగా ఛేదించినాడట!

రావణ సంహారం జరిగిపోయింది! !-

___అని అనుకొన్నాడట పిచ్చివాడు- రాముడు! కానీ తాను రావణాసురుని తలల్ని తెగనరుకుతున్నపుడు ఆ రక్తం దశదిశలా వెదజల్లినట్లు ఎగిరిపడిందనీ, అట్లా ఎగిరిపడిన చోటంతా ఒకపురం వెలసిందనీ, ఆ పురం పేరే దశకంతపురమనీ, అట్లాంటి పురాలు ఈ పవిత్ర భారతదేశంలో చాలా వున్నాయనీ, ఆ పురాల్లో రావణాసురుడి అంశను నిలబెట్టడానికి ఏదో ఒక కుటుంబంలో ఎవరో ఒక మహానుభావుడు జన్మించే వున్నాడనీ, ఆ మహానుభావుల జోలికిపోతే ఎట్లాంటి

రాముడైనా సరే, గెలవడం మాట అటుంచి బలిఅయిపోతున్నారనీ ఆ రాముడికి తెలియదు!-

అప్రకపరాక్రమ విక్రమోపేతుకు సాక్షాత్ రావణాసుర సార్వభౌముని అంశమే మన ఓబులేసురెడ్డిగారు!

రావణాసురుడికి పది తలలు. ఇరవై చేతులు, పుర్రెకొక బుద్ధి అయితే కూడా పది తలలకు పది రకాలైన అభిప్రాయాలే!- కానీ ఓబులేసురెడ్డిగారికి మాత్రం తల ఒక్కటయితే కూడా ఆ తలకాయనిండుకు పదిపదుల వంద రకాల బుద్ధులు. ఇక వున్న యిరవై చేతుల్లో ఏ చెయ్యి యే సీతమ్మను అపహరిస్తుందో, ఏ చెయ్యి యేకొంపకు ఎసరు పెడుతుందో, ఏ చెయ్యి యెవరి భుజం తడుతుందో, ఏచెయ్యియెవరినెత్తిన మెట్టుతుందో, ఏచెయ్యి జుట్టందకపోతే కాళ్ళు పడుతుందో, ఏ చెయ్యి యింకొక చేత్తో కలుస్తుందో, ఏ చెయ్యి యింకొక చేతి కిందికి వెళ్ళుతుందో తులుసుకోవడం మహాకష్టం.

దశకంఠాపురంలో దాదాపు వంద గడపలున్నాయి. గడపగడపకు సరాసరి పదిమందికి తక్కువ లేకుండా ఉన్నారు. కూతదవ్వులో హరిజనవాడ వుంది. వాడలో యించుమించు పురం జనాభాలో సగానికి పైబడి ఉన్నారు ఇంతమందిలో కొంతకుకొంత మంది చదువుకున్నోళ్ళున్నా రెడ్డిగారిని మాత్రం ఎవ్వరూ చదవ లేకపోయనారు. అందుకే పురంలోని ప్రజలకు వాడలోని జనులకు ఆయన రావణాసురుడు కాదు. రాముడే! వాళ్ళందరు హనుమద్భక్తులు!

మన దేశానికి దక్షిణపు చివరన లంకాపురముంది.

మన రాష్ట్రానికి దక్షిణపు చివరన్నే దశకంఠాపురముంది.

నాడు నేడు కూడా లంకాపురిని చుట్టినీళ్ళే!

అయితే ఆ సముద్రజలాన్ని కనీసం ఉప్పు కోసరమైన రావణాసురుడు వాడు కొన్నాడో? లేదో? తెలియదు.

దశకంఠాపురం చుట్టూ ఓబులేసురెడ్డిగారి యింటిచుట్టు ప్రాకారంలా కొండలు. ఒకప్పుడవి దట్టమైన అడవులు. ఇప్పుడేమో గొరిగేసిన తలల్లా కొండలు.

ఆ కొండలు దట్టంగా ఉన్న రోజుల్లో రెడ్డిగారు దిట్టంగా వాడుకొన్నారు.

రెండవ ప్రపంచ మహాయుద్ధం ముగిసింది. యుద్ధం దేశదేశాల మధ్య జరిగినా, రాష్ట్రాల మధ్య జరిగినా, పట్టణానికి పట్టణానికి మధ్య జరిగినా కడకు మనిషికి మనిషికి మధ్య జరిగినా దాని ప్రభావం తప్పకుండా జీవనగతి మీద

పడుతుంది. జాతి ఎన్నో కొరతల్ని ఎదుర్కొనవలసి వస్తుంది, అట్లాంటి కొరతల్లో పెట్రోలుకు తీవ్రమైన కొరత యేర్పడింది.

ఈ కొరతలకు ఆధునిక శాస్త్రానికీ మధ్య నిత్యపోరాటం మూడు పువ్వు లారుకాయలుగా నెలారుతూ ఉంది. తత్ఫలితంగా ఒకటి కొరతపడితే మరొకటి ఆ కొరతను ఆదుకోగలుగుతూ ఉంటె.

ఆ రోజుల్లో పెట్రోల్ కొరతను బొగ్గు ఆదుకోగలిగింది.


మోటార్లు బొగ్గుతో నడుస్తున్నాయి:

మోటారు వెనుక భాగాన ఒక పెద్ద యినుపపీపా అమర్చుతారు. ఆ పీపా నిండుకు బొగ్గు నింపుతారు. నిప్పుపెడతారు. ఆ పీపా అడుగుభాగాన ఒక బ్లోయర్ ఉంటుంది. దాన్ని తిప్పితిప్పి ఆ గాలితో బొగ్గును రగలపెడతారు. ఆ వేడినుండి ఒక రకమైన ఆవిరిని ఉత్పత్తి చేస్తారు. ఆ ఆవిరికి శక్తి ఉంటుంది. ఆ శక్తితో మోటారు నడుస్తుంది. అందువల్ల బొగ్గుకు విపరీతమైన గిరాకీ యేర్పడింది.

ఆ అవకాశాన్ని ఓబులేసురెడ్డి సవ్యంగా వాడుకొన్నాడు.

తన పట్టాభూమిలో ఒక చింతచెట్టునో వేప చెట్టునో కొట్టించేవాడు. ఆ చెట్టు నేల కూలుతుంది. తరువాత మూరెడు బారెడు తుంటలవుతూ ఉంటుంది. అది అట్లా అవుతూ ఉండగానే అడవినుండి వేప, వేంగి, మద్ది, చిగరలాంటి మరో పదిచెట్లు తోడుకలుస్తాయి. రిజర్వ్డు ఫారెస్టులోని మహామహావృక్షాలు రెడ్డిగారి పట్టాభూముల్నిచేరి మూరెడు మూరెడు తుండ్లుగా రూపాంతరం చెందుతాయి.

ఆ తరువాత రెండు పచ్చిమొద్దుల్ని నేలమీద రెండు సమాంతర రేఖల్లా పండబెడతారు. ఆ మొద్దులమధ్య వరిపొట్టుపోస్తారు. ఆ పొట్టుమీద నాలుగు ఎండుపుల్లల్ని, కిరసనాయిల్‌తో తడిపిన పిడకముక్కల్ని పెడతారు. తరువాత ఈ మూరెడు బారెడు కొయ్యతుండ్లని సమాంతరంగా నేలపరచిన మొద్దుల ఆధారంగా ఒకదానిపక్క నొకటిగా పేర్చుతారు. అట్లా పేర్చుకుంటూపోతే మూటు తయారవుతుంది. ఆ మూటు అర్ధచంద్రాకృతిలో ఉంటుంది. అంటే ఒక వెదురుబుట్టను నేలమీద బోర్లించినట్లుంటుంది, ఆ అర్ధ చంద్రాకృతిలో వున్న మూటుమీద పచ్చనిఆకు పరుస్తారు. ఆ ఆకుమీద సుమారు నాలుగడ్డేళ్ళ మందంతో నీళ్ళ తడిపిన మట్టితో కప్పేస్తారు ఆ తరువాత మూటుకు నిప్పు పెడతారు. అది అంటుకొనిందని తోచగానే నిప్పుపెట్టడానికి వదలిపెట్టిన రంధ్రాన్ని కూడా కప్పేస్తారు.




మంటమండితే కట్టెకాలి బూడిద మిగులుతుంది. అట్లా కాలకుండా లోలోపల ఉడికితే కట్టె బొగ్గుగా మారుతుంది.

కట్టె బొగ్గుగా మారేటప్పటికి మూటసైజు తగ్గుతుంది. ఆ తగ్గుదలను గమనించి మూటు విప్పుతారు. అది అనుభవం. విప్పిన మూటులో అక్కడక్కడా అగ్గికణాలుంటే నీళ్ళు చల్లి ఆర్పుతారు. ఆరిన చల్లారిన బొగ్గును గోలాలకు భర్తీచేస్తారు. భర్తీచేసిన బొగ్గులమూటల్ని రెండెడ్ల బండ్లకెత్తుతారు. బండికి దాదాపు యిరవై మూటలు భర్తీచేస్తారు.

రెడ్డిగారి పట్టా భూముల్నుండి దినానికి కనీసం రెండు బండ్ల బొగ్గులు బయలుదేరతాయి, నిర్భయంగా:- 'అవి రెడ్డిగారి పట్టాభూముల్లోని చెట్లనుండి తయారుచేసిన బొగ్గులే' అని గ్రామ మునసబుగారిచ్చిన సర్టిఫికేట్టు కొండంత అండగా ఉండగా:-

మరికొంత కాలానికి డీసెల్ ఆయిల్ పెట్రోల్ కొరతను ఆదుకొనింది.

బొగ్గు విలువ బాగా పడిపోయింది.

పడిపోయిన దానిని పైకెత్తాలని ప్రాకులాడే మనిషి కాదు ఓబులేసురెడ్డి. అందులో అప్పటికే ఊరుచుట్టూ వున్న కొండలు తిరుపతి బోడిగుండుల్లా దర్శనమిస్తున్నాయి. కట్టె తెప్పించాలంటే మరీ దూరంగా పోవలసివస్తూ ఉంది.

అప్పుడు శ్రమకు తగిన గిట్టుబాటు ఉండదు. గిట్టుబాటులేని పనులన్నా, మనుష్యులన్నా రెడ్డిగారికి అసలు గిట్టదు.

పది మడకల సేద్యం పకడ్బందీగా జరిగిపోతున్నా కూటిమింద కూరగా ఏదో ఒక వ్యాపారం చేయకపోతే రెడ్డిగారికి ఎట్టెట్నో ఉంటుంది. ఎట్టెట్నో వుంటే అసలు ఆయనకేమీ తోచదు. తోచకుండా బతుకును తొయ్యడమంటే ఎవరికైనా కష్టమే!-

ఓబులేసురెడ్డిగారు ఒక మోపన ఆలోచిస్తా వుంటే- మనకు స్వాతంత్ర్య వచ్చేసింది. స్వాతంత్ర్యం వచ్చేసిందని ఊరూ వాడా యేకమై పండుగ చేసుకుంటా ఉంటే- రెడ్డిగారికి మాత్రం పాలుపోలేదు. అయితే ఆ తరువాత రెండు మూడేండ్లకే గాంధేయులందరు కలసి మద్యపాననిషేధం అమలుపరచేసరికి రెడ్డిగారి గుండె ఊడెగిరి ఆడ దూకింది!-

అంటే- రెడ్డిగారికి మద్యపాననిషేధమంటే మహాయిష్టం అనుకొంటే అది పొరబాటు. అయితే రెడ్డిగారు కొద్దికొద్దిగా పుచ్చుకొంటారా అంటే అదీ పొరబాటే!-

అదీ పొరబాటు ఇదీ పొరబాటు. ఇంకేది సరైన రూటంటే- రెడ్డిగారు శుద్ధఖద్దరు కడతారు. ఎదుటి మనిషి కట్టుకొంటే- వేలెత్తి చూపనట్లే చూపుతారు.

'స్వాతంత్ర్యం మన జన్మహక్కు!' అంటారు. ఎవరైనా కాస్త స్వతంత్రించి మాట్లాడితే చాటుమాటుగా వాణ్ణి సరిచేస్తారు.

'తాగని జన్మం ఒక జన్మమా?' అని దర్జాగా సూక్తీకరిస్తాడు. కానీ తాను మాత్రం అది స్వదేశీ సరుకైనా విదేశీ సరుకైనా వాసన చూచిన పాపాన పోడు.

అయితే స్వాతంత్ర్యం రావడానికి, మద్యపాననిషేధానికి, రెడ్డిగారి గుండె ఊడెగిరాడ పడడానికి సంబంధ మేమిటంటే?- రెడ్డిగారు అవకాశం వస్తే దాన్ని అదృష్టంగా మార్పించి కనకవర్షం కురిపించుకోవడంలో మహామేధావి.

ఆ మహామేధావి యింటిముందర వాకిట్లో పట్టెమంచం మీద నింపాదిగా కూర్చున్నాడు. మనిషిలో చలనం లేకున్నా మనస్సులో సంచలనం.

"నాలిక! దీనెమ్మనుగొట్టా ఒక్కసారి రుసి మరిగిందంటే మానుకోవాలంటే మాతామహులు దిగిరావాల్సిందే!- అదేఁవంత అల్పసొల్పమైన పనిగాదు. లేకుంటే పిచ్చయ శాస్త్రిలెట్టాంటోడు. ఎఁవికలు కొరికే నల్లో అయినా సరే, ఉచ్చి పీకేసే ఎండలోనైనా సరే ముప్పూటలు మంచినీళ్ళ గుంటలో ముక్కులు మూసుకోని మునగాల్సిందే!- సందెవార్చుకోవాల్సిందే- అట్టాంటోడి కడుపులో

ఎట్టాంటోడుపుట్టె!- పేరేఁవో శ్రీరంగం. దూరేదేఁవో దొమ్మర గుడిసెల్లో. దూర్తే దూర్నాడు. ఎట్టా మరిగినాడో కోడిని తినేదానికి మరిగినాడు. నా సాఁవిరంగా యిప్పుడు వాడొక్కడే ఒక్క కోడిని అలాగ్గా లాగేస్తా వుండాడు. అది వాడి తప్పు గాదు. రుసి మరిగిన నాలిక తప్పు. అట్టాంటప్పుడు పొద్దు గూట్లో పడ్తానే నోట్లో అంత పడకపోతే నిద్ద్రరాని జలమాల గతేం కావల్ల? సరుకు దొరక్క వాళ్ళ పాణాలు యిలయిల్లాడి పోతావుంటే సూస్తా ఎట్లా వూరుకోవల్ల? ఆదుకుంటే అట్టాంటి జలమాల్నే ఆదుకోవల్ల. లేకపోతే ఆ జిల్సం ఉంటే యేం? పోతేనేం?"

పట్టెమంచం మీద కూర్చుని యిట్లా ఆలోచిస్తున్న తరుణంలో-

ఊరులోని ఉప్పురాయి- అడివిలోని ఉసిరికాయి

చేరదీసి ఊరుగాయ- చేసెనయ్యా దేవుడు!-

తత్త్వం చెవిని పడింది. రెడ్డిగారు ఒక్క క్షణం ఆలోచనలకు ఆనకట్ట వేసి వీధివైపు తేరిపార చూచినారు. వీధిలో ఎవరో ఒక బిచ్చగాడు. తత్త్వాన్ని పాడుతూ బిచ్చమడుక్కుంటున్నాడు.

ఆ పాట చెవిని సోకేసరికి రెడ్డిగారి ముఖం వికసించింది.

గాదెల్లోని బెల్లంచెక్క- అడివిలోని తుమ్మచెక్క

ఊరేసి కడవల్లో కాసలేనా సారాయ్ కాసలేవా?

రెడ్డిగారికి తెలియకనే నండూరివారి ఎంకి గొంతులో కొట్లాడినట్లు, పాట రెడ్డిగారి గొంతులో కొట్లాడింది.

'ఏం? ఎందుక్కాసలేను?' అని తన్ను తానే ప్రశ్నించుకొన్నాడు.

అయితే అక్కడే ఒక్క చిన్న ధర్మసందేహం కలిగింది.

"కద్దరు గట్టే మణిసి! .. సరుకు వాసనెరగని మణిసి!.... సారాయి కాసచ్చునా? అని."

సందేహం కలగడమే తరువాయి. రెడ్డిగారి మనసులో భారతం మిట్ట మెదిలింది. భారతం మిట్టమీద కొటాయిలో పగటికథ చెప్పే 'అయ్యోరు' కనుల ముందు నిలబడినాడు. ఆయన కాలికి గజ్జెకట్టి కరతాళం చేతబట్టి మృదుమధురంగా చెప్పిన ధర్మవ్యాధుని కథ చెవుల్లో గింగురుమనింది.

రెడ్డిగారి సందేహం సూర్యరశ్మి ముందు మంచులా కరిగిపోయింది.

వ్యాపారం వ్యాపారమే!... వ్యవహారం వ్యవహారమే!!... అనుకొన్నాడు.

అయినా మనస్సులో బెరుకు ఎలిబెరుగ్గానే ఉంది.

"ఏందయ్యా పెద్దమణిసీ? నువ్వా యిట్టాంటి యాపారం చేసేది? అని

ఎవరైనా నిర్ధిస్తే?- అట్లా నిర్ధిసే యదవ ఎతికినా ఆ పాయకట్లో లేదనుకో! ఒకేళ ఉంటే?.... ఉంది అడిగితే?.... ఏఁవని చెప్పాలి?"

ఒక్క చిటికెడు ముక్కుపొడుం పీల్చినంతసేపు చిక్కంగా ఆలోచించినాడు రెడ్డిగారు.

"అడువులమిందబడి తుమ్మసెక్క తెచ్చేదాని కెంతమంది కావల్ల? ఇప్పపూత దూసకొచ్చేదాని కెంతమంది కావల్ల? కాసడానికి కట్టేకంపా కూడేసేదాని కెంతమంది కావల్ల? నీళ్ళుదెచ్చి ఊరేసేదాని కెంతమంది కావల్ల' కాసేదాని కెంతమంది కావల్ల? కాసిందాన్ని నెత్తిబరువులు మోసేదాని కెంతమంది కావల్ల? ఇంతమంది కిన్నివిధాలుగా జీవనాధారం కలిగిస్తావుంటే - ఎవుడైనా అడిగితే సెప్పలేనా? ఈ దేశంలో ఒక్కొక్క మణిసి యింతింతమందికి జీవనాదారం కలిగిస్తాపోతే ఈ దేశం బాగుపడే దెంతసేపు?"

ఈ ఆలోచనలో రెడ్డిగారికి ఎక్కడలేని తెంపువచ్చింది.

కవిత్వంవచ్చినా కక్కువచ్చినా అగదంటారు. కానీ రెడ్డిగారికి తెంపు వచ్చిందంటే అరక్షణం ఆగడం అతడితరంకారు.

ఊరికి ఉత్తరంగా గూటంకొండ. గూటంకొండ పక్కన్నే పరకగుట్ట. ఆ గుట్టకు కొండకునడుమ ఒక లోయ. ఏ కాలంలోనో యేమో కాస్త దూర దృష్టి కలిగిన బుద్ధిమంతులు ఆ కొండదడిలో మట్టినిగొట్టి ఆ లోయకు అడ్డంగా పోసినారు వానలు కురిస్తే వాగులుపార్తే ఆ నీళ్ళు కట్టఅడ్డుతో ఆగిపోతాయి. అప్పుడది ఒకగుంట అవుతుంది. ఆ గుంటపేరు కాళంగుంట!-

ఆ గుంట నిండేదెపుడో కానీ అదెప్పుడూ ఎండుకుంటే,

రెడ్డిగారికి ఆ గుంటమీద కన్నుపడింది. ఆ గుంట చిన్నతరహా భారీపరిశ్రమకు అనువుగా ఉంటుందనుకొన్నాడు.

ఇంకేం? శుభస్య శీఘ్రమ్!- కాళంగుంటలో కాపుసారా బట్టీలు కట్టారు. పెద్దపెద్ద కడవల్లో తుమ్మచెక్క బెల్లం ఊరేసినారు. బట్టీల్లో కుండపెట్టడానికి కట్టెకంపా కూడేసినారు.

పర్వతరాజు పరిరక్షణలో పరిశ్రమ నిరాటంకంగా సాగుతూ ఉంది.

కాళంగుంటలో కాచిన కాపుసారా నెత్తికడవలమీద రెడ్డిగారింటివెనక్కు చేరుతుంది. రెడ్డిగారింటిముందట వాకిలి ఆరారు పన్నెండు బారలైతే యింటివెనక జాగా అంతకు అమదంతటో అరంతలో ఉంటుంది. ఇంటివాకిలి ఎప్పుడూ పచ్చని పందిరితో శోభిస్తూంటే, యింటివెనక రెండు నిలువుకొట్టాలు తూర్పు

పడమరలుగా దిట్టంగా నిలబడి ఉన్నాయి. ఆ కొట్టాల్లో కడవల్లో సారాయి టిన్నుల్లో కెక్కుతుంది. ఆ తరువాత మనిషిని మనిషి పోల్చుకోలేని చిక్కటి చీకట్లో వ్యానెక్కి పేటకు చెక్కేస్తుంది. పేటనుండి నాలుగుదిక్కులకు పన్నెండు దోవలు. ఏ దారి పట్టుతుందో ఎవరికీ తెలియదు కానీ ఏదో ఒకదారి పట్టుతుంది.

ఇంటివెనుక వాకిలిగుండా సరుకు సవ్యంగా సాగిపోతూంటే ఇంటి ముందర వాకిలిగుండా వయ్యారాలు వొలకబోస్తూ లక్ష్మీదేవి ప్రవేశిస్తుంది. ఆ పైన అడుగు బయటపెట్టడం అడబిడ్డ లక్షణం కాదు కాబట్టి యింటి యినప్పెట్టెలో తిష్టవేస్తుంది.

రెడ్డిగారి అందమైన మందలింపును బౌదలదార్చిన నర్సిమ్ములు ఈ కొట్టాల్ని చేరినాడు. నాటుసారా వాసన ఘాటుఘాటుగా ముక్కుపుటాల్నదర గొడ్తా ఉంది. కమ్మకమ్మగా ఎగపీలుస్తూ నర్సిమ్ములు ఎదురుచూస్తున్నాడు.

ఆ చిమ్మచీకటిలో అడుగుమీద అడుగేసుకుంటా వచ్చి నిలువురాళ్ళు కొట్టాలముందు నిలబడినాయి.

"ఒరే చెంగా! ఆ చూరుకు తగిలుంచుండే చిప్పందుకోరే!–" నర్సిమ్ములు ఎంతో గొంతు తగ్గించి మాట్లాడినట్లున్నా దర్పంమాత్రం తొణికిసలాడుతూంది.

ఆ చీకట్లో తారట్లాడి చెంగడు చేతికి చిప్పందుకొన్నాడు.

నర్సిమ్ములు ముంతను చేతికందుకున్నాడు. ఒక కడవలో ముంచి అప్పటి మైన నాటుసారా నింపుకొన్నాడు. చెంగడిచేతిలోని చిప్ప నిండుకు పోసినాడు. అమృతాన్ని జుర్రుకొన్నంత ఆనందంగా చెంగడు ఒక్క గుక్కలో ఖాళీచేసి నాడు. ఆ చిప్పను మరొక్కడి చేతికిచ్చినాడు. నర్సిమ్ములు చిప్ప నిండుకుపోసి నాడు. వాడు చిప్పను ఖాళీచేసి యింకొకడి చేతికిచ్చినాడు. ఇట్లా అందరికీ ఒక్క వరస అయింది. రెండవ వరస అయింది. మూడవ వరస అయింది.

నిలువురాళ్ళు వెనక్కు ముందుకు ఊగులాడుతున్నాయి.

"ఇంక సాల్లేసామీ!" అంటున్నా వినకుండా నర్సిమ్ములు కొసిరి కొసిరి మళ్ళా రెండువరసలు ఆ చిప్పను తిప్పినాడు.

"ఓబులేసు రెడ్డికి జై! ... నర్సిమ్ములికీ జై!!"– అన్నాయి నిలువురాళ్ళు.

"ఒరె ఒరే నీయమ్మా బడవల్లారా! అట్లెందు కరస్తార్రా?.... వాళ్ళా యీళ్ళా సెవల్లో పడినా పరవాలేదు. రెడ్డిగారు సెవుల్లో పడిందంటే.... 'ఒరే నాయాలా! నువ్వుగూడా జై కొట్టించుకొనేంతోడి వైనావా!' అని నన్ను మక్కెలిరగదన్నిపోతాడు. ఇంక సాలుగాని మీరు పదండ్రే!" అని మెల్లగా వాళ్ళను సాగనంపినాడు నర్సిమ్ములు.

ఆ మీదట తానూ ఒక గ్లాసు చేతికందుకున్నాడు.

నిలువురాళ్ళు తూలుతూ సోలుతూ రెడ్డిగారి ప్రహరీగోడ దాట్నాయి.

ఒకరిమిందొకరు పడతా లేస్తా, రెడ్డిగారికి జైకొడతా ఊరిబయట చింత చెట్టుకింద చేర్నారు.

"ఒరే! మీ రెన్నయినా సెప్పండ్రా!- రెడ్డిగోరంటే రెడ్డిగోరేరా!.... అయ నకు దీటింకొకరు రాత్రా!"- తూనితా కండ్లు తేలేస్తాచెంగడు మొదలుపెట్నాడు.

"కదరా మరి?- రెడ్డంటే ఎవరనుకున్నావ్? కష్టసుఖాలు తెల్సిన మణిసి కదరా!- మనం పడేకష్టం మహన్నబావుడికి తెల్సుకాబట్టి మన కంత గొంతుల్లో బొయ్యించినాడు. బొయ్యించకుండావుంటే మనంవేఁవన్నా కొట్టబోతాఁవా? తిట్ట బోతాఁవా?"- ఇంకొకడందుకున్నాడు.

"బలే కరకట్టుగా సెప్తావుండాఁరా మీరు!- మన సెర్మందీసి సెప్పులు కుట్టిస్తేకూడా రుణం దీర్చుకోలేవురా!" ఇంకొకడి బాధ.

"ఇంత మంచిమణిసి మాటల్ని యినిపించుకోకుండా యిసురుకోని పాయ గదరా లచ్చిఁవి. అయిన మణుసెంత నొచ్చుకునిందో? ఏఁవో? పాపం!"

"పోతే పోనీలేరా!- బొయ్యేవాళ్ళను పట్టుకుంటేమాత్రం వుంటారా? పోనీ! యాడికి పోతుందోపోనీ:- మనల్నిగాదని రెడ్డిగోర్ని గాదని పోనీయేఁవే?

"తల్జుట్టి నోటికాడికి రావల్సిందేలేరా!- నా మాటంటే మాటే!- తప్పితే కాలి సెప్పుదీసుకోండి."

తలవాక్కై తీరుగా వాగుతున్నాయి నిలువురాళ్ళు!-

సారాయి మజా!


రెడ్డిగారిమీద అపారమైన భక్తి. లచ్చిఁవిమీద గొంతు కొరికెయ్యాల్నా మన్నంత కోపం!

నోళ్ళు తడబడుతున్నాయి. కాళ్ళు నిలబడలేక పోతున్నాయి. అట్లానే తూలుతూ తుళ్ళుతూ ముందుకు కదిల్నాయి నిలువురాళ్ళు. దేనిదారి దానిదిగా ఆ చీకటిలో కలిసిపోయినాయి.

## 3

పట్టణాలు పనిగట్టుకొన్నట్లుగా ప్రయత్నించి ఎత్తికుదేసినాయి దళ కంతాపురాన్ని ఆ కొండల నడుమకు. ఆ పురం నెట్టిందా వాడను ఒక బోడిగుట్ట దరిదాపులకు, ఆ వాడ తరిమిందా గుడిసెను వాడచివరకు.

ఆ గుడిసెలో ఓ స్త్రీమూర్తి కుమిలికుమిలి యేడుస్తూఉంది.




ఆ ఆకారానికి కన్నవాళ్ళు గారాబంగా పెట్టుకొన్న పేరు లక్ష్మమ్మ.

కట్టుకొన్నవారు ముద్దుగా పిలుచుకొన్న పేరు లచ్చిమి.

లచ్చిమి మొగుడుపేరు లక్ష్మయ్య.

'లక్ష్మయ్య!' అని పిలవడానికి నోరు తిరగక కాదు. మనసు రాక! వాడు జనం నోళ్ళల్లో లచ్చుంగాడైనాడు.

లచ్చిమి, లచ్చుంగాడి అనురాగమయ కాపురంలో కాసిన ఒక్కగానొక్క కాయ నాగులు. నాగులు ఈ లోకాన్ని గురించి తెలుసుకొనకముందే వాడి తండ్రి ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపొయ్యినాడు. దిక్కూ దరీలేని స్థితిలో విడిచిపెట్టి పోయిన భర్తను తలచుకొంటూ, రేపెట్లా గడుస్తుందో ఆలోచించుకొంటూ, ఓబులేసురెడ్డి మాట తీరుకు మండిపోతూ లచ్చిమి తనలో తాను కుమిలికుమిలి యేడుస్తూ ఉంది. తల్లి యేడుస్తూంటే తట్టుకోలేక, ఓదార్చడానికి చేతగాక నాగులు కూడా ఆమెతో కలిసి యేడుస్తున్నాడు. తల్లిని చూచి బిడ్డ, బిడ్డను చూచి తల్లి ఒకర్ని చూస్తూ ఒకరుగా యేడుస్తున్నారు ఆ నిశీధిలో!_

నత్తగుల్లల్ని, ఎండ్రకాయల్ని మెక్కి వచ్చిన పొట్టినక్కలు ఉత్సాహంగా ఊళలేస్తున్నాయి. నిలువురాళ్ళ వాడలో అడుగిడినట్లుంది. కంటపడగానే కొంపలు మునిగినట్లు భీకరంగా మొరగడం ఆరంభించి రానురాను మంద్రస్థాయికి దిగుతున్నాయి_ గుర్తించినందుకు నిదర్శనంగా!_ ఒకటి రెండు నిలువురాళ్ళు. అనుకో

నట్లుగా గుడిసె ముందు నిలబడినాయి. గుడిసెను చీల్చుకొని వస్తున్న యేడుపును కాసేపు విన్నాయి. ఒకదాని మొఖం యింకొకటి చూచుకొన్నాయి. నోరు చప్పరించినాయి. ఆ తరువాత దేనిదారి దానిదిగా విడిపోయినాయి.

అప్పటికి నాగులు యేడుపు ఎక్కిళ్ళుగా మారింది. ఆ ఎక్కిళ్ళతో గొంతు తడారినట్లుంది. అట్లానే వాడు ఎక్కిళ్ళు పెడుతూంటే మరి కాసేపటికి సొమ్మసిల పడిపోతాడు. కన్నపేగు గమనించింది. తన్ను తాను సముదాయించుకొనింది. పైకి లేచింది. ఆ చీకట్లో తారాడింది. చేతికి తగిలిన సత్తులోటాను చేతికందు కొనింది. కుండలోనుంచి మంచినీళ్ళు తెచ్చింది పిల్లవాడి గొంతులో కాసిన్ని పోసింది, తడి అరిచేత్తో మొగం తుడిచింది. అప్పటికి వాడు తెప్పరుకొన్నాడు. 'అమ్మా!' అంటూ తల్లి ఎదను హత్తుకపోయినాడు. 'బిడ్డా!' అంటూ లచ్చిమి వాడిని గుండెల్లో పొదువుకొనింది.

ముందు చీకటి. వెనుక చీకటి. గుడిసెనిండా చీకటి. కటికచీకటి. ఆ చీకటిలో తల్లీకొడుకుల యేడుపు మూగగా కొనసాగుతూ ఉంది.

"అమ్మా! యింక నేను సదువుకునేదెట్లమ్మా?"

నాగులు ఏడుపును మింగి ఎంతో బాధగా అడిగినాడు.

"ఇంక బతికేదెట్లా?"– అని తల్లి ఆలోచన. కానీ బిడ్డతో ఆ మాటెట్లా అనగలుగుతుంది. లేదు– వాడడిగిన దానికి సమాధానమేమని చెబుతుంది?–

బాధను వ్యక్తం చేయడానికి చేతకానపుడు ఎవరికైన ఒక్కటే శరణ్యం. అది యేడుపు!

ఆ యేడుపే లచ్చిమికి శరణ్యమయింది.

"ఏడవద్దమ్మా! నేనింక స్కూలికి పోన్లేమ్మా. ఏ యింట్లోనైనా పనీపాట చేసి నిన్ను సాకతాన్లేమ్మా!– నువ్వేడవద్దమ్మా!"

అభమూశుభము ఎరుగని పసికందు. చీకూచింత లేకుండా గడిచి పోవలసిన బతుకు మున్ముందు. అయినా ఆ వయస్సులోనే బాధ్యతల్ని నెత్తికెత్తుకొన్నట్లు మాట్లాడుతూంటే ఆ తల్లిగుండె చెరువయింది. కొడుకును అమాంతంగా గుండెలకు హత్తుకొనింది. ఎగ్గొట్టుకొస్తున్న యేడుపును ఎంతో ప్రయత్నంతో మునిపంటి కరవిపట్టింది

తల్లి ఎదలో బిడ్డ బిడ్డ మనసులో తల్లి. ఆ తృప్తిలోనే కొన్నిక్షణాలు దొరలపోయినాయి. తల్లి గుండె నిబ్బరించుకొనింది.

"నాయనా! ఆ దేవుడి క్కూడా ఎందుకు కనికారం.లేకుండా పోతుందో! యేఁవో? మనబోటి పేదోళ్ళ బతుకుల్తోనే ఆడుకుంటా వుంటాడు. లేకపోతే ఆ బాయిలో అంత మంది పన్జేస్తావుంటే తెగినట్టు తెగింది– తెగి అంత మందిలో మీ నాయిన్నెత్తిన్నే పడాల్నా? అంతెత్తులో నుండి రాళ్ళతట్టతెగి నెత్తినపడేకుందికి తలొప్పలొప్పలుగా టెంకాయిపగిల్నట్టు పగిలిపోవాల్నా? ఇంతకూ మనకరమిట్టా కాలింది. అయినా నువ్వేమీ దిగులు పడద్దులే నాయినా!– రెక్కలు ముక్కలు జేసుకోనయినా నిన్ను సదివించుకుంటా."

ఇంత వేదాంతాన్ని ఒంట పట్టించుకొనే వయసు కాదు నాగులుకు అయినా కాసేపు మౌనంగా ఆలోచించినాడు. ఆ మీదట–

"వద్దమ్మా వద్దు. ఎంత సదివినా ఈ ఊళ్ళో సదవబొయ్యేది ఏదోతరగతి దాకనేకదా? ఆ మిందట సదువుకునే దానికింకొకూరికి నేనేడపోబోతా? నేనేడ సదవబోతా? ఏదో తరగద్దాకా సదువుకుంటే మాత్రం యేం ఉద్యోగం రాబోతుంది?– దీనికంటే యిప్పట్నుండే ఏ అయ్యకాలో సెయ్యో పట్టుకోని అంతోయింతో పన్నేర్చుకుంటే– మన బతుకు మనం బతకవచ్చుకదమ్మా!"

"ఏదో తరగద్దాకా సదువుకోనాయినా! అప్పుడు కావాలంటే సూద్దాం!"

"వద్దులేమ్మావద్దు. నాయినే బతికుంటే నిన్ను గడప దాట్నిస్తావుణ్ణా!"

ఆ మాట చెవిని పడేసరికి లచ్చిమి గుండెల్ని తొలిచినట్లయింది. ఎంతో అపురూపంగా చూసుకొన్న భర్త కనుల ముందు మెదిలినాడు. ఆ అనుభూతితో ఆమె తన్ను తాను మరచిపోయింది. నాగుల్ని కావిలించుకొని 'బోరో!'మని ఏడుస్తూ ఉంది.

"అమ్మా! నువ్వేడవద్దమ్మా!– నేను పనీపాటాసేసి నిన్ను సాకతానమ్మా! అమ్మా! నువ్వేడవద్దమ్మా!"

తల్లిని స్వయంశక్తితో సాకలేని వయస్సు కొడుకుది.

కొడుకును సదివించలేని నిస్సహాయత తల్లిది.

అయినా తల్లిని సముదాయించి సంతోషపెట్టాలని కొడుకు, ఎన్ని బాధలైనా పడి కొడుకును చదివించాలని తల్లి. ఒకరి తృప్తికోసం ఒకరు మాట్లాడుతున్నారు. మాటలు రానపుడు యేడుస్తూ, యేడుస్తున్నపుడు ఒకరినొకరు సముదాయించు కొంటూ, ఏడవడాని క్కూడా శక్తి లేనపుడు సొమ్మసిలి పడుతూ, మళ్ళీ లేస్తూ ఉంటే కంటిమీద రెప్పపడకనే ఆ రోజు తెల్లవారింది!

## 4

మాటు మణిగిన వేళలో ఊరు మాటు మణిగిందన్న అభిప్రాయంలో రకరకాలుగా రంగు పూసుకొన్న మొగాలు తెల్లవారిందనే సరికి ఆ రంగును పూర్తిగా తుడిచేసి మళ్ళీ మామూలుగా కనిపిస్తాయి. దీన్ని గమనిస్తూనే ఉంటారు. అయితే ఎవ్వరూ పట్టించుకోరు. పట్టించుకొన్నా ఏమీ సాధించలేరు.' అందుకే. అంతా మామూలుగా కొనసాగినట్లే ఉంటుంది.

అట్లాగే ఆ పల్లెలో కూడా తెల్లవారింది.

తెల్లవారేసరికి మళ్ళీ మనిషి మరొక వేషం వేస్తాడు. బతుకుదెరువు కోసం ప్రాకులాట ప్రారంభిస్తాడు. ఈ ప్రాకులాటలకు మాటు మణిగిన వేళల్లో ఆటలకు పొంతనాలే కుదరవు. కుదరవని కూడా అందరికీ తెలుసు. అయినా మనిషి వదలడు. అందుకే మనుష్యులు కొన్ని సందర్భాల్లో నిలువురాళ్ళలా నిలబడిపోతారు.

రాత్రి రెడ్డిగారి వాకిట్లో నిలువురాళ్ళు తెల్లావారేసరికి లచ్చిఁవి గుడిసె ముందర మొనగాళ్ళు!

'లచ్చిఁవీ!_ యే లచ్చిఁవీ!"

గుడిసె ముందర నిలబడి మొనగాళ్ళు అరుస్తున్నారు.

తెల్లవార్లూ కంటి మీద పడనిరెప్ప తెల్లవారేసరికి కంటిమీద పడినట్లుంది. లచ్చిఁవి ఎప్పుడు వొళ్ళు మరిచిందో మరిచింది. చెవులు తూట్లుపడేలా పిలుపు వినిపిస్తూంటే లచ్చిఁవి ఎగిరిపడి లేచింది. ఎవరు పిలుస్తున్నారో ఏమో? అను కొంటూనే గుడిసింటి తడిక తలుపు మెల్లగా తీసింది!_

ఎదురుగా నిలువురాళ్ళు!

రాత్రి పట్టు బలవంతాన లాక్కొనిపోయి రెడ్డిగారి వాకిట ముందర నిల బెట్టిన నిలువురాళ్ళు!!_

వాళ్ళ కంటపడేసరికి ఆమెకు అరికాలిమంట నెత్తికెక్కింది. ఆ మంటను భరించలేక తల తనంతట తానుగా వాలిపోయింది. వంచిన తలెత్తకుండా వచ్చి వాళ్ళముందు నిలబడింది. తప్పదు మరి!

ఆమె వాలకాన్ని చూచి నోరు విప్పడానికి మొనగాళ్ళు జంకుతున్నారు.

ఆ పిరికి వెధవల్ని అడిగేదేముందని ఆమె నోరు విప్పలేదు.

ఇరుపక్షాల్లో గుండెలు అగ్నిగోళాల్లా మండుతున్నాయి.

ఏ తెల్లవారేటప్పుడో అట్లా నిద్రలోకి జారుకొన్న నాగులుకు మగత నిద్రలో ఏవేవో కేకలు వినిపిస్తున్నాయి. తన తల్లిని ఎవరో? యేమో చేస్తు

న్నట్లు పీడకల. 'అమ్మా!' అంటూ ఎగిరిపడి లేచినాడు. చూస్తే ఫక్కలో అమ్మ లేదు. ఒక్క ఊపులో ఎగిరి వాకిట్లో పడినాడు. అక్కడ అమ్మ కంటపడేసరికి మనసు కొంచెం నెమ్మదించింది. ఒళ్ళు విరుచుకొంటూ వచ్చి కండ్లు నలుము కొంటూ తల్లి చాటులో నిలబడినాడు.

అజ్ఞాతంగా మండుతున్న గుండెల అగ్నిగోళాల్లో సెగలు కన్నుల్లోకి ప్రాకి కన్నుల్లోనుండి జారి తూర్పుదిశలో అలుముకొంటున్నట్లుంది.

తూర్పుదిశ ఎరుపురంగులో కరకరలాడుతూ ఉంది.

బారెడు పొద్దెక్కింది మరి బారెడు పొద్దెక్కిందంటే తూర్పుదిశలో ఎరుపురంగు వాళ్ళ గుండెల్లో మంటలు మండినట్లే మండి అరిపోయినట్లు ఎటు పోతుందో తెలియదు. పేదోళ్ళ గుండెల్లో మంట- మంటగా నిలబడే తత్త్వమే ఉంటే ఈ లోకంలో యింత అస్తవ్యస్తానికి తావుండేది కాదేమో!

ఒక మార్గం దుర్గమమైనపుడు మరొక మార్గంతో రాజీపడడం మానవుడి లక్షణం. అట్లా రాజీపడకపోతే ముందుకు పోలేడు కూడా!- అందుకే లచ్చిమి బతుకును ఏదో విధంగా ముందుకు లాక్కొని పోవాలని ముందుకొచ్చినారు మొనగాళ్ళు!-

"లచ్చిమీ! నువ్వొచ్చేసినాక శానా దూరం రెడ్డిగారితో సత పోర్నాం. ఎంత జెప్పినా మణిసినదే! పట్టుకున్న కుందేలికి మూడే కాళ్ళంటే ఎవురేం జేస్తారు? ఒప్పించేకుందుకి తలపాణం తోక్కొచ్చిందనుకో!"

లచ్చిమి ఓరగా తలతిప్పి సూటిగా ఒక్కచూపు చూసింది. ఆ చూపులకి విలవిలలాడుతున్నారు మొనగాళ్ళు. 'యింతేగదా మీ బయిసి!' అన్నట్లుగా లచ్చిమి మళ్ళీ తలవాల్చింది.

"మాయబ్బతోడు లచ్చిమీ!.... రెడ్డిగార్నొప్పించేకుందుకి అబ్బబ్బలే దిగొచ్చినారనుకో!"

"ఏంది మీరొప్పించింది!" అన్నట్లుగా ఒకచూపు విసిరింది లచ్చిమి. ఆ చూపుతో లచ్చిమి తమ సత్తాను పసిగట్టిందని తడబడినారు మొనగాళ్ళు. అయినా తట్టుకొని నిలబడినారు.

"నిన్నూ నీ కొడుకును రెడ్డిగారింట్లో పనికి పెట్టుకుంటానన్నారు."

"ఆయన పట్టుకున్న మూడుకాళ్ళ కుందేలికి మొలిసిన కొమ్ములిన్నించు కోమెచ్చినారు. బలే మొనగాళ్ళే మీరు!"- అన్నట్లుగా ఒక్కనవ్వు నవ్వింది

లచ్చిఁవి. గిరక్కున వెనక్కు తిరిగింది. ఒక్క ఊపులో గుడిసింట్లో దూరి కుప్పగా కూలబడింది- యిరుసు విరిగిన బండిలాగా!

"పాప్మని పాతకోకిస్తే యింటెనక్కు బొయ్యి మూరేసుకున్నట్లుందే దీనెవ్వారం. ఎంత పీకులాణ్ణా బోయ్‌నోడు రాబొయ్యేదీలే! కడుపూరికే ఉండ బొయ్యేదీలే!- ఏదో ఒకపని ఎక్కణ్ణో ఒకసోట సేసుకోని బతకాల్నా పన్లేదా? .... రెడ్డోరింటికేం? కట్టుకునే దానికంత గుడ్డ.... కడుపుకింత తిండి.... అమ్మా కొడుకిరగజెయ్యబొయ్యే దానికంత మాత్రం సాల్దో? అదిగూడ సూడకుండా బోతాఁవా? ఇంకేడ పన్జేస్తుందో? ఏం పన్జేస్తుందో? ఎట్లా బతికితిందో?"

ఇంటిముందర మొనగాళ్ళు వాళ్ళు గిరేకోళ్ళలా ఎకసక్కేలాడుతూ ఎవరిదారి వారిదిగా వెళ్ళిపోయ్‌నారు.

మనిషి కుప్పగా కూలబడినా లచిఁవి మనసు మాత్రం పగిలిన గ్లాసులా చెల్లాచెదరయింది. పగిలిన గాజుముక్కల్ని కుప్పగా చేర్చవచ్చు. కానీ అతికించ లేము. అట్లాగే ఉంది లచ్చిఁవి మానసిక ప్రవృత్తి.

మరిచిపోదామని ఎంతగా ప్రయత్నించినా ఓబులేసు రెడ్డి అనిన మాటలు గుండెల్లో గునపాల్లా గుచ్చుకొంటున్నాయి.


"పోయ్‌నోడెట్టా పోయ్‌నాడు. పోనీ! వాడిస్తావుణ్ణే ఆ సుకఁవన్నా యిస్తా వనుకుంటే వయసా? వల్లకాడా? అని వాపోతాడా? దిక్కూదరీ లేకుండా నిలబడు కుణ్ణాం! ఏదైనా ఒక దోవ సూపించండి! అని బతిమలాడ్తే ఒక యిదంగా సూస్తా యింకొక యిదంగా నవ్వుతాడా ఎదవ? అట్లాంటి యదవింట్లో పన్జె య్యాల్నా? అంతకంటే యే నుయ్యో గొయ్యో సూసుకుంటే పోలా!"

రకరకాలుగా తలపోస్తూ ఏ రకంగా బతకాలని ఆలోచిస్తా వుంది లచ్చిఁవి.

నాగులు గుడిసింటి కప్పువైపు తీక్షణంగా చూస్తూ కూర్చున్నాడు. వాడి లేతబుర్రని ఎన్నో ఆలోచనలు రంపపుకోత కోస్తున్నాయి.

అయ్య బతికుంటే అమ్మను అట్టున్న పుల్లని ట్టె త్తెయ్య నిస్తావుణ్ణా!- పువ్వుల్లో బెట్టి పూజించుకుంటా వుండెగదా? అట్లాంటి అమ్మకు యిప్పుడిట్లాంటి కష్టఁవొచ్చిపడింది. ఎట్ట జెయ్యల్ల?

ఓబులేసురెడ్డేఁవో తనింట్లో పన్జేసుకోని బతకమన్నాడు. పోయ్‌పోయ్ అట్టాంటి యదవ దగ్గిర పన్జెయ్యాల్నా?- వాడవాడగా వాడి వాకిటి ముందర నిలబడి 'దేహీ!' అంటే దెయ్యం పట్టోడి మాదిర ఊగతా పనొసికాలాడ్తాడా?




బానకడుపు నాయాలు పడిపడీ నవ్వుతాడా? అమ్మను మింగేసే మాదిర గుచ్చిగుచ్చి సూస్తాడా? అట్టాంటి యదవనేంజేసిన పాపంలేదు.

ఎట్టాబ్బా? ఏఁవన్నా సెయ్యాలంటే ఎంతో సెగితుండాల కదా? పెద్ద పెద్దోళ్ళే వాడిముందర తోకాడిస్తా కుక్కల మాదిర తిరగతా మూతుల్నాకతా వుంటే ఏలెడంతోణ్ణి- ఏం జెయ్యబోతా?- సెయ్యకపోతే కసిదీరేదెట్టబ్బా?- కసిమాట దేవుడెరుగు!- ముందు పొట్ట గడవాల గదా? పొట్ట గడవాలంటే యేదో ఒక పన్జెయ్యాల!- అయితే ఏం పన్జెయ్యాల?

పోనీ! ఈ వూరొదిలిపెట్టి యాడికైనా వెళ్ళిపోతే?

అవును. ఏదో ఒక సినిమాలో కూడా సూపించినారు. ఒక పిలగాడు. తన యాడోడే!- మారుతల్లి పెట్టే కష్టాల్ని పడలేక టౌనుకు పారిపోతాడు. ఆడ తిరగతాడు. ఈడ తిరగతాడు. యాడేణ్ణో తిరగతాడు. యాడ తిరిగినా పని దొరకదు. ఎవుర్నడిగినా కసిరికొట్తారు. అడుక్కుందావంటే- 'నీకేఁవిరా తుంట కుక్క మాదిరుండావు. పన్జేసుకోని బతకరాదా?' అంటారు. 'పనియ్యండి సేస్తా నంటే!'- 'ముక్కులో సీవిడి కార్తావుందిరాంటే- ఆ సేత్తోనే అట్లా తుడిసెయ్! అనేటట్లుగా వుందికదరా నీ యవ్వారం.' అని తిప్పికొడ్తారు. ఏఁవి సేసేదానికి తోసకుండా ఎట్టా బతకాల్నో తెలియకుండా గాలికి తిరగతావుంటాడా పిలగాడు.

అప్పటికి తిండి తిని మూన్నాళ్ళయింది. కొళాయి నీళ్ళతోనే పాణం నిలబెట్టుకోనుండాడు. ఒకనాడు రోడ్డు దాట్తావుండి సోదీనం లేకుండా కారుకింద పడిపోతాడు. సచ్చిపోడు కానీ సిన్నసిన్న దెబ్బలు తగల్తాయి. ఎంటనే ఆ కారాసాంవి వాణ్ణి కార్లో యేసుకుంటాడు. అస్పత్రికి తీసకపోతాడు. దెబ్బలకంతా మందేసి కట్లు గట్టిస్తాడు. ఆ దెబ్బలు మానిపొయ్యేదాకా తనింట్లోనే పెట్టుకుంటాడు. వాడివెనకా ముందు ఎవరూ లేరని తెల్సుకోని తనింట్లోనే పనికి కుదిరించుకుంటాడు. అదే మాదిర నాక్కూడా జరిగితేః_ ఎంత బాగుణ్ణోః_ అప్పుడు కావాలంటే వచ్చి అమ్మను కూడా తీసుకోని పోవచ్చు."

ఊహ అతిసుందరంగా ఉంటుంది. ఆ ఊహలోనే నాగులు తృప్తిపడుతున్నాడు. ఆ తృప్తి వాడిమొగంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తూనేఉంది.

రెండుబార్ల పొద్దెక్కిందిః

తూర్పుదిశ చాలా తెల్లబడింది ః ః

లచ్చింవి మెల్లగా పైకిలేచింది. పొయ్యిదగ్గరికి నడిచింది. పొయ్యిలో చెయ్యిపెట్టి కెలికింది. అంత పిడకబూడిద తీసుకొనింది. అందులో కొంత నాగులు అరచేతిలో వేసింది. మిగిలింది తాను నోట్లో వేసుకొనింది. రెండుసార్లిటు రెండు సార్లటు తిమిడింది. గుడిసెముందర రెండు తడిక లడ్డంగా పెరడు. ఆ పెరట్లోకి వెళ్ళి మూతి కడుక్కొనింది. పైటచెరుగుతోనే మూతి తుడుచుకొంటూ గుడిసింట్లోకొచ్చింది.

చేతిలోబూడిద చేతిలోనే ఉంది. నాగులు ఎటో చూస్తున్నాడు. చాలా తీక్షణంగా చూస్తున్నాడు. తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

ఆ తీరుచూస్తుంటే లచ్చింవికి ముచ్చట కలిగింది.

ఆ మరుక్షణమే గుండెల్లో ఏదోపురుగు తొలిచినట్లు బాధపడింది.

"ఆ వయసులో యేపిల్లోడైనా పెట్టింది తింటాడు. ఇచ్చింది కట్టుకుంటాడు. పీకూసింతా లేకుండా తిరగతాడు. లేకుంటే యిస్కూలుకిపొయ్యి చదువుకుంటాడు. కానీ ఈ పాడుకడుపులోపుట్టి ఈ సిన్నతనంలోనే బిడ్డ ఆలోచనల్లో వడ్డాడు. ఏంవేంవి ఆలోచిస్తావుండాడోః ఎట్టెట్టా ఆలోచిస్తావుండాడో పసిగుడ్డుః"

ఆమె కనుకొలకుల్లో నీళ్ళుతిరిగాయి.

కాలు కదపకుండా కన్నార్పకుండా కాసేపు అట్లానే నిలబడింది.

ఆ తరువాత —

"నాయినాః లేసి పండ్లుతోంవుకోని మొకం కడుక్కోరాః" అనింది.

ఆ మాటతో ఉలిక్కిపడినట్లు పైకి లేచినాడు నాగులు. అరచేతిలో బూడిద నోట్లో వేసుకొన్నాడు. పండ్లు తోముకొంటూ పెరట్లోకి నడిచినాడు.

లచ్చిమి ఉట్టిమీద చట్టిని చేతి కందుకొనింది. ఆ చట్టిలో రెండు సంకటి ముద్దలు. రాత్రి మద్దిస్తానికి వెళ్ళకముందు కెలికిన ముద్దలు. మద్దిస్తంనుండి తిరిగివచ్చిన తరువాత తిందామనుకొనింది. చట్టిలోవేసి ఉట్టిమీద పెట్టింది. అంతే!- రాత్రి మద్దిస్తంలో రెడ్డిగారి వడ్డింపుల్తోనే కడుపు నిండిపోయింది. తన సంగతి ఎట్లయినా ఫరవాలేదు. బిడ్డసంగతి కూడా మరచి పోయింది. రాత్రి బిడ్డ కూడా పస్తని తోచేసరికి ఆమెగుండె బాధగా మూలిగింది. కండ్లు పొరలుకమ్మి నాయి. ఆ పొరలమధ్యనుండే చూచిందా సంకటిముద్దల్ని. ఆ ముద్దలు రాత్రి నీళ్ళుపోసి పెట్టనికారణంగా ఒకచుట్టు ఎండిపోయినాయి. ఎండిన ముద్దలమీద ఎర్ర చీమలు పారాడుతున్నాయి. లచ్చిమి ఆ ఎర్రచీమల్ని తట్టేసింది. నారింజపండుకు తోలు వొలిచినట్లుగా ఎండిన సంకటిముద్దల్ని సుద్దంగా పైభాగాన గీకేసింది. ఒకముద్దను మూకుట్లోవేసింది. రెండు ఎండుమిరపకాయలు, ఒక్క ఎర్రగడ్డ, అంతఉప్పు రోట్లోవేసి దంచింది. అది సంకట్లోకి ఊరుబిండి. ఆ ఊరుబిండి నంత మూకుట్లోని సంకటి ముద్దమీద వేసింది. ఆ మూకుణ్ణి నాగులుముందర బెట్టింది.

మూకుడు ముందర కూర్చున్న నాగులు వంచినతలెత్తలేదు. సంకటిముద్ద నుండి దృష్టిని మరల్చలేదు. కాసేపు అట్లానే కూర్చున్నాడు. లచ్చిమి గమనిస్తూనే ఉంది. అంతలోనే తల మెల్లగా పైకెత్తినాడు. అమ్మమొగాన్ని చూచినాడు. ఎదురుగా కూర్చుని అమ్మ తనవైపే చూస్తూఉంది- ఎంతో ఆశగా అప్యాయంగా. మళ్ళీ నాగులు తలవంచుకొన్నాడు. ఒకపిడచ సంకటిపిసికి ముద్దచేసినాడు. ఊరుబిండి అద్దుకొన్నాడు. పిసికి ముద్దచేసిన పిడచను అట్లానే చేతులతో పట్టుకొని కాసేపు చూచినాడు. ఆ మీదట తల పైకెత్తి 'నువ్వుతినమ్మా!' అంటూ ఆ ముద్దను తల్లినోటి కందించినాడు.

కొడుకును కౌగలించుకొని బావురుమనింది లచ్చిమి!

తల్లినిచూచి బిడ్డ ఏడుస్తున్నాడు. బిడ్డనుచూచి తల్లి ఏడుస్తూఉంది. ఒకర్ని చూచి యింకొకరు ఏడుస్తుంటే ఓదార్చడాని కెవరున్నారు?

కాలానికన్నా ట్లుందా శక్తి!

లచ్చిమి అయిదారు నిముషాల్లో నిబ్బరించుకొనింది.

"రేత్తిరిగూడా తిగ్లేదుగదనాయనా!- నువ్వంత తిను. నేనుగూడా తింటాలే!-.... తినకుండా యాడికిపోతాన్రా తండ్రీ!"

లచ్చిమి బుజ్జగించింది కొడుకును!

"నువ్వుమాత్రం తిన్నావామ్మా రేత్రి? లేదే!.... మరి నువ్వుతింటేనే నేను తింటానమ్మా!"

మారాం చేస్తున్నట్టుగా బుంగమూతి పెట్నాడు నాగులు.

ఆ మాట చెవుల్లో పడేసరికి లచ్చిమి కండ్లల్లో సర్రున నీళ్ళు తిరిగినాయి. ఎంత నిబ్బరించుకొన్నా మనసు పరిపరివిధాలా పోతూ ఉంది.

"ఆడదానికి మొగుడు ఆ తరవాత బిడ్డలు. అంతే! యింకెవరూ ఉండరేవో ఈ లోకంలో?- అయిన కూడా అంతే. నేస్తావుణ్ణింది సంసారం కదా? మాటమీద మాటొచ్చి ఎప్పుడైనా రంపూ రచ్చాగుకుంటే అలిగి ఆ గుడిసెలో దిక్కుకొకరుగా పొణుకునేవాళ్ళం. ఎంతసేపని పొణుకుంటాం. ఎంతసేపని మూతులు బిగించుకుంటాం. అయినంత టాయినే పైకి లేసేవాడు. మూకుట్లో సంకటేసుకోనొచ్చి సుందరబెట్టి గెడ్డకింద రెండు వడ్లగింజలేసి అడుక్కున్నట్టుగా అడుక్కునేవాడు తిండేసేదాకా తినేవాడుగాదు. ఇప్పుడు- కడుపులోపుట్టిన బిడ్డ ఆ పన్జేస్తుండాడు. గగతసంబంధమంటే యిట్టాంటిదేనేవో!"

మనస్సు ఆలోచిస్తూంటే కండ్లు వర్షిస్తున్నాయి.

"అమ్మా! నువ్వేడవద్దమ్మా!- నువ్వేడిస్తాఉంటే నేను సూళ్ళేనమ్మా- నీ కెందుకమ్మా బాద?- నేనుండానుగదమ్మా! నేను సాకేస్తాన్లేమ్మా నిన్ను. ఏ అయ్యాయింట్లో నాయినా పొద్దుగూకులూ సెప్పినపన్జేస్తే మనిద్దరి కడుపులు పూడవామ్మా?"

నాగులు వయసుకుమించి మాట్లాడుతున్నాడు.

బహుశా, బాధ్యత ఉన్నట్టుండి మనిషివయసును కూడ పెంచుతుందేమో?

లచ్చిమి అమాంతంగా నాగుల్ని గుండెల్లో పొదుపుకొంది. మూతినిండా ముద్దుల్లో ముంచేసింది. ఒళ్ళో పడుకోబెట్టుకొని ముద్దముద్దకు ఒక ముద్దుబెట్టినంత ముదిగారంగా సంకటి తినిపించింది. తానూ కొంత ఎంగిలిపడదామని కూర్చొంది. రెండుముద్దల సంకటి. ఒకప్పుడైతే ఒకచుట్టుకు చాలేదికాదు. ఎంతనంజినా తినలేక పోతూంది గొంత్రి రెడ్డినాచిన చూపులే వొళ్ళంతా కాలుస్తున్నట్టుంది. కాదుగీదని తప్పుకొన్నా మరర్ధందరుపైగా మింగలిపోయింది. ఆ సంకట్ని ఉట్టిమీద ఎత్తిపెడదామనుంటే, అప్పటికే ఎండిపోయింది అందుకే గుడిసెముందర

పడిగాపులు కాస్తున్న కుక్కకు పెట్టింది. ఆ కుక్క తోకాడిస్తూ అదరాబాదరా పైకిలేచింది. అది లేచిన హుషారుచూస్తే అరముద్దను అరనిముషంలో మింగేస్తుందేమో!— అనిపించింది. అయినా అది ఆ సంకటిముద్దని, రెండుసార్లు వాసన చూచింది. తల అడ్డంగా తిప్పుతూ చెవులు కొట్టుకొనింది, వాళ్ళకు నేలకేసి గీరింది.

ఆ సంకటి మట్టిపాలయింది.

ఉసూరుమంటూ మూలకు ఒదిగింది లచ్చిమి. ఎదిగిన కూతుర్ని ఒళ్ళో పెట్టింది. సంకటి చట్టిలో ఇన్ని నీళ్ళుపోసి తిప్పిపోసింది. ఆ చట్టిని మళ్ళీ ఉట్టి మీద పెట్టింది. ఆ మూలగా ఇల్లా గుడిసి ఆ గోడకు చేరగిల పడింది. ఆమె ఒడిలో తలపెట్టుకొని నాగులు పడుకొన్నాడు.

రాత్రి కడుపుకు చాలినంత తిండిలేక కంటిమీద రెప్ప పడలేదు. అంత సంకటి తిని రెండు గుక్కలు నీళ్ళు తాగేసరికి వాడిన పైరుకు తడిసినట్లయింది. తల్లి ఒడిలో బిడ్డ బిడ్డ ఒడిలో తల్లి. వాళ్ళకు తెలియకుండానే వాళ్ళు నిద్ర ఒడిలోకి జారుకొన్నారు.

## 5

మార్చి నెల ఆఖరు రోజులు. అప్పటికే తూర్పు దిక్కున సూర్యుడు చురచురలాడుతున్నాడు. కడిగి బోసినట్లు ఆకాశం నిర్మలంగా నీలాలు పారుతూ ఉంది. కలికానికంత మబ్బు తునక కనిపించడంలేదు. చెరువులు ఎండినాయి. బావులు అడుగంటినాయి. రైతులు మాటమాటకి ఆకాశంవైపు మోర పైకెత్తి పారచూస్తూ నిట్టూరుస్తున్నారు. వానదేవుడు కరుణించకుండా ఆ పరిస్థితి ఇట్లానే కొంతకాలం కొనసాగితే వలస పోవలసిందేనన్న మాటలు ఆ పల్లెలో అక్కడక్కడా వినిపిస్తున్నాయి.

ఆవుల వేళయింది.

ఆవుల వేళంటే గొడ్డూగోదా మేతకు బయలుదేరతాయి. గొడ్ల అరుపులు, కాపరులు అదిలింపుల మేళవింపుతో వీధుల్లో చిత్రమైన వాతావరణం నెలకొనింది. ఆ ఊళ్ళో మంగమ్మవ్వ, చెంగమ్మవ్వ 'ఆ పేడకడి నాది!' 'ఈ పేడ కడినాది!' అంటూ పశువుల వెంట పడినారు. పొరపాటుగా దురాక్రమణ జరిగితే దాంతో కొంపలే మునిగినట్లుగా జుట్లు పట్టుకొనే స్థితికి ఎదుగుతున్నారు. పైకిలేచిన దుమ్ము వాళ్ళకు అభిషేకం చేస్తూ ఉంది.

పొరపాటుగా జరిగే దురాక్రమణ ఓబులేసురెడ్డి యింటి ముందర జరిగితే మంగమ్మవ్వ కానీ, చెంగమ్మవ్వ కానీ నోరెత్తరు. ఒకవేళ నోరంటూ ఎత్తితే

అరంపు ఓబులేసురెడ్డి చెవినిగానీ పడితే- అంతే సంగతి!- ఇద్దర్నీ పిలిపించి వాళ్ళిద్దరు తన యింటిముందర కంపు చేసినందుకు ప్రాయశ్చిత్తంగా- అంతవరకు ఏరుకొన్న పేడను తన దిబ్బల్లోపోసి పొమ్మంటాడు.

ఓబులేసురెడ్డి అంటే- ఆ మాత్రం భయభక్తులున్నాయి కాబట్టే ఆ ఊళ్ళో యింకా నీతినిజాయితీ బతికి బట్టకడుతున్నాయని ఆ గ్రామస్థుల అభిప్రాయం.

ఎవరిదారి వారిదిగా లచ్చిమి యింటి ముందరనుండి వెళ్ళిన మొనగాళ్ళు బతుకుదారిలో పడినారు. ఒకడు రెడ్డోరికి కపిల తోలుతున్నాడు. అడుగంటిన బావిలో ఎంతకూ మునగని బానను ఎత్తెత్తి కొడుతున్నాడు. ఎటూ గాకుండా పోతున్న ఎడకాలవ నీళ్ళను చూచి ఎంతో బాధపడిపోతున్నాడు. ఇంక యిద్దరు 'గోయిందొడ్డు'లో గూడ కేయడానికి నిలబడి గూడకందని నీళ్ళకోసం గుటకలు మింగుతున్నారు. కొంతమంది చింతమాను లెక్కినారు. ఉడతల మాదిర కొనకొన కొమ్మలకు పాకి చింతకాయలు రాలుస్తున్నారు.

కూటి కోసం కోటి విద్యలు.

ఊరూ వాడా ఒక్కటై పొలాల మీద పని ఒక్క ఉద్యమాన్నే సాగిస్తున్నాయి.


ఓబులేసురెడ్డిగారు మాత్రం కాలుమీద కాలేసుకోని పట్టెమంచం పై హాయిగ కూర్చున్నారు.

పందిరిమీద ఆకుమార్చి నాలుగైదు రోజులు కూడా కాలేదేమో! నేరేడాకు ఇంకా వాడు కూడ పుట్టలేదు. ఎసర్లు పెట్టేవేళకాడ ఎండ విసుర్లు దురుసుగా ఉన్నాయి. రెడ్డిగారి వాకిట్లో మాత్రం ఉసూరుమంటున్నాయి. పచ్చని ఆకుసందుల్లో నుండి దూరి వస్తున్న గాలి అదోరకమైన కమ్మని వాసనలతో హాయి గొలుపుతూ ఉంది. దట్టంగా పేర్చిన నేరేడాకు సందుల్లో నుండి దూరుతున్న రేపటెండ బంగారు తీగెల్ని పందిరి కింద జారవిడిచినట్లు భాసిస్తూ ఉంది.

రాత్రి పనుల తొందర్లతోనో, మరే యితర కారణాలతోనో మద్దిస్తానికి రాలేని రెడ్డిగారి తొత్తుగాళ్ళు కొందరు పరామర్శించడానికని ఆ వేళకాడ ఆయన పక్కన చేరినారు.

రెడ్డిగారికంతా వేళ్ళమీద లెక్కే!- రాత్రి మద్దిస్తానికి వచ్చిన వాళ్ళుపోను మిగత రావలసిన వాళ్ళంతా వచ్చినారా? లేదా? అని సరిచూచుకొన్నాడు. ఆయన మొగంలో సంతృప్తి పెదాల మీదికి జారి మీసాల్లోనుండి తొంగి చూస్తూ ఉంది.

రెడ్డిగారు గొంతు సవరించుకొన్నారు.




దేవుడి సాన్నిధ్యంలో భక్తులు మాదిర అందరు వినయంగా రెడ్డిగారి వైపే చూస్తున్నారు.

“సినెమ్మనుగొట్టా! ఈ జనంతో పెద్ద యిబ్బందొచ్చి పడిందన్నా! ఏం సేద్దాం? ఈడిలో నిలబడుకుంటా వుణ్ణెదవలు వాకిట్లో కొచ్చేసిరి. రేత్రొద్దన యిండ్లల్లోకి జొరబడతారు. వాళ్ళకెట్టా తెగతా వుండాది.”

వాడలోని జనం వాకిట్లో నిలబడినందుకు బాధపడిపోతున్నాడు రెడ్డిగారు.

“అవునన్నో! యిప్పుడు కాలమెట్టా మారిపొయ్యిందంటే– ఆ నాయాండ్లే మనమింద సెయ్యిజేసి.కోసి మల్లా మనమే వాళ్ళను కొట్నామని కంప్లీటిస్తే వాళ్ళ మాటే సెల్లిపోతావుండాది”

వంత పలికినాడొక అనుభవజ్ఞుడు.

“సిన్నంగంటావా ఆ మాట!– రేత్తిరి నా తిప్పలు కుక్క– తిప్పలనుకో! వాళ్ళకట్టా సర్దిసెప్పి పంపించేకుందికి తలప్రాణం తోక్కొచ్చింది. అబ్బబ్బబ్బ! పెంట పెంట!.... మంగల్దిబ్బ మాదిర కెలకతావుంటే పెరగతా వుండే పెంట. ఎట్నో ఒకట్ట దొంగల్దొలేస్తిలేబ్బా!”

“ఏదో ఒక పెద్ద ఘనకార్యం సాధించినట్లు రెడ్డిగారు తృప్తి పడుతున్నారు.

“ఆం! యిదేంది మాంవా' మీకిక ఉప్పా? ఊరిగాయా? మహామహా కేసులే పూసిపోతే యిదేనా లేసికూసో బొయ్యేది. నువ్వు మాట్లేదేది మరీ యిచ్చిత్రంగా వుండాదే?”

రెడ్డిగారి ప్రతిభకు పట్టం గట్టడానికి ప్రయత్నిందొక తొత్తు.

"ఒరెఒరె! ఒట్టసద్దురా నాయినా! యిసయం తెలియకుండా మట్లాడ్తే ఎట్లా?"– అంటూ రెడ్డిగారు నాలుగు దిక్కులు కలయ చూచినారు.

అది తన యిల్లయినా గోడలకు చెవులుంటాయని రెడ్డిగారి సందేహం.

"అయితే నే తప్పేడ తన్నాండ్లా." ఒక తొత్తుగాడి తపన.

"తప్పా? తప్పున్నదిరా? వాణ్ణి మనం సంపాయించుకున్నావా? అంటే వాడు లేబరు పట్టుకుంటే కొన్నాసనుకున్నాడు. హాయ్హాయ్ ఆ లేబరు కోర్టులో తగులుకుంటే నీకి హోదమింద గుడ్డేసినట్లే కదసిన్నోడా? ఆ బొడ్డు గ్రామమున్నబు కరణంపూ పోలీసు ఎంప్లీయీయిస్సులు తవసుకిచ్చు జంగాలని పట్టుపట్లా?.... జరగనిచ్చుంటే యేమయ్యేది– కొంప మునిగి పోవలయ్యేది. అందుకే కదా రొండో కంటికి తెలవకుండా పేటికింద పెయ్యబెట్టింది."

"క్షేత్రి కూడా యీ యవవలనేతికింద పెయ్యేవన్నా పెట్నావాన్నా?"

"అట్ల పెట్నా నెత్తిమీద కాలు!"

ఆ మాటతో అందరూ విరగబడి నవ్వినారు.

రెడ్డిగారి బానకడుపు ఆ నవ్వులకు తాళంవేస్తూ ఉంది.

పొద్దు నడిమిట్టన ఉంది.

పట్టుబట్టి రెడ్డిగారు అందరికీ పన్నన్నం పెట్టారు. అది ఆయన కొక అలవాటు. తిన్నయింటికి సాధారణంగా ఎవరూ వాసారంచరని ఆయన గట్టి నమ్మకం.

ముక్కు దాకా మెక్కి రెడ్డిగారి బొదార్యాన్ని మనసార పొగడాలంటే అయాసం అడ్డొస్తుండగా ప్రయత్నాన్ని మానుకొని మేళగాళ్ళనితాళగాళ్ళని మించిన తొత్తుగాళ్ళు కాలు సిదిపినారు.

రెడ్డిగారు అప్పటికేతృప్తిపడి ఆ తృప్తిలోనే పట్టెమంచంమీద పవళించినారు. పట్టెమంచంమీద పవళించినా రెడ్డిగారి మనస్సులో ప్రసన్నత లేదు.

"లక్ష్మినారాయణ సచ్చినోడెట్లా సట్నినాడు. వాడూ మునుసున్నబు, కరణం తన్నీ సప్పుడు నిజ్జేసిరి. వాళ్ళనుసేతుల్లో యేమున్నదని నేనుళ్ళే పిగొచ్చినంత పనయింది. ఇంతో అందరినో బ్యాయిమూకలుపడె!– అయినా వాడకోవాళ్ళు మొదుదెబ్బలుతిని– ఆ వాగిస్తె యిట్టిదు సకొచ్చె ఏం జెయ్యాల్ల?– అని బెదుకు బెరుగ్గానే సిందెడి ఒక చేత్తిని ఎట్నోటట్టుతెలిపాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే యిప్పుడిదొక ఎట్టయినా సెప్పి– ట్లాజెయ్యాలన్నా!– దానెమ్మనుగొట్టా!– అదే

లచ్చుంగాడి పెళ్ళాం. ఎప్పుడూ అంత పరకాయించి సూశ్శేదు కానీ, అడదా అదీ!- మరీ మొగుడు పొయ్‌నాక కొంచెంగా నీళ్ళు పట్టినట్టుంది. ఓహోహో, 'ఏవా వంపుసొంపులు అది యింటిముంగర పన్జేసుకుంటావుంటే సాల్దా! కండూరా సూసుకుంటావుంటే పొద్దట్టా సెప్పకుండా పోదా!- అయినా అదేశ సెప్పిన మాటనేటిగా వుందబ్బా! నంగరి సుందర నవ్వుతా మాట్లాడ్తేనే కండ్లల్లో నిప్పులు కురిపించెనే!- నిర్దీసి అడిగితే అదింక బతకనిచ్చేటిగా వుందా! 'ఏవో! సూడల్ల మరి? అయినా మనవల్ని కాదని దాన్నింట్లో పెట్టుకోగలిగిన మొగోడెవు డుండాళ్ళే!".

ఆలోచిస్తూ ఆలోచిస్తూ అట్లానే రెడ్డిగారు మాగన్నుగా కన్నుమూసినాడు.

పొద్దుబాగా వాటారింది.

లచ్చిమి ఉలిక్కిపడినట్లుగా కండ్లు తెరిచింది. చూస్తే పొద్దు గూట్లోపడత పడతావుంది. చె య్యొకపక్క కా లింకొకపక్కగా పారేసి గురక పెడుతున్న నాగుల్ని సరిగా పడుకోబెట్టింది. 'ఈ జలమాసి కెట్టొచ్చిందబ్బా యింత మొద్దు నిద్దర!' అని అనుకొంటూ పైకిలేచింది. కర్రయింట్లోకివెళ్ళి ముంతడునీళ్ళు ముంచుకొసంది. వీధివాకిట్లో చిలకరించింది. అట్టొక కర్ర యిట్టొక కర్రవేసింది. అది యింటిముంగిట ముక్కెర!

లచ్చిమి నట్టింట వల్లదారిన దీపం సెమ్మెను కడిగింది. కడిగిన సెమ్మెకు పసుపుకుంకం పెట్టింది. ఆ పసుపుకుంకం తనకు తనకు దక్కకుండా పొయ్యిందే!- అనుకొనేసరికి ఆమె గుండె చెరువయింది. మనసారా ఏడ్చుకోవా లనిపించింది. ఏడిస్తే పిలగాడి చెవుల్లో పడుతుంది. పడితే వాడూ ఏడుస్తాడు. అదే తాను భరించడం కష్టం. అందుకే తన్ను తాను ఎట్లో సమాళించుకొంది. కడిగిన సెమ్మెమీద అంత ఆవుపేడ ముద్దచేసి పెట్టింది. ఆ పేడమీద ప్రమిదను పెట్టింది. ఉట్టిమీద బుడిగలో నూనె అంతా ప్రమిదలో పోసింది. దీపం వెలి గించింది.

ఓబులేసురెడ్డిగారి వాకిట్లో ట్యూబ్‌లైట్ దేదీప్యమానంగా వెలిగింది.

రెడ్డిగారు అంతకుమునుపే నిద్ర లేచినారు. మొగం కడుక్కొని గుండు చెంబు కాఫీ గుటుక్కుగుటుక్కుమని సేవించినారు. పట్టెమంచం మీద దిట్టంగా కూర్చున్నాడు. వెలుగుతున్న ట్యూబ్‌లైట్ వెలుగుల్లో రెడ్డిగారి ముఖారవిందం కొత్త కాంతుల్తో వెలిగిపోతూ ఉంది. లచ్చిమిని గురించి ఆలోచించేకొద్దీ ఆ కొత్త కాంతులు మరీ కొ పెక్కుతున్నాయి.

"దీపం పెట్నాక ఏొణుకోకూడదు, లెయ్ నాయినా లెయ్!"- లచ్చిఁవి నాగుల్ని నిద్రలేపింది. పెరట్లోకి చిన్నబిడ్డలాగా నడిపించుకొని వెళ్ళింది. నిద్ర మొగాన్ని కడిగింది. పైటచెరగుతో మొగాన్ని తుడిచింది. తల దువ్వింది. సాదు చుక్క పెట్టింది. 'నా బంగారు కొండమ్మా!' అంటూ ముద్దుపెట్టుకొనింది. మధ్యాహ్నం మిగిలింది వెలక్కాయంత సంకటి. మూకుట్లో వేసి ముందు బెట్టింది.

నాగులు నంజినంజి తింటున్నాడు.

లచ్చిఁవి మానెడు సద్దలు చాటలో పోసుకొనింది. రాయిారప్ప యేరి పించింది. రోట్లో పోసి దంచింది. పైపొట్టు చెరిగేసింది. పొట్టు చెరిగినసద్దల్ని నీళ్ళ తడిపి నానబెట్టింది. సద్దలు నానుతూంటే ఆమె పొయ్యి ముట్టించి ఎసరుపెట్టింది. ఎసరు కాగుతూంటే నానిన సద్దల్ని రోట్లోపోసి దంచింది. దంచిన సద్దపిండిని సలసలకాగుతున్న ఎసట్లో పోసి బాగా కలబెట్టింది. అది కళకళ ఉడుకుతూంటే- దొంతి కడవలోనుండి రెండు చిప్పల రాగిపిండిని ఎత్తుకొని ఉడుకుతున్న సద్దనూకల్లో పోసింది. సంకటి కెలికింది.

జాము రాత్రి కావస్తూ ఉంది.

తల్లీ బిడ్డా ఉడుకుడుగ్గా అంత సంకటి తిన్నారు.

వీధి వాకిట్లో ఈతాకు చాప పరుచుకొని పడుకొన్నారు.

ఊరు మాటుమణిగింది.

## 6

రోహిణీకార్తెకు రోషం తగ్గినట్లు లేదు.

మోటారు సైకిలు ఉన్నట్లుండి ఆగిపొయ్యేసరికి మోహన్నాయుడుకి ఆకాశం నేలకూలినంత ఆశ్చర్యం కలిగింది.

మోహనాకారుడు మోహన్నాయుడు ప్రియురాలి బుగ్గకంటే ప్రియంగా చూచుకొనే మోటార్‌సైకిలది. బయలుదేర్తే అది యింటిదారిపట్టిన గొడ్డులాగ ముందుకు దూసుకుపోవడమే ఎరుగును కానీ మొండికేసి ఎరగదు. 'ఎక్కడంటే అక్కడ ఎప్పుడంటే అప్పుడు ఆగిపోవడానికి నాదేమీ ఆర్టీసీ బస్సు కాదు.' అని మోహన్నాయుడు మీసంమీద చెయ్యివేసి మురిసిపోతుంటాడు. అట్లాంటి మోటార్‌సైకిలు ఉన్నట్లుండి ఆగిపొయ్యేసరికి మోహన్నాయుడు హడావిడిగా కిందికి దిగినాడు. బయలుదేరేటప్పుడు చూచుకొన్నాడు. పెట్రోల్ టాంక్

నిండుకూ ఉంది. అయినా సందేహమే!_ ఒకసారి సరిచూచుకొన్నాడు. స్టార్ట్ చేయడానికి సతమతమవుతున్నాడు.

మధ్యతరగతి జీవితాన్ని మధించి మూసపోసినట్లుందా బాట. ఆ బాట కిటువైపు అటువైపు చూపు ఆనినంత మేరకు బోడిబోడి చెట్ల బయలు. వడ గాడ్పులు గూబల్ని అదరగొడుతున్నాయి. మోహన్నాయుడు చెమటతో తడిసి ముద్దయినాడు. ఓపిక నశించింది. ఏ చెట్టునీడనో కాసేపు సేదదీరకపోతే కుదరదనుకొన్నాడు చుట్టూ కలయచూచినాడు. దాదాపు అరకిలోమీటర్ దూరంలో ఒక చెట్టు కనిపించింది.

కదిలితే బండి. కదలకపోతే బండ.

ఆ బండను ఈడ్చుకొంటూ చెట్టుకింద చేరేసరికి నాయుడుగారికి నరములు విరిగినంత పని అయింది.

ఆ చెట్టుకింద బండిని నిలబెట్టి చటుక్కున చతికిలపడినాడు.

అదొక మర్రిచెట్టు. ఆ చెట్టునీడలో కూర్చున్న మోహన్నాయుడు రెండు చేతుల మోపున కాస్త వెనక్కు వాలినాడు. తల పైకెత్తి కండ్లు మూసుకొన్నాడు. బోడిబోడి చెట్లబయలు మీదుగా వీస్తున్న వడగాడ్పులు ఆ చెట్టుకింద చేరేసరికి కాస్తత చల్లబడుతున్నాయి చెమటతో తడిసి ముద్దయిన ఒంటిమీద ఆ చల్లగాలులు తగులుతూంటే ప్రాణం లేచి వచ్చినట్లుంది. ధ్యానముద్ర వేసినట్లు కదిలీమెదల కుండా మోహన్నాయుడు పదినిముషాలు సేదదీర్చుకొన్నాడు. ఆ తరువాత బరువుగా పైకి లేచినాడు. మోటార్‌సైకిలు సైడ్ క్యారియరు పెట్టెలోనుండి మంచినీళ్ళ సీసా అందు కొన్నాడు. గుక్కెడు గొంతులో పోసుకొన్నాడు. ప్లగ్‌పిన్ క్లీన్ చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. ఎంత ప్రయత్నించినా అది ఊడిరాలేదు. దాన్ని తట్టడానికి ఒక రాయి అవసరమయింది. ఆ రాతికోసం అటు యిటు చూస్తుంటే ఒక చిన్నవాడు కంటపడినాడు.

ఆ చిన్నవాడు చెట్టుకు చేరగిలబడినాడు. కాళ్ళు బారసాచి కాలుమీద కాలేసినాడు. పుస్తకాలసంచి కాబోలు, పక్కన్నే ఉంది. ఆ సంచిమీద కుడి చెయ్యి మోపుగా ఉంది. మగన్నుగా కన్నుమూసినాడు.

మోహన్నాయుడు ఆ చిన్నవాణ్ణి నిదానించి చూచినాడు. ఒక్క క్షణం సందేహంతో అతని కనుబొమ ముడిపడింది.

“ఒరే! నాగులూ!” అని అరిచినాడు.

నాగులు అదిరిపడి లేచినాడు.

"ఒరేః పిల్లనాయాలాః నువ్వెందేదేడః ఊళ్ళేసేద్రాః– ఇంతూరం నువ్వెందుకొచ్చినట్రాః"

నాగులు చేతులు కట్టుకొని తప్పుచేసినట్టు తలవంచుకొని నిలబడినాడు.

"అదేందిరాః అడగతావుంటే బెల్లంకొట్టి రాయిమాదిర గమ్మునుండావుః"

నాగులు వంచిన తలెత్తలేదు. నోరు కదపలేదు.

"ఓహోః కొదవకు పుస్తకాలు కూడా పక్కన్నే వుండాయన్నమాట. ఇదేనా నువ్వు చదిగే చదువు?– బాగుండాదిరాః.... శానా బాగుండాది. ఓగు కడుపులో వజ్రం పుట్టు. వజ్రం కడుపులో ఓగు పుట్టు– అన్నట్లుంది గదరా యవ్వారంః"

నాగేఃపలసిగ చోటనే తగిలింది మాట. నాగులు తల చివుక్కున పైకి లేచింది. కండ్లల్లో గిర్రున నీళ్ళు తిరుగుతున్నాయి.

మోహన్నాయుడు గమనించే స్థితిలో లేడు.

"అదినాటుంచి సీయమ్మాటడవాః– అదే వాడు నీయబ్బ, ఎట్లాంటోడు వాడు. నా పక్కడిసెయ్యి మాదిరుండెగదరాః– కాల్తో సెప్తే సేత్తో చేస్తావుండె. గాచ్చారం సాలక సచ్చిపోయినాడనుకోః– నువ్వేదైనా పనిపాట కక్కదిరి బతుకు దెరువు సూడుకోకుండా యీడేంచేసా యిట్లా గాలికి తిరగతావుండావేః"

"నే నేదైనా పనిలి కుదురుకుంటానంటే మా యమ్మ వద్దంటా ఉంది."

"ఎందుకంటః"

"నేనింకా సూక్కులికి పొయ్యి సదువుకోవాలట."

"సదువుకోని కలెక్టరుద్యోగం సెయ్యాలంట్నాః"

"ఉదే నేనూ అంటే ఆమె యింటేగదయ్యాః – అమ్మాః మనూర్లో ఉండేది ఏడోతరగద్దాకనే కదాః – ఏడో తరగద్దాక సదువుకుంటే ఏం ఉద్యోగం రాబోతుంది? – అట్లా యిట్లా కూడా సెడిపోయేదానికంటే యిప్పుడే యే అయ్యా కాడైనా కుదురుకుంటే నడుంచాన్నా వంగుతుంది. అంటే యింటేగదాః– ఈపొద్దు తెల్లార్తో నా యిద్దరికీ యిదే జగడం. 'ఇసూక్కులికి పోరాః' అని అమ్మ. పోనని నేను. 'సెప్పిన మాటింటా నాః తెడ్డురా యెదవాః' అని సెవాబడా తిట్టి పట్టుకోని కొట్టింది."

"అమ్మ కొట్టిందని అలిగిపోతా ఉండావాః"

"లేదు. తిరపతికి పోతావుండా. అడ యే యింట్లోనో హోటల్లోనో



పని కుదురుకుంటా. కుదరకపోతే రిక్షా తొక్కేది నేర్చుకుంటా. ఆమింద ఒచ్చి మా అమ్మను పిల్చుకోని పోతా"

"బలే బాగుందిరా నీ ఆలోచన."

"ఇంకేం జెయ్యమంటారు సెప్పండయ్యా. మా నాయన, వాళ్ళ నాయన రెడ్డోరికే బతుకంతా దారపోసిరి. అయినా రెడ్డిగారికి కాసింత కనికరం లేకపాయ. నిన్న రాత్రి ఆయన వాకిట్లో గంటల తరబడి నిలబడ్తే ఆయనేవని వాపోయినాడో తెలుసా ఒయ్యా?- మా అమ్మకు మా అయ్య యిస్తావున్న ఆ సుకం వయినా యిద్దామనుకుంటే కూడ పాపం వయసు లేకుండా పొయ్యిందంట."

"ఆఁ! అంత మాటన్నారా?"

"అన్నాడయ్యా అన్నాడు. పేదోళ్ళను సూస్తే ఈ పెద్దోళ్ళకంతా ఎగతాళి కదయ్యా?– ఏం సెయ్యమంటారు సెప్పండి."

ఆ మాట అంటూఉంటే వాడి గొంతు దుఃఖంతో పూడుకపోయింది.

"ఒరే! నే నొక మాట చెప్తా, యింటావా?"

"సెప్పండయ్యా!"

"నువ్వేం సెయ్యద్దురా! నేరుగా యింటికిపో!– తెల్లార్తో లేసి రెడ్డోరింటికి పొయి పనిక్కుదురుకో!"

"ఛఛ! మా అప్పను పట్టుకోని అంత మాటంటే మల్లా ఆయనింటి కడప తొక్కమంటారాయ్యా!– అంతకంటే ఉరుబోసుకోని సచ్చిపొయ్యేది మేలు గదయ్యా!"

"అదేందిరా లోకం గొడ్డుపొయ్యినట్టు మాట్లాడ్తావుండావే!"

"అయితే నన్ను మీ యింట్లోనే పనికి పెట్టుకోండయ్యా."

"మా యింట్లో పనికి పెట్టుకునే దేవంత పెద్దపని కాదురా!– కానీ నువ్వు రెడ్డోరింట్లోనే పన్జెయ్యాల!"

"ఎందుకయ్యా?"

"ఎందుకంటే మి నాయన మీ నాయనోళ్ళ నాయన రెడ్డోరింట్లోనే కడ తేర్నారు కాబట్టి."

"అయితే నా గెతి కూడా అట్లానే కావాలంటావా అయ్యా!"

"ఎవురి గెతి ఎట్లుండాదో ఎవుర్జూసినార్రా?– ఆయన సేతిలో నువ్వే కడ తేరాల్నో?– లేకుంటే నీ సేతిలో ఆయనే కడతేరాల్నో? బ్రహ్మరాతను తప్పించే దాని కెవురితరం కానీ, నా మాటిను. నువ్వు రెడ్డోరింట్లో కుదురుకో!"

రెడ్డోరింట్లో పనికి కుదురుకోమని మోహనాన్నాయుడు ఎందు కంత పట్టుగా చెబుతున్నాడో– అంతుపట్టక నాగులు ఆలోచిస్తున్నాడు. మోహనాన్నాయుడు చేతికి సిగరెట్టు తీసుకొన్నాడు. ఆ సిగరెట్టును అతి నాజూగ్గా వేళ్ళనడుమ పట్టు కొన్నాడు. అగ్గిపెట్టెకు ముద్దుపెట్టినంత ముద్దుగా మూడుసార్లు తాటించినాడు. ఆ తరువాత పెదాలమధ్య యిరికించుకొన్నాడు. అగ్గిపుల్లను అలవోకగా గీచి సిగరెట్టు ముట్టించుకొన్నాడు.

నాగులు తదేకంగా చూస్తున్నాడు.

అట్లా చూస్తూఉంటే నాగు మనసు ఎక్కడెక్కడికో పోతూఉంది.

తన అయ్య బతికుండిన రోజుల్లో బీడీ ముట్టించుకోవడానికి 'ఒరే

అబ్బోడా! దీ గూట్లో అగ్గిపెట్టె ఉండాది తీసకరారా!' అని అంటే తీసుకొని పోయి యిచ్చినాడు. అగ్గిపెట్టె కనబడకపోతే పొయ్యిలో మండుతున్న కొరివి కట్టెను ఎత్తుకొనిపోయి యిచ్చినాడు. బడిలో అయ్యవారు పాఠాలు చెబుతూ చెబుతూ ఉండి, ఉన్నట్లుండి ఆపి, ఏదో పనిమీద వెళ్ళినట్లు బయటికి వెళ్ళి చెట్టు మరుగున చేరి సిగరెట్టు ముట్టించుకోవడం చాలాసార్లు గమనించినాడు. కానీ ఎప్పుడూ తనకెలాంటి ఆలోచన రాలేదు. కానీ మోహన్నాయుడు సిగరెట్టు ముట్టించుకొని కాసేపు చేతిలో అట్లానే పట్టుకొన్న అగ్గిపుల్ల మండుతూంటే చిత్రమైన ఆలోచనలు ఆ చిన్నారి బుర్రలో మెదిల్నాయి. తన గుండెల్లో మండు తున్న మంటకామంట తోడయినట్లయింది మంట రెట్టింపయింది. ఆ లేతబుర్రలో కోత మొదలయ్యింది.

మోటార్ సైకిల్ యింజను చెట్టునీడలో బాగా చల్లబడినట్లుంది. మోహ న్నాయుడు మాటల్లోపడి ప్లగ్ జోలికి పోలేదు. ఒకసారి స్టార్ట్ చేసి చూస్తామని ప్రయత్నించినాడు. ఒక్క దెబ్బతో బండి స్టార్ట్ అయింది.

మోహన్నాయుడు ముఖంలో నుగ్గులు పోసినట్లయింది.

దర్జాగా బండిమీద కూర్చున్నాడు.

"ఒరే నాగులా! తొందరగా యిల్లు జేర్రా!— అడ మీ యమ్మ పాపం! యాడేడ ఎతకతావుందో యేమో!"— అంటూ ముందుకు సాగినాడు. పోతున్న నాయుణ్ణి కంటిమీద రెప్పవేయకుండా నాగులు కంటికి మరుగయ్యేదాకా చూస్తూనే ఉన్నాడు.

మోహన్నాయుడు కనుమరుగైనాడు. పొద్దు నడిమిట్టన మిడిసిపడ్తా ఉంది నాగులు దృష్టి చెట్టుకిందికి మరలింది. అక్కడ పుస్తకాల సంచి కంటపడింది. ఆకలిగొన్న పిల్లి అందుబాటులో వున్న ఎలుకపిల్లమీద పడినట్లుగా ఆ సంచి మీద పడినాడు. సంచిలో నుండి పుస్తకాల్ని బయటికి లాగినాడు. ఒక్కొక్క పుస్తకాన్ని కసితీరా చిందరవందరగా చింపినాడు. ఆ చిత్తుకాగితాల్ని చెట్టుకింద కుప్పపోసినాడు. ఆ కుప్పముందు కూర్చున్నాడు. కూర్చున్ని ఏదేకంగా ఆ కుప్ప వైపు చూస్తుంటే అగ్గిపెట్టె కంటపడింది!

అది మోహన్నాయుడు మరిచిపోయిన అగ్గిపెట్టె!

నాగులు తటుక్కున లేచి ఆ అగ్గిపెట్టెను చేతికందుకొన్నాడు. తీసి చూస్తే అందులో ఎంచినట్లు అయిదే పుల్లలు. ఒక్క పుల్ల చేతికి తీసుకొన్నాడు. చేతిలోని పుల్లవైపు ఒక్కసారి, పెట్టెవైపు ఒకసారి మార్చిమార్చి చూసినాడు. అట్లా చూస్తుంటే ఆ లేతబుర్రలో ఎన్నో ఆలోచనలు మెలితిరుగుతున్నాయి. ఆ ఆలోచన

లన్నీ ఒక్క కొలిక్కి వచ్చేసరికి వాడి మొగంలో తృప్తి తొణికిసలాడింది. చేతిలోని అగ్గిపుల్లను గీచినాడు. అది చటుక్కున వెలిగింది. ఆకు అల్లాడని ఆ వేళలో అది నిలకడగా వెలుగుతూ ఉంది. నిలిచి మండుతున్న ఆ పుల్లవైపు ఒక్క క్షణంసేపు మనసుపెట్టి చూచినాడు. ఏమనుకొన్నాడో యేమో చింపిన పుస్తకాల కుప్పకు అంటించినాడు, అది అంటుకొనింది. గబగబ మండింది– వాడి గుండెల్లో మంట మాదిరి. కాగితాల మంట ఎంతసేపు మండుతుంది?– చప్పున ఆరిపోయింది తాటాకుల మంట మాదిరి. అయితే వాడి గుండెలు మాత్రం మండు తూనే ఉన్నాయి.

"అయ్యో! కాలు తగిల్తే కండ్లకద్దుకుంటా వుంటినే!– అట్లాంటి సరస్వతిని చేజేతుల కాల్చేస్తినే!"– అని 'బొరో'మని ఏడుస్తున్నాడు. చేతికి బూడిద కూడా మిగలని ఆ కుప్పను పిసుకుతూ బూడిదైపోయిన తన ఆశయాల్ని తలపోస్తూ బావురుమన్నాడు. ఏడుస్తూంటే గుండె మెలికలు తిరిగినట్లయింది. పట్టుకోలేక చేత్తో పట్టుకోవాలని ప్రయత్నించినాడు. ఎగమీద చెయ్యి పారాడుతూంటే– జేబులోని అగ్గిపెట్టె చేతికి తగిలింది. ఆ పెట్టెను మళ్ళీ చేతికి తీసుకొన్నాడు. తదేకంగా దానివైపు చూస్తూంటే వాడి ఏడుపు ఆగిపోయింది. మెలికలు తిరుగు తున్న గుండెల్లో మంట పుట్టింది. ఆ మంటలో కండ్లల్లో నీళ్ళు ఆవిరైపోయి నాయి. కండ్లు ఎర్రబడినాయి."

ఏదో నిర్ణయం నాగుల్ని తట్టి పైకిలేపింది. ఆ నిర్ణయంతో వొళ్ళు పదు రుతూ ఉంది. తనకోసం పరితపిస్తూ ఎదురుచూస్తున్న తల్లి కండ్లముందు మెదు లుతూ ఉంది. ఒక్కక్షణం నిలబడలేక పోయినాడు. ఆ ఎండలోనే ఎలబార్చాడు.

ఎప్పుడో ఉదయాన అమ్మతో కీచులాడి తోచీతోచక తాగిన దోసెడు సద్ది నీళ్ళు. ఊరు చూడమంటే ఉత్తరం చూసినట్లుగా అమ్మ బడికిపొమ్మంటే తాను తిరుపతికి పోదామని బయలుదేర్నాడు. పట్టుబట్టి పదిమైళ్ళకు అటో యిటోగా నడిచి నాడు. ఇంటినుండి ఎలబారన్నపుడేమో ఏదో ఆశ!– చవిచూడబోయే కొత్త జీవి తంపై మోజు. అమ్మను కడప దాట్నీకుండా సంరక్షించుకోవాలన్న తపన. పది మైళ్ళు దూరం నడిచినట్లే తెలియలేదు. కానీ తిరుగుముఖం పట్టేసరికి అడుగుతీసి అడుగువేయాలంటే అవస్థగా ఉంది. అయినా నాగులు నడుస్తున్నాడు.

పొద్దు వాటారింది. అయినా ఎండదెబ్బ తగల్లేదు. నాలుక పిడచగట్టుక పోతూ ఉంది. కాళ్ళు కుక్కలు పీకినట్లు పీకుతున్నాయి. దోసెడునీళ్ళు గొంతులో పడ్తే బాగుండు ననిపిస్తూఉంది. రాయలసీమలో రాళ్ళల్లో రత్నాలైనా దొరకతా

యేమో కానీ గుక్కెడు నీళ్ళు దొరకడమంటే మాటలా?— కానీ ఆ పసిగుడ్డుకేం తెలుసు ఈ గడ్డదినుసు ?—

నాగులు ఊరిపొలిమేరల్లో అడుగు పెట్టేసరికి పొద్దు గూట్లోపడబోతాఉంది. ఊరి పొలిమేరల్లోనే బాటపక్కన్నే ఓబులేసురెడ్డిగారి బావి. ఆ బావి చుట్టు పక్కల బావులున్నాయి. అయితే ఆ బావుల్లో అందీఅందని నీళ్ళను అందుకో లేక పంపుసెట్లు పరితపిస్తూంటే — రెడ్డిగారి పంపుసెట్టుమాత్రం పాతాళగంగను ఒక్కమోపున పైకెత్తిపోస్తూ ఉంది— రెడ్డిగారి దర్పాన్ని దర్జాని చాటుతున్న ట్లుగా— ఆ నీళ్ళు కనబడేసరికి నాగులుకి పోయినప్రాణం లేచివచ్చింది.

నాగులు గబగబ ఆ బావివద్దకు నడిచాడు. దుమ్ముకొట్టిన కాళ్ళుచేతుల్ని కడుక్కొన్నాడు. దూకుతున్న నీళ్ళకెదురుగా కాసేపు ముఖాన్ని అడ్డంగా పట్టి నాడు. ప్రాణం కాసంత కుదటపడినట్లయింది. కడుపారా నీళ్ళుతాగుదామని పంపునీళ్ళు పట్టుకోవడానికి దోసిలి వొగ్గినాడు.

దోసిలినిండా నెత్తురు!

పడమటికొండల మాటునుండి సూర్యుడు వెదజల్లుతున్న కావిరంగు కార ణమో?— వాడి గుండెల్లోని మంట ప్రభావమో? లేక వాడి భ్రమో? దోసిలినిండా నెత్తురు. కళపళ ఉడుకుతున్న నెత్తురు. కవ్విస్తున్న నెత్తురు!

తన తండ్రి నెత్తురు తానే తాగుతున్నట్టు భ్రమ!

దోసిలి విడిపోయింది.

పిడికిళ్ళు బిగుసుకొన్నాయి.

ఆ బిగువుమీదనే నడుస్తున్నాడు!

నాగులు గెవిన్లో అడుగు పెట్టేసరికి కనుచీకటి పడుతూఉంది.

రెడ్డోరి బావిదగ్గరనుండి గెవినివరకు ఒక్క లగువులో సాగిన నడక గెవిన్లో తడబడింది. తట్టుకోవడాని కన్నట్లుగా ఒక్కక్షణం నిలబడినాడు. అక్కడ నిల బడితే అనుకోకుండా చూపు తన గుడిసింటివైపు మళ్ళింది. నాగులు గుండెల్లో పెద్ద గుండుపడింది. 'అమ్మ!— ఎక్కడెక్కడ వెతుకుతూ వుందో? ఏమంటుందో? ఏవేవి అడుగుతుందో? అడిగితే ఏమని చెప్పేది?'— అని అన్నీ ప్రశ్నలే!—

లోబెరుకు వెలిబెరుగ్గా నాగులు మెల్లగానె బయలుదేర్నాడు.

గుడిసింటిముందర నిలబడేసరికి గుండె గతుక్కుమనింది.

గుడిసె తాళంవేసి ఉంది!

నాగులు కాళ్ళకు తాళంవేసినట్లయింది. ఆలోచన్ల బరువుతో తల వాలిపోయింది. కాలి బొటనవేలు నేలమీద పిచ్చిగీతలు గీస్తూఉంది.

"అమ్మ యాడేడ తిరగతావుందో? ఎవురెవుర్ని అడగతావుందో? కనపళ్ళేదని సెప్తే ఎంత కలవరపడిపోతావుందో?.... అమ్మను వెతుక్కొంటూ పోతే?– ఒకేళ నేనిట్లాపోతే ఆఁవిడిట్లా వచ్చేస్తే?.... ఏం చెయ్యాలబ్బా?"

ఏం చెయ్యాలనుకొంటూనే ఏం చెయ్యలేక నిలబడుకొన్నాడు నాగులు।

"ఇయ్యాళదాకా యాడ సచ్చినావురా యదవనాకొడకా?..యాడేడ్రా నిన్నెతికేది?"

కటువుగా మాటలు చెవినిపడేసరికి నాగులు తలపైకెత్తి చూచినాడు. సుడిగాలిలా దూసుకొనివస్తా ఉంది అమ్మ. నాగులు లేతఆకులా విలవిల్లాడిపోతున్నాడు.

ఇంతవరకు కంటపడలేదని కలవరపడ్తూ ఉండిన మాతృహృదయం తీరా కంటపడేసరికి మండిపడుతూ ఉంది.

"సెప్పురా। యియ్యాళదాకా యాడ సచ్చినావో మొరగరా।"

నాగులు వంచిన తలెత్తలేదు.

"ఏఁవిరా? ఎవుర్నిరా నే నడగతావుండేది?– సెవల్లో సెట్లేవైనా మొలిసినాయా? సెప్పురా?– సదువు కెందుకు పోలేదో సెప్పురా।"

నాగులు మెల్లగా తల పైకెత్తినాడు. అమ్మ ముఖంలోకి చూచినాడు. ఆ చూపుల్ని తట్టుకోవడం కష్టమనిపించింది. మెల్లగా తల వాలుస్తూ 'పోలేదు।' అన్నాడు.

"అదేరా నే నడిగేది?– ఎందుకు పోలేదూ అని।"

"పోకూడదనే పోలా।"

"ఆఁ। అయితే అంతకాడికొచ్చినావన్నమాట।– సరే పుస్తకా లెక్కడ?"

"కాల్చేసినాను."


"ఆఁ। కాల్చేసినావా?"

"ఆఁ। సుబ్రంగా కాల్చేసినాను. మన బతుకులే కాల్తావుంటే యింకా పుస్తకా లేంజెయ్యబోతాయి?"

"అట్లని పుస్తకాల్ని కాల్చేస్తావంట్రా యదవనాకొడకా?"

లచ్చిఁవి అగ్గిమీద గుగ్గిలమే అయింది. వొడిసి వాడి జుట్టు పట్టుకొనింది. వాటంగా మూతిని పైకిలేపి పట్టుకొనింది. ఈ చెంపా ఆ చెంపా చెడామడా వాయించింది.

అసలే సొమ్మసిల్లిన ప్రాణం. ఆ దెబ్బలకు తట్టుకోలేక అట్లానే నేలకొరిగిపోయినాడు.




లచ్చిమి గుండె చెరువయింది. తన ఆవేశానికి తన్ను తానే తిట్టుకొనింది. కొట్టుకొనింది. జుట్టు పీక్కొనింది ఏమిచేసినా మనసు దిటవుపడక నాగుల్ని రెండుచేతులతో జవురుకొనింది. గుండెల్లోపొదివికొని కుమిలికుమిలి ఏడుస్తూ ఉంది.

చెరువుకింద చెరుకుతోటల్లో బొట్టినక్కల ఊళలు హృదంతరాల్ని చీల్చుకొని వచ్చే రోదనల్లా వినిపిస్తున్నాయి. కొంపలు కొల్లబోతున్నట్లు కుక్కలు 'కుయ్యో!' మని ఏడుస్తున్నాయి. గుడిసె ముందర చింతచెట్టులో కీచురాళ్ళరొద చికాకుపరుస్తూ ఉంది.

నాగులు మెల్లగా తెప్పరుకొన్నాడు. అమ్మ ఏడుపు ఎక్కడో నూతిలో నుండి వినిపిస్తున్నట్లు లీలగా వినిపిస్తూ ఉంది. అమ్మ ఏడుస్తూఉందని తట్టగానే గుండెల్లో బాధ. ఆ బాధనుండి ఆవేదన. ఆవేదన కట్టతెంచుకొంటే కోతిపిల్లలా అమ్మ గుండెలకు హత్తుకొని బావురుమన్నాడు.

అమ్మ ఏడుస్తున్నదని కొడుకు, కొడుకు ఏడుస్తున్నాడని అమ్మ. ఒకరి నొకరు ఓదార్చుకోవలెననుకొంటూనే ఎవరికివాళ్ళు ఏడుస్తూనే ఉన్నారు.

చీకటి చిక్కపడుతూఉంది.

"ఏడవకు ఏడవకు వెర్రినాతండ్రీ! ఏడిస్తే నీ కంట్లో నీలాలు కారు!" అని లాలిపాట పాడటానికి లచ్చిమికి ఓపిక లేదు అందుకే తన్ను తాను సమాళించుకొనింది. ఆ తరువాత నాగులు చెక్కిళ్ళపై కారుతున్న కన్నీటిని తుడుస్తూ–

"నాయినా! ఒక్కగానొక్కడివి, నీ మిందే పాణాలు నిలుపుకొని బతకతా వుండా. నువ్వే లేకుండా వుంటే— మీ అయ్య పోయినాక ఈ బతుకు బతికేదాన్నే కాదు, ఎప్పుడో యే నుయ్యో గొయ్యో సూసుకునేదాన్ని. ఇప్పుడు నువ్వులేకుండా నేను బతకలేన్రా!— నా మిందొట్టుబెట్టి సెప్పు. ఇంకమిందట నన్నొదిలి యాడికీ పోనని సెప్పురా!"

లచ్చిమి గడ్డంపట్టుకొని బుజ్జగిస్తూ బ్రతిమిలాడింది.

"నువ్వు కూడా నా మిందొట్టేసి సెప్పమ్మా!"

"ఏమని సెప్పమంటావురా!"

"నా మాట కడ్డంసెప్పనని సెప్పు."

"ఇది గెద్దాలొచ్చినపుడు అడగాల్సిన మాట కదరా!"

"అమ్మా! నువ్వట్లంటే నే నేమి సెప్పేది?— మా అయ్యే బతికుంటే నిన్ను కడప దాట్నీకుండా చూసుకుంటావుండె గదా?— ఆ అయ్యకు కొడుగ్గా బతకాలనుకున్నా!— దీనికి మాత్రం నువ్వు అడ్డం సెప్పొద్దమ్మా!"

ఆ మాట చెవినిపడడంతో లచ్చిమి గుండెలు ద్రవించినాయి. నాగుల్ని గుండెలకు హత్తుకొని బావురుమనింది.

ఊరు మాటుమణిగింది!

## 7

"యినా ఎంగటేశం సహదానసాద

సదా ఎంగటేశం సొరామి సొరాయు!"

ఉపస్వరం చెవినిపడడంతో ఆ ఏడుకొండలస్వామి అనుగ్రహిస్తున్నాడో లేక తన స్తుతిపాఠాన్ని వ్యావహారికంచేసిన భక్తుణ్ణి అనుగ్రహిస్తున్నాడో కానీ పూజామందిరంలో వేంకటేశ్వరస్తోత్రం మారుమోగుతూ ఉంది. బారెడుపొద్దు ఎక్కి ఎక్కకముందే రెడ్డిగారికి బహుంపరాక్ పలకడానికి వేంచేసిన మేళగాళ్ళు తాళగాళ్ళు వాకిట్లో అరమోడ్పు కన్నులతో స్తోత్రాన్ని ఆలకిస్తున్నారు. పందిరి మీద అప్పుడప్పుడే వసివాడుతున్న నేరేడాకు వాసన పూజామందిరం నుండి వెలువడుతున్న అగరువత్తుల వాసన కలగలసి రెడ్డిగారి వాకిట్లో సువాసనల్ని వెదచల్లుతూ ఉంది.

"అరే ఎంగటేశా ప్రెసీదా ప్రెసీదా

ప్రియం ఎంగటేశా ప్రయచ్చ ప్రయచ్చ!"

స్తోత్రం గంట కలగలసి వినిపిస్తున్నాయి. అంటే— ఓబులేసురెడ్డిగారు

దేవుడికి హారతి పట్టుతున్నట్లుంది ఆ పిసకొండలవాడి దయకు పాత్రులు కావడానికో లేదు రెడ్డిగారు మెప్పు సంపాదించడానికో కానీ వాకిట్లో మేళగాళ్ళు తాళగాళ్ళు లేచి నిలబడి పూజామండపంవైపు చూస్తూ నమస్కరిస్తున్నారు.

ఫలపుష్పాదులమీద రెడ్డిగారికి పెద్దగా పట్టింపు లేదు. అట్లని దేవుడికి అన్యాయమూ జరగనివ్వరు. ప్రతి ఉత్సవం పత్రం తోయం సమర్పిస్తారు, దేవుడే పత్రంతోయంతో తృప్తిపడుతూ ఉంటే-రెడ్డిగారి ఆశ్రితుల సంగతి సరేసరి!-

రెడ్డిగారు వాకిట్లో అడుగుపెట్టారు.

మొలకు చుట్టుకొన్న పట్టుచవకం మోకాళ్ళకిందికి ఉంది. నొసట తీర్చి దిద్దిన త్రిచూర్ణ నామం నిగనిగలాడుతూ ఉంది. ఎడమచేతిలో రాగిచెంబు ఉంది. చెంబులో తులసితీర్థముంది. కుడిచేతిలో ఉద్ధరిణి ఉంది.

చేతిమీద చేయిబెట్టి అరచేతిని కొసంత గుంతచేసి వినమ్రంగా వంగి నిలబడినారు భజనరాయుళ్ళు- సంగడంలో ఉన్న ప్రయోజనం తెలిసినోళ్ళు. రెడ్డిగారు వరసగా తులసితీర్థం పంచుతున్నారు భక్తబృందానికి కండ్లకద్దుకొని వాళ్ళు సేవిస్తున్నారు.

"ఒరే! ని తాళ్ళు తెగ!- ఉంతా యాడ సచ్చినార్రా?"

గుమ్మానికి ఎదల నిలబడి మొగాన్ని మాత్రం కొసంత ముందుకు పెట్టి రెడ్డెమ్మ గొంతు పెంచుకొంటూ ఉ .

ఆ అరుపుతో రెడ్డిగారు తీర్థాన్ని పంచడం అటూలున నిలిపినాడు. భక్తబృందం సేవించడం మరచిపోయింది. ఏం జగిందో యేమో!! అని అందరు అదరిపడినట్లు దిక్కులు చూస్తున్నారు.

ఎట్లా విప్పుకొనిందో యేమో! - పేగదూడ!- పలుపు విప్పుకొనింది. చిందులేస్తూ కొట్టాన్ని చేరింది. తల్లి పొదుగును పొడిచిపొడిచీ తృప్తిగా పాలు తాగుతూ ఉంది.

మాట వినిపడిందో లేదో?- ఒక్క లగువులో ఎగిరిదూకినాడు. దూడ మెడకు పదేసి పట్టుకున్నాడు. అవునుండి మాడను లాగి గూటానికి కట్టేస్తున్నాడు.

అరగంట ముందునుంచి కొట్టం ముందర చేతులు కట్టుకుని నిలబడి వుండిన నాగుణ్ణి ఎవరూ గమనించలేదు.

రెడ్డిగారి మొగంలో చిరునవ్వు చిందులేసింది.

రెడ్డమ్మ నాగులుగాడివైపు ప్రసన్నంగా చూచింది. రెడ్డిగారు దర్జాగా

చూసినారు. ఒక్కసారి తల పంకించినారు. గుండెల్లో భావమేదో పెదవులపై పూస్తుంటే వెనక్కి తిరిగి హుందాగా యింట్లోకి నడిచినాడు.

మేళగాళ్ళు తాళగాళ్ళు ఓడిపోయిన వీరుల్లా మెడలు వంచుకొన్నారు.

"ఏఁవిరా నాగులూ? దోవెట్టా కనపడిఁదిరా?"

అడుగుతున్నది నాగుల్నే అయినా వాడివైపే చూడనట్లు ఎటో చూస్తూ ఏదో ఆలోచిస్తూ నడుముకు చుట్టుకొన్న చవకాస్ని విప్పి భుజాన వేసుకొంటూ రెడ్డిగారు వాకిట్లో అడుగుపెట్నారు.

"దోవకూడా కనపడకుండా పొయ్యేదానికి మాకేఁవీ కండ్లంత నెత్తి కెక్కలేదులేయ్యా?"

నాగులు వంగినవంగిగా అంటే అది చాలా ముద్దుగా వినిపించింది.

"అయ్యో అయ్యో:- ఏన్నంగంటావంట్రా మాట?- నెత్తికెక్కకుండా ఉంటే అ పొద్దు మీ యమ్మ నడిసింది నేలమిందట్రా?"

"అఁవెతో ఏవుండాదిలేయ్యా?- ఉత్త మొండి మణిసి!"

"అయినా ఆడదానికంత యిసురు పనికిరాదురా!"

"తప్పయిపొయ్యిందిలేయ్యా!"

"ఆ పొద్దది సివ్వమాదిర చూసకపోతే నిన్నింకేడ రానిస్తుందిలే అనుకుంటి. ఎట్నో రానిచ్చిందిగదన్రా?"

"రానీకుండా యేం చేస్తుందిలేయ్యా?- కట్టిపడేసేదానికి నే నేఁవన్నా పసి పిల్లోణ్ణా!"

"ఒరే! నీకుండే బుద్ది దానికుంటే మీ కూడు కుక్కల్దిన్ను గదరా?"

"అయ్యా! మా అయ్య మీ దగ్గర్నే బతికినాడు. వాళ్ళయ్య మీ దగ్గర్నే బతికినాడు. నేను మాత్రం మిమ్మల్నొల్లానయ్యా?"

ఆ మాటతో రెడ్డిగారిగుండె పాలల్లో పడిన రొట్టెలా ఉబ్బింది.

"ఒరే పిల్లనాయాలా?- మేఁవే అనుకుంటే యింక కొన్నాళ్ళు పోతే మమల్నే మించిపొయ్యేటట్టుగా వుండావు గదరా?"- అని అనుకొంటూ మేళగాళ్ళు తాళగాళ్ళు ఒకరి మొగం ఒకరు చూచుకొంటున్నారు.

"దాంతో- అదే నీ యమ్మతో పనేవుందిగానీ, నువ్వు మాత్రం గుట్టుగా పన్జేసుకోని బతుక్కో!"

ఆ మాట చెవినిపడడంతో నాగులు కొత్రకంకులా నేలకు వంగినాడు.

"తల్లీ! బూఁవమ్మ తల్లీ!- మా అయ్య, అళ్ళ అయ్య అందరూ నిన్నే

నమ్ముకున్నారు అలుపుసొలుపు ఎరక్కుండా రాత్రింబొగుళ్ళూ సేవటోడ్చినారు. వాళ్ళ గతెట్లా తెల్లారిందో నాకు తెలుసు. వాళ్ళ వారసుణ్ణే నేను. నా గతి కూడా అట్లానే కాకుండా ఎట్లా కాపాడుకుంటావో?- కాపాడుకో తల్లీ!" అని మూడు సార్లు భూమాతను తాకి కండ్లకద్దుకొన్నాడు.

తన పాదాలు అక్కడున్నట్లుగా, ఆ పాదాల్ని తాకి నాగులు నమస్కరిస్తున్నట్లుగా ఓబులేసురెడ్డి ఊహించుకొన్నాడు.

రెడ్డిగారి గుబురుమీసాలతో చిరునవ్వు గుసగుసలాడింది.

"ఒరే నాగులూ! వాడు, నీ అయ్యకి యింట్లో ఒకరొక పన్జెప్పిన పాపాన పోలేదు. అంటే- యీ యింట్లో పన్లేవీ లేవనుకుండేవు. రైతుల యిండ్లల్లో రాత్రిగూడ పనుంటుంది. పన్జెప్పలేదని పాలుమారే రకంగాదు నీ అయ్య. వాడికి సేతగాని పనీ లేదు. సెయ్యాలేని పనీ లేదు, ఇంతకన్నా యివరించి సెప్పాల్సిన పన్లేదనుకుంటా!- ఆ యబ్బకు తగిన కొడు కనిపించుకో!- పో!- పెద్దబాయికాడ సారవ కయ్యల్లో మడకల్దిరగతా వుండాయ్. పైటేళకు తిరుగుమళ్ళ సాల్దోలే దైపోవచ్చు. ఆ మిందట మాను తోలాల. ఇంటెనక సందులో మానుండాది. ఎత్తకపోయి ఆడేసేసిరా. దానికోసం మడకల్నిలిపేసి మణిసి రావాల్సుంటుంది. ఏదీ సూడల్ల!- ఈడుణ్ణట్టే తిరిగిరావాల!"

రెడ్డిగారు నాగుల్ని పురమాయించినాడు.

వాకిట్లో వారగా వంగివంగి నడుస్తూ నాగులు యింటెనక్కు పోయినాడు. ముక్కుమూలిగి మానెత్తి భుజాన పెట్టుకొన్నాడు. పెద్దబాయికాడికి ఎలబార్నాడు.

వాడు పోతూఉంటే ఊళ్ళోవాళ్ళు మరికొంతమంది రెడ్డిగారి దర్శనార్థం వాకిట్లో అడుగు పెట్టారు.

"ఇదేందబ్బా యిచ్చిత్రంగా వుండాదే?- యాళకాని యాళకాడ యింత మంది యిట్లొచ్చేసినారే!"

ఆ వేళకాడ అనుకోనట్లుగా అంతమంది రావడంతో రెడ్డిగారు ఆశ్చర్య పడినారు. అయినా అదేమీ వ్యక్తంకాకుండా అందర్నీ కూర్చోమని మర్యాద చేసినారు. పట్టెమంచంమీద కొందరు, ఆ మంచానికి అనుకొని కొందరు, వాకిటో నేలమీద కొందరు ఎవరి తాహత్తుకు తగినట్లుగా వాళ్ళు కూర్చున్నారు.

"ఉన్నట్లుండి యింతమం దొకసారిగా ఊడిపడ్డారంటే ఏదో వుండాల!- ఆఁ!" అడిగినట్లు కాకుండా, తనలో తాను అనుకుంటున్నట్లుగానే అడిగినాడు.

ఏమంటారో యేమో వినవలెనన్న ఆసక్తిగా వున్నా అదేమీ కనపరచకుండా పందిరివైపు పరిశీలనగా చూస్తున్నారు.

"సూడు మాఁవా సూడు. అట్లానే పైకి సూడు. మేఁవంతా కింద కూసో నుంటే నువ్వు పైకి సూడు."

అవునోటాయన అందుకొన్నాడు.

ఆ ఊళ్ళో అంతో యింతో వెలుసుబాటున్న రైతు తమ్మిరెడ్డి. భేదంలేని మనిషి. ఇది అనవచ్చు. ఇది అనకూడదు– అని ఆలోచించే మనిషి కాదు. నోటి కెట్లావస్తే అట్లా అనడమే తెలుసు. అందుకే అందరు అతన్ని అవు నోటాయన అని అంటారు. ఆ అవునోటాయన ఎంత పెడసుగా మాట్లాడినా పెద్దగా పట్టించుకోరు. అందుకే రెడ్డిగారు కూడా నవ్వుతూ–

"ఏఁవిరా నాయాలా?– పొద్దుతో గూడా నాతో గుద్దులాట కొచ్చినట్లుందే?– ఏఁవిరా యవ్వారం?"

"పచ్చంగా తినేసి ఎచ్చంగా బొణుకునేవాళ్ళ కెట్లా తెలుస్తుందిలే?"

"నీలో బలే వచ్చిపడింది గదరా నాయాలా?– సంగతేందో సెప్పకుండా సతాయించేదాంట్లో నువ్వు బలే గెట్టోడ్రా?"

"అందుగ్గదా వాడి అమ్మానాయినా ఒక పేరు పెడ్తే ఊళ్ళోవాళ్ళు ఒక పేరు పెట్టింది. ఆ వాగుడొదిలేసి వచ్చిన పజ్జెప్తే పోలా?"

అవునోటికి అడ్డం తగిలిందాక నోరు.

అవునోటికి ఆవేశం వచ్చింది.


"వచ్చిన పజ్జెప్తే పోలా?– అంటే సెప్పు. నిన్ను వద్దనిందెవురు? లేకుంటే పట్టుకొని నోరు కుట్టేసిందెవురు?"

"బలే తగరాడ మణుసుల్రా తండ్రీ!– తలకేస్తే మొలకు, మొలకేస్తే తలకు. మీరుండండ్రా నాయినా. నడిమిద్దె మీ రెందుకు గుద్దులాడుకుంటారు. ఆ సెప్పేదేదో నేనే సెప్తా."

కలుగజేసుకొన్నా డింకొక పెద్దమనిషి.

పట్టెమంచం మీద రెండుచేతుల మోపున బాగా వెనక్కు వాలి సావధానంగా వింటున్నారు ఓబులేసురెడ్డిగారు.

మోతమోసి అనుభవంలేని భుజం మంట పెడుతూంటే ఈ భుజంమీద నుండి ఆ భుజానికీ, ఆ భుజంమీదనుండి ఈ భుజానికి మార్చుకొంటూ ఊరి ముందర గెవిన్లో నడుస్తున్నాడు నాగులు.




"బావా! బావుల్లో నీళ్ళు అడుగంట్నాయి. వాన సినుకు నేలరాలి శానా దినాలయింది. సేసిన పైరు సేతికిరాకుండా ఎండిపాయ. మనకేంది జానెడు కడుపు. ఆ నోర్లేని గొడ్లకి వాళ్ళంతా కరువే!– వాటి గెతేం కావల్ల? ఊరికంతా ఉండేది ఒక బోరు. అది మాత్రం ఎన్నాళ్ళని కాపాడబోతింది?– ఈ వాన యిట్లానే కురస్తావుంటే ఊరొదిలి బోవాల్సిందే!– ఊరి కుండేది రెండు పెద్ద తలకాయలు. అవ్వేంవో తలకాయిలు పగలగొట్టు కున్నట్టుగా మొకాలు సూసుకుండేదిలే!– ఇంక ఈ ఊరి మంచీసెడ్డా ఎవురు సూగల్ల?"

"ఏంది పెద్దప్పా, ఆ పిలకాయిలే అనుకుంటే నువ్వు గూడ ఆంజనేయ దండకం అందుకున్నావే?– ఎవురో యేంవో సేసేస్తావుంటే నేనే వద్దన్నిట్లుండే నువ్వనేది. పోనీ సెప్పండి. నన్నేం సెయ్యమంటారో సెప్పండి. కాదు గిదంటే కద మీరు వాపోవాల్ల!"

తనదేమీ తప్పులేనట్లుగా తగిలీతగలకుండా తప్పుకోవడానికి కన్నట్లుగా మాట్లాడినాడు ఓబులేసురెడ్డి.

"అదిగాదన్నా!– నువ్వుగూడ యిసేవుంటావు. మొన్న తిరపతి దేవస్తానం వాళ్ళు వానలు కురిపించాలని వరుణజపం చెయ్యించినారు కదా?– మనం బారతం జరిపించి ఎన్నేండ్లయింది నువ్వే సెప్పు?– బారతం జరిపిస్తావుంటే యిరాటపర్వం వచ్చేరుండికి వానలు కురస్తావుండె గదా?– అట్లాంటి దేంవాయె? పెద్దోళ్ళ పెద్దోళ్ళ కీసులాడుకుంట్రే. ఊరి దార్ని ఊరికొదిలేస్తిరి. ఇంక ఊళ్ళో మంచీసెడ్డా జరగాలంటే ఎట్లా జరిగతాయి?"

ఏటేట ఆ గ్రామంలో భారతోత్సవాలు జరుగుతాయి. భారతం మిట్టమీద కొటాయిలో ఓ పండితోత్తముడు దినానికి ఒక్క పర్వం వంతున పారాయణం చేస్తే ఆ పాయకట్టులో ప్రజలంతా ఆ కొటాయిలో కూర్చొని వింటారు పగటిపూట. ఆ పగటి కథను రాత్రిపూట దృశ్యంగా మారిస్తే ఆరుబయట హాయిగా కూర్చుని వీధినాటకాన్ని చూస్తారు. ఇప్పుడు నాలుగేండ్లుగా ఈ ఉత్సవాలు జరగపోవడానికి కారణం ఓబులేసురుడ్డిగారికి మోహన్నాయుడికి మధ్య జరిగిన మాటామంతీ కారణం. కొనాలరామిరెడ్డి ఆ కారణాన్ని కాస్త జాగ్రత్తగానే వివరించినాడు. రెడ్డిగారు అరమోడ్పు కన్నులతో ఆలోచిస్తూ కూర్చున్నారు. ఆయన నోట ఏ మాట వినవలసివస్తుందో?- అని గ్రామపెద్దలు ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.

రెండు బార్ల పొద్దెక్కింది. అప్పటికే ఎండ చురచురలాడ్తా ఉంది. బడికి వెళ్ళడానికని బయలుదేరుతున్న పిల్లలు సంచిలో పలకా పుస్తకాలు సర్దుకోవడం కంటే తట్టాబెంబు కోసం తపనపడుతున్నారు. సద్దిడుత్తలు నెత్తినబెట్టి ఆడవాళ్ళు పొలాలవద్దకు బయలుదేరుతున్నారు.

"ఇంతమంది యిన్ని మాట్లాడినారు కదా? నాదేమన్నా తప్పుంటే...."

పట్టెమంచంమీద చేతుల మోపున వెనక్కు వాలిన రెడ్డిగారు ఉన్నట్లుండి ముందుకులేచి, దిట్టంగా కూర్చుని నిలదీసి అడిగినట్లు అడిగినారు.

"తప్పులు తవ్వుకునే దానిక్కాదుగదా మేమంత ఈడకొచ్చింది?"

"అది సరేనయ్యా?- ఈ ఊళ్ళో వాడు కాపు, ఈడు కమ్మ, యింకొకడు బలిజ అని యేరుబందం మాట్లేదైనా యినిపిస్తావున్నా?- పాయివరసలు కలుపుకోని సరసమాడుకుంటావుండిన బతుకులు గదా?- మరిప్పు డిదంతా ఎందుకొచ్చె?"

"జరగాల్సింది యిడిసిపెట్టి జరిగినదాన్ని పట్టుకోనికూసుంటే అయ్యేపనేనా?"

"అదేనయ్యా నేను అనేది! ఆ పొద్దుగూడా మీరంతా యిట్లానే వస్తిరి. కొంపలు మునిగినట్టు మాట్లాడిరి. కోరట్టు కెక్కిస్తిరి. మల్లా యిప్పుడు నాదే తప్పయినట్లు మాట్లాడ్తావుండారు."

"అదిగిదన్నా మేమనేది?"

"ఇంకేదన్నా మీరనేది? ఊరి కెగుదాల గుంట. ఊరు పుట్నప్పటీనుండి ఉండా గుంట. ఆ గుంట్లోనే గొడ్డూగోడా నీళ్ళు తాగతావుండె. గుడ్డూగుసురు ఉతుక్కుంటా వుండ్రి. అట్టాంటిదాన్ని సదరంజేసి యిండ్లపట్టా లిప్పించాలని మోహన్నాయుడు కూసుండె. ఎందుకు?- వాడెబ్బకు వోట్లు పడ్తాయని!-"

"తప్పి తలకెత్తుకుంటే యింకేఁవన్నా రాబోతిందా?"

"తలకెత్తింది మీరేగదయ్యా!- ఊరి సాగుకోసరం ఆ బొళువు మొయ్యాల్సి వచ్చె. అందుకే కోర్టుకు పోతి. స్టే తెస్తి. దాంతో మొహన్నాయుడు ఈడెగిరి ఆడపడ్తే నేనేంజేసేది?"

"ఇప్పుడిదంతా లోట్లా కూసుంటే సినుకు నేలరాలబొయ్యేది లేదు? మా బోటోళ్ళింక బతికి బట్ట కట్టబొయ్యేదిలేదు"

"అయితే నన్నిప్పుడేం సెయ్యమంటారు?"

"భారతం జరిపించనుంటాం!"

"అది నా ఒక్కడితో అయ్యేపనేనా?"

"అని వేఁవన్నాదే?- అందరు కల్సి మాట్లాడ్తాం."

"మోహన్నాయుడు కలిస్తాడా?"

"ఎందుకు గాడు?- ఆ పూసీ మాది. ఊరిమంద అలిగి సెరువులో సెయ్యి కడక్కుండా పోతారా ఎవ్వరైనా?"

"అయితే నా కేఁవీ అభ్యంతరఁవే లేదు. ఊరంతా ఒక దోవయితే నాకు మాత్రం ఎందు కింకొక తోవ?"

"అట్టన్నారు బాగుందాపి. ఈ పొద్దు రేత్రికే యింటికొక మణిసిని రచ్చ బండకాడ సేరేస్తాం. అటో యిటో ఈ దినంతో తేలిపోవల్ల!"

"మీ మాట కాదనే దెందుకులేబ్బా- అట్టానే జరిగినీ. ఒక మంచి పన్జేసే దానికి రచ్చబండకాడి కొస్తే నా తలగుద్దేం పడిపోదులే!"

రెడ్డిగారు రచ్చబండ వద్దకు రావడానికి అంగీకరించడంతో భారతోత్స వాలు బ్రహ్మాండంగా జరిగినట్లుగా, విరాటపర్వం చదవడంతో యినుమిక్కులుగా వాన పడినంత తృప్తిగా రెడ్డిగారి వాకిట్లో చేరిన గ్రామపెద్దలు రెడ్డిగారి వద్ద సెలవు తీసుకున్నారు.

## 8

దశకంఠాపురం దశ మారింది.

వేసిన మోడం విడవకుండా అయిదారు రోజులపాటు కుండతో కుమ్మ రించినట్లుగా కుంభవృష్టి కురిసింది.

ఊరి కెగువల గుంట కట్ట తెగిపోయింది. ఊరు కుత్తరంగా చెరువు తటుంగులుగా నిండింది.

పొదుగులో పాలుంటే దుత్తలో పాలున్నట్లే!

చెరువు నిండేసరికి చెరువుకింద బావులన్నీ నిండినాయి.

వంకలూ వాగులూ ప్రాయంపు పడుచుల్లా వయ్యారాలు పోతున్నాయి.

చినుకు మొగం చూడకుండా వాచిని మొగాలు పూచినాయి!

ఓబులేసురెడ్డి మోహన్నాయుడు ఉత్తర దక్షిణధృవాలైతే ఆ ధృవాల్ని పట్టుబట్టి కలిపి భారతోత్సవాలు జరిపించిన మొనగాళ్ళు కొంతమంది విరాట పర్వం చదవడంతోనే వర్షాలు కురిసినాయనీ, దానికి కారకులు తామేననీ వీధుల్లో మీసంమీద వేసిన చేయి దించకుండా తిరుగుతున్నారు. వాళ్ళమీసంమీద చేతిని చూసి సహించలేని రోషగాళ్ళు "విరాట పర్వమూ కాదు, గాడిదగుడ్డు కాదు. బంగాళాఖాతంలో వాయుగుండం లేచిందంట్లే!— రేడియోలో సెప్పినార్లే!" అని చాటుతూ సమాధానపడుతున్నారు.

"బంగాళాఖాతంలో వాయుగుండం లేచిందీ నిజమే!— అయితే యిప్పుడే వాయుగుండం లెయ్యడానికి కారణం మాత్రం విరాటపర్వం!" అని ఓబులేసు రెడ్డి భజనరాయుళ్ళు వాటంగా తాళంవేస్తున్నారు.

"అయ్యా! మీరు నాలుగేండ్లుగా భారతోత్సవాలు జరిపించ గలిగినారా? అధమ పక్షం విరాటపర్వమైనా చదివించ కలిగినారా? లేదే! ఎందుకు?— గ్రహ స్థితి అట్లా వుండింది. గ్రహాలు మార్నాయి. మీ బుద్ధులూ మార్నాయి. బుద్ధులు మారినపుడు భారతోత్సవాలు జరగాల్సిందే!— విరాటపర్వం చదవాల్సిందే!— వాయుగుండాలు లెయ్యాల్సిందే!— గ్రహచాటమయ్యా. దాన్ని మార్చేదాని కెవరి తరం? అది అంతేనయ్యా అంతే!— శాస్త్రమా? మజాకా?"— అని నీలకంఠ శాస్త్రులు తన శాస్త్రానికి పట్టుబడుతున్నాడు.

ఏది ఏమయితేనేం?— నీలకంఠాపురం నళ మారింది.

వానలు కురిసినాయి.

మగత నిద్రమీద వున్న చేను కలగన్నట్లు మేలుకొని పరుగు లంఘించు కొన్నట్లు ఊపు పొందనలుగు చేతికందుకొనింది.

అరిగిపోయిన మడకల్ని మార్చాలని మడకతుండ్లు తేవడానికి రైతులు కొంతమంది పరవగుట్టమీద పడినారు.

రచ్చబండ దగ్గర మర్రిమానికింద కేశవాచారికి మడకమీద మడక బిగించాల్సి రావడంతో ఊపిరాడడం లేదు. ఊరిముందర గెవిన్లో సిద్దలింగాచారి కొలిమి దగ్గరే కాపురం పెట్నాడు. చెరువు మొరవ పారుతుండే కొత్తనీటి కెగ బడుతున్న చేపలకోసం 'కొడాలు' వేసి కొందరు కావలి కాస్తున్నారు. వీధుల్లో

లేగదూడలు చిందులేస్తున్నాయి. పొలాల్లో పారుతున్న కాలువల్లో నీటిపాములు వయ్యారాలుపోతూ పురుగుపుట్రను కబళిస్తున్నాయి. చెరువులో కప్పలు జాతర జరుపుకుంటున్నాయి.

ఆ ఊరే ఉత్సాహంతో ఉరకలువేస్తూ ఉంది.

వారం తిరగకముందే ఆ ఊరుచుట్టూ ఎటుచూచినా పచ్చచీరలు పరిచినట్లు కనుపండువగా ఉంది.

పచ్చిగడ్డికి వాసిపోయిన గొడ్లు కట్టుగూటాన కాలు నిలువకుండా గుంజులాడుతున్నాయి.

తడిసిన పల్లాపదకతో కొప్పులు పిండక ఆడవాళ్ళు అవస్థ పడుతున్నారు.

ఆ ఊళ్ళో మాధ్యమిక పాఠశాల మూడా కూడా అరంకాణాల పూరిల్లు. ఆ పూరింటి పైకప్పు ఎప్పుడు కప్పినారో? ఏమో— అంతంత మాత్రంగా మిగిలుంది. అయినా, రోజులు విరామం లేకుండా వర్షాలు కురవడంతో ఆ పాఠశాల్లో ఉరుపు మొదలయ్యింది. మొదటి రోజంతా ఉరిసేచోట్లల్లో ఒక కుండనో చట్టినో పెట్టి పిల్లోళ్ళు నీళ్ళుపట్టి బయటపోసినారు. వానలు ఉధృతమయ్యేసరికి చట్టీ కుండా చాలలేదు. ఇంటి ఆఫీసు [illegible] అయ్యింది. సాకు దొరకలేదే!' అని కాచుకొని వుండిన ఏకోపాధ్యాయుడు ఏకంగా వారం రోజులపాటు సెలవు ప్రకటించి ఎక్కడికి పక్కేసినాడో [illegible] చెక్కేసినాడు.

వానలు కురిస్తే ఓపినన్ని సమయాలు పిల్లోళ్ళు ఏదో ఒక పనికి చేతికెదగతార్లే— అని ఆ గ్రామీణులు సంతృప్తి పడినారే కానీ, 'అయ్యో! పిల్లల చదువు పాడయిందే!' అని బాధపడలేదు. అట్లాంటి వాడే వాళ్ళుంటే బారసాలోత్సవాలకు పెట్టిన ఖర్చులో ఎయినంటే ఒక భాగంతో ఆ బడి చందంగా తయారయ్యేది.

బడి లేకపోవడంతో పిల్లల ఆనందానికి పట్టపగ్గాలేవు. అయితే వెలుసుబాటున్న వాళ్ళసంగతేమో గానీ లేనివాళ్ళు మాత్రం తప్ప సరిగా ఆ పనికాలంలో తల్లిదండ్రులకు అంతో యింతో సాయపడుతున్నారు.

ఉత్తరవైపున పెద్దగుట్ట. దక్షిణంగా ఒక చిన్న బోడిగుట్ట. ఈ రెండింటిని కలగలిపినట్లు కట్ట వేసినారు. అదే ఆ చెరువు కట్ట. ఆ ఊళ్ళోనుండి గొడ్డూ గోదా అడవికి పోవాలంటే అదే బాట.

నాలుగేండ్లుగా నెర్రెలు నెర్రెలుగా చీలిన చెరువు గొడ్రాలు గర్భందాల్చినట్లుగా నిండింది. ఆనందంతో [illegible]గిరెగిరిపడ్తూ ఉంది.


బడి లేకపోవడంతో పిల్లోళ్ళు రోజు చెరువుకట్టమీద చేరుతున్నారు. ఓబులేసురెడ్డి ఏకైకపుత్రుడు ప్రతాపరెడ్డి, మోహన్నాయుడి అన్నకొడుకు మేఘనాథం నాయుడు ఇద్దరూ ఏడవతరగతిలో చదువుతున్నారు. ప్రతాపరెడ్డి గ్రూపు ప్రతాపరెడ్డి కుంది. మేఘనాథంనాయుడి వర్గం మేఘనాథనాయుడికి ఉంది. అయితే అది పైకి కనుపించని వర్గభేదం. అందరు కలిసిమెలిసి ఆడుకొంటున్నట్లున్నా అంతర్యంలో మాత్రం అది నివురుకప్పిన నిప్పులా రాజుకొంటూనే ఉంటుంది.

కొందరు కాగితాల పడవలుచేసి ఆ పడవలు నీళ్ళమీద నిలకడగా నిలబడ దానికి గులకరాళ్ళు వేసి కొత్తనీళ్ళమీద వదులుతున్నారు. అవి గాలివాటంగా నీళ్ళమీద తేలియాడుతూ పోతూంటే కేరింతలు కొడుతున్నారు. ఆ పడవలు పోతూ పోతూ కొన్ని మధ్యాంతరంలోనే మునిగిపోతున్నాయి. మరికొన్ని అలల్ని తప్పించుకొని ముందుకుపోతున్నాయి. ఎంత ముందుకుపోయినా ఎప్పుడో ఒకప్పుడు అవి మునిగిపోతాయి.. అవి కాగితం పడవలు. అయితే ఎవరి పడవ ఎంతదూరం పోతుందో వారు గెలిచినట్లు లెక్క. దానిమీద పందెంగట్టి పడవల ఆట ఆడుతున్నారు.

మరికొందరేమో పిల్ల పెంకుల్ని లేకుంటే పెంకుల్లా పలచగా వున్న రాళ్ళని చేతికందుకొని నీళ్ళమీద విసురుతున్నారు. అట్లా విసిరినపుడు నీటితలంమీద ఆ రాయి ఎన్నెన్నిసార్లు కప్పగంతులేసినట్లు ఎగురుతుందో లెక్క పెడుతున్నారు. ఎవరు విసిరిన రాయి ఎన్నిసార్లు ఎక్కువగా ఎగిరిపడ్తే వాళ్ళు గెలిచినట్లు లెక్క.

ఈ పందేలమీద పడిన పిల్లలకు పొద్దుపోవడమే తెలియడంలేదు. ప్రతి రోజు చెరువుకట్టమీద చేరుతున్నారు. పందేలు కాస్తున్నారు. ఆ చెరువుకట్టమీద ప్రతిరోజూ సందడే..

ఆ చెరువుకట్టమీదనే గొడ్లను మేపుకు తోలుకుపోతూ ఉంటాడు నాగులు. పోతూపోతూ యిదంతా ఒక కంట గమనిస్తూనే ఉన్నాడు. చెరువులో కొత్తనీటి అలల్లా వాడి లేత బుర్రలో ఆలోచనమీద ఆలోచన. గొడ్లను అడవి మీదికి తోలుతాడు. ఏ చెట్టుకిందనో కూర్చుంటాడు. ఆలోచనలతో వాడి బుర్ర మరుగుతుంది. ఆ వేడిలో ఏదో ఆలోచన తళుక్కుమని మెరుపులా మెరిసింది. అయితే దాని పర్యవసానం ఆలోచించే లోపలేసరికి గుండెలు దిగజార్నాయి. జారిపోతున్న గుండెల్ని పట్టుకోవడానికి కన్నట్లుగా అప్రయత్నంగానే చేయి ఎద మీదికి వెళ్ళింది. ఆ చేతికి జేబులో భద్రంగావున్న అగ్గిపెట్టె చేతికి తగిలింది. అగ్గిపెట్టె చేతికి తగిలేసరికి మోహన్నాయుడు కనులముందు మెదిలాడు.




నాను ఓబులేసురెడ్డిగారింట్లో పనికి కుదిరిననాటినుండి మోహన్నాయుడు కనుపిస్తూనే ఉన్నాడు. చిరునవ్వులతోనే భుజం తడుతున్నాడు. ఆ చిరునవ్వు మనసులో మెదిలేసరికి నాగులుగాడికి కొండంత బలం వచ్చింది. ఆ బలమే తన ఆలోచనకు తోడు!

ధీమాగా పైకి లేచినాడు నాగులు!

* * *

ఆ మరుసటినాడు –

నాలుగుబార్ల పొద్దెక్కింది. రేపటెండ అప్పటికే మాడ్చాగా కాస్తూ ఉంది. నాలుగు గొడ్లను మేపుకు తోలుకొని ఎలబారినాడు. గొడ్లు చెరువుకట్టమీద సోలుపుగా నడుస్తున్నాయి. కొండగాలులు కొత్తనీళ్ళమీద కోపులు కోపులుగా వీస్తున్నాయి. అలలమీద రేపటెండ సోకి మిలమిలలాడుతూ ఉంది. పిల్లోళ్ళు పందేల్లో పడి మునిగితేలుతున్నారు.

నాగులుగాడు ఒక్క క్షణం నిలబడినాడు. గుండె గుబగుబలాడింది. అప్రయత్నంగా చేయి గుండెమీదికి వెళ్ళింది. అగ్గిపెట్టె చేతికి తగిలింది. మోహన్నాయుడు కండ్లముందు మెదిలాడు. ఎవడి కెక్కడలేని ధైర్యం వచ్చింది.

"సిద్రెడ్డీ!....ఓ సిద్రెడ్డీ!"– నాగులుగాడు పిలిచినాడు.

"ఏంవిరా నాగులూ!"

నీటి ఉపరితలంమీద రాతిని విసరబోతున్న చిన్నరెడ్డి - విసరకుండానే ఆగి, పలికినాడు.

"ఇదేం పందెంవయ్యా!- అడపిలకాయ లాడుకునే పందెం!- అద్తే మొగోళ్ళాదే పందేలాడల్ల కానీ!"

"ఒరే! ఒరే!- యీడొక పెద్ద మొగోడొచ్చినాడు సూడండ్రే!"- అంటూ ప్రతాపరెడ్డి పకపక నవ్వుతున్నాడు. అతని వర్గం అతనికి తోడు కలిసింది.

నాగులు మూతి చిన్నది చేసుకొని ముందు కడుగు పెట్నాడు.

"ఒరే ఒరే! మొగోళ్ళ పందెవేదో సెప్పకుండానేపోతే ఎట్రా!"

ప్రతాపరెడ్డి ప్రశ్నించినాడు

"మీకంతా ఎగతాళిగావుంటే యింక నే నెందుకులేయ్యా సెప్పేది!"

"ఓరికే అంత కోప్మయితే ఎట్రాబ్బా!.... పరవాలేదులే సెప్పు."

"సెరువు నిండింది కదా!....అదికూడ లేకలేక నిండింది. ఈ పక్కనుండి ఆ పక్కకు యీత్తే అదీ మొగతనం."

"అదీ నిజంవే అనుకో!- అయితే కొత్తనీళ్ళు గదరా!"

"కొత్తనీళ్ళేవయినా కొరికేస్తాయా? పెరికేస్తాయా?"

"ఒరే నాగులూ! మాటలేంవిలే- కోటల్లాట్టాడినాసీ.... ఈత్తే గదా తెలిసేది.. నువ్వీదరా. నేను పందెంకడ్తా!" మేఘనాథంనాయుడు అడ్డం తగిల్నాడు.

"ఏం పందెంకడ్తావ్ నాయుడూ?"

"ఇద్దో!- ఈ సేతిలో ఉంగరం!"

"నాకేంవి యిది లెక్కాపత్కాలే!- యీదేస్తాననుకో. అయితే మా రెడ్డి నిక్కడపెట్టుకొని వాళ్ళ కూలోణ్ణి నే నా పన్జేస్తే జుదాయనకు సస్నతనం కదా!- పోనీ, సిన్నెడ్డి నువ్వు జెప్పు!"

"అయితే నాగులూ! నే నీదీస్తానంటూనావా!" ప్రతాపరెడ్డి సందేహంగానే అడిగినాడు.

"అదేంది సిన్నెడ్డి అట్లాంటావ్! కానబాయంటే ఏమన్నట్లలోతు బాయికదా!- ఆ బాయిలో కదుకగోలు పడిపోతే తేలా!- నాగలమిట్ట బాయిలో దోర్నంపట్టె మిందెక్కి- దూకలా!- ఇదొక లెక్కానా రెడ్డి నీకు!"

"నువ్వయినా సరే!....మీ సిన్నెడ్డయినా సరే!-నేను వెనక్కుపొయ్యేదిలే. ఇద్దో యిప్పుడే యిచ్చేస్తావుండా వుంగరం."

మేఘనాథంనాయుడు సవాల్ చేస్తూ ఉంగరం చేతికి తీసుకున్నాడు.

ప్రతాపరెడ్డిలో ప్రతాపం హెచ్చింది. తన చేతిలో ఉంగరం చిటుక్కున లాగినాడు. ఇద్దరూ ఉంగరాల్ని మూడో పెద్దమనిషిగా దామోదరం చేతికి యిచ్చినారు.

ప్రతాపరెడ్డి చొక్కా విప్పుతున్నాడు.

"గొడ్లు ఎవరి కయ్యల్లోనన్నా పడ్తే లేనిపోని పీకులాట. అన్ని అప్పుడే కట్టేసిగేస్తుంటాయి."

గొడ్లను అదిలిస్తూ నాగులు పరుగందుకొన్నాడు.

ప్రతాపరెడ్డి ఎగిరి చెరువులో దూకినాడు.

ప్రతాపరెడ్డివర్గం కరతాళధ్వనులు చేసింది. ఉత్సాహంగా ఈలలు వేసింది.

రెడ్డి ఈదుతున్నాడు. చేపపిల్లలా ముందుకు దూసుకపోతున్నాడు. ఇక్కడ మునిగి అక్కడ తేలుతున్నాడు. అతని హుషారు చూస్తూ కట్టమీద నిలబడు కొన్న అతని వర్గం మరీ హుషారుగా ఉంది. కరతాళధ్వనులు మిన్నుముట్టు తున్నాయి. ఈలలు మారుమోగుతున్నాయి. రెడ్డి ఈదినా యీదేస్తాడేమో అని నాయుడు వర్గం నీళ్ళు నములుతూ ఉంది.

అప్పటికే సగం దూరానికి పైగా ఈదేసినాడు ప్రతాప్‌రెడ్డి!

మేఘనాధం మొగం మేఘాచ్ఛాదితమయింది. అతని వర్గం ఒకరి మొగం ఒకరు చూచుకొంటున్నారు. ప్రతాపరెడ్డి వర్గం పరవశంతో ఎగిరెగిరి దూకుతూ ఉంది.

సగం దూరానికి పైగా ఈదేసరికి ప్రతాపరెడ్డి బాగా అలసిపోయినాడు. కాళ్ళు చేతులు చచ్చుబడినట్లున్నాయి. కాసేపు అట్లానే ఊపిరి బిగపట్టి వెల్లకిల పడుకొన్నాడు. కాళ్ళు చేతులు ఆడించకుండా ఉండగలిగినంతసేపు ఉన్నాడు. అలసట కాస్తంత తీరినట్లనిపించింది. మరింత శక్తిని కూడదీసుకొని ముందుకు పోతున్నాడు.

"అంతే!.... అంతే.... అట్లానే.... అట్లానే!!.... అయిపోయింది. ఇంకెంత?.... అట్లానే ఈదెయ్!.... ఈదు!!"

రెడ్డివర్గం కట్టమీద నిలబడి కరతాళధ్వనులు చేస్తూ ఎంతో ప్రోత్సాహాన్ని యిస్తూ ఉంది.

అయినా రెడ్డిపని అయిపోయింది. కాలూ చెయ్యీ ఆడడంలేదు. మునుగు తున్నాడు. తేలుతున్నాడు. ముందుకుపోలేక గింజులాడుకొంటున్నాడు. ఆ పరి స్థితిని గమనించి కొందరు పిల్లోళ్ళు భయంతో తిరిగిచూడకుండా పరుగందు

కొన్నారు. మేఘనాధంనాయుడికి కాళ్ళూ చేతులు ఆడడంలేదు. ఎటూ పాలు పోక గిలగిల్లాడుతున్నాడు. అందులో యిద్దరు పిల్లోళ్ళు మాత్రం కాలికొద్దీ పరుగెత్తినారు. రెడ్డోరింట్లో దూర్నారు. పట్టెమంచంమీద పవళించివున్న రెడ్డిగారి చెవుల్లో ఈ వార్త గసపోసుకుంటూ పడేసినారు.

"సిరికింజెప్పడు శంఖచక్ర యుగమున్ చేదోయి సంధింపడు...." అన్నట్లుగా ఓబులేసురెడ్డి పైగుడ్డ కూడా లేకుండా వీధినపడి 'కొడకా! అయ్యో నా కొడకా!' అని అరుస్తూ పరుగెత్తుతున్నాడు. సమయానికి తారసపడిన తాళగాళ్ళు మేళగాళ్ళు రెడ్డిగారివెంట పడినారు.

వాళ్ళు కట్టమీదికి చేరేసరికి ప్రతాపరెడ్డి పరిస్థితి విషమించింది. చేతులు కాళ్ళూ ఆడలేక ఆడుతూంటే మునుగుతూ తేలుతున్నాడు. ఊపిరాడక తపతప కొట్టుకొంటున్నాడు. గాలి ఉధృతంగా వీస్తూ ఉంది. చెరువు అల్లకల్లోలంగా ఉంది. అలలు ఉవ్వెత్తుగా పైకిలేచేసరికి బుడంకాయంత బుల్లోడు కనుపించకుండా పోతున్నాడు.

కట్టమీద నిలబడి చెరువువైపు తిరిగి చేతులు రెండూ సాచి 'కొడకా! అయ్యో నా కొడకా!' అని ఓబులేసురెడ్డి గొంతెత్తి విలపిస్తున్నాడు.

రెడ్డిగారివెంట వచ్చినవాళ్ళల్లో ఒక్కొరిద్దరు వెనుకాముందు చూడకుండా ఎగిరి చెరువులో దూకినారు.

విశ్వప్రయత్నం చేసి వాళ్ళు చెరువుకట్టమీద చేరవేయగలిగింది- చిన్నరెడ్డి శవాన్ని మాత్రమే!-

ఆ వార్త ఊళ్ళో ప్రాకి అప్పటికే ఊళ్ళో సగంమంది చెరువుకట్టమీద చేరినారు. ఆ దుర్ఘటనతో అందరి గుండెలు బ[illegible]లుతున్నాయి. రెడ్డిగారు గుండెలు పగిలేలా ఏడుస్తున్నాడు.

ఏదైనా మంచీ చెడ్డా జరిగితే పట్టించుకోకుండా ఉండడం పల్లె తత్త్వం కాదు. ఎవరో ఒకరు ముందుపడినారు. పిల్లోడి శవాన్నెత్తి భుజంమీద వేసుకొన్నాడు. ఊళ్ళోకి నడుస్తున్నాడు. కూడవెంట పడిన అనులా 'నన్నొదిలెట్లా పోతివి నా కొడకా!' అని ఏడుస్తూ రెడ్డిగారు చేతులమోపున నడుస్తున్నారు.

ఈ వార్త నిముషాలమీద చుట్టుపక్కల పల్లెలంతా ప్రాకింది.

రెడ్డిగారింటికి జనం [illegible]వంగట్టి వస్తున్నారు.

వస్తున్నారు. ముక్కుపచ్చలారని ఆ ముద్దుబిడ్డను చూస్తున్నారు. కన్నీరు కారుస్తున్నారు. ఆ తడవాత వాకిట్లో నిలబడి-

"ఒక్కగానొక్క నలుసే!– ఆ పాపిష్ఠి దేవుడి కెట్లా బుద్ధిపుట్టిందమ్మా? దయాదాక్షిణ్యం లేకుండా తీసకపోయినాడే!"– అని వాపోతున్నారు.

ఆ మాటలు చెవినపడేసరికి రెడ్డిగారి గుండెలు పగిలిపోతున్నాయి.

రెడ్డెమ్మ నోటమాటలేకుండా ఎప్పుడో సొమ్మసిల్లి పడిపోయింది. మొగాన చల్లనినీళ్ళు చల్లి, గొంతులో కాసిన్ని నీళ్ళుపోసి ఆమెను సేదదీర్చడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు.

"తమ్ముడూ! నన్నెట్లా వొదిలిపోతివిరా నాయనా!– ఇంక నన్నెట్లా బతకమంటావురా?" అని కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఉంది సుభద్ర, రెడ్డిగారి ముద్దుల కూతురు.

అంతలో ఎక్కడున్నాడో? ఏమో? మోహన్నాయుడు బాణంలా రివ్వన యింట్లో జొరబడినాడు. 'ఎంతపని జరిగిపొయ్యింది మాంవా!' అంటూ ఓబులేసు రెడ్డిని కౌగలించుకొన్నాడు. వెక్కి-వెక్కి యేడ్చినాడు. ఆ తరువాత తన్ను తానే సమాళించుకొన్నాడు. తనకు తానుగా కార్యభారాన్నెత్తిన వేసుకొన్నాడు.

"వాళ్ళేడస్తారంటే వాళ్ళతో మనం గూడా ఏడస్తా కూసుంటే యింక జరగాల్సిన పన్లెట్టా జరగతాయి!– పొద్దెంతుందని?– కానీయండి. ఊరి ముందర తోపులోకి పోయి ఒక వెదురు నరుక్కొని రండి. పలకలు రమ్మని సెప్పండి. నలుగురు పొయ్యి మిషన్ బాయికాడ గుంత తవ్వరండి."

నాయుడు నలుగుర్నీ నాలుగు పనులకు పురమాయిస్తున్నాడు.

"పిలగాడి కెందుకీ సాంగేలన్నీ?– పసుపుగుడ్డలు సుట్టి ఎత్తుకొని పోతే పోలా?– పాడె కట్నా ఒంటి పాడేగదా కట్టాల!"

"అయితే నువ్వనేది ఈడంత గెతిలేకుండా బతకతావుండారనా? అదంతా యేం కుదరదు. పిల్లోణ్ణి లక్షణంగా దానం చెయ్యాల్సిందే!– అదెంతయినా సరే!– ఏవయినా సరే!– ఇదుగిదంటే మాంవ యిష్టం. అయనెట్లా సెప్తే అట్లానే సెయ్యండి!– నువ్వేమంటావ్ మాంవా?"

ఓబులేసురెడ్డి వాడిసి మోహన్నాయుడు రెండుచేతుల్నీ పట్టుకొన్నాడు.

"నాయినా! మోహనా!– సచ్చిన పాంవ్వనెందుకింకా కొడ్తావ్? అంతా నీ యిష్టం. అంతా నీ సేతులమిందగానే జరిగిపోనీ."

పట్టిన చేతుల్నీ వదిలిపెట్టకుండా 'బోరో!' మని ఏడుస్తున్నాడు ఓబులేసు రెడ్డి. వంచిన తలెత్తకుండానే మోహన్నాయుడు వలవల కన్నీళ్ళు కార్చినాడు.

ఆ దృశ్యాన్ని చూచి కొందరు విస్తుపోతూంటే మరికొందరు వలవల యేడుస్తున్నారు.

ఇంటిముందర కొందరు పాడెకట్టడానికి సన్నాహాలు చేస్తున్నారు. అప్పటికే పలకలు వాయించినారు. దాదాపు ఆ ఊళ్ళోని జనం చుట్టుపక్కల పల్లెల్లోని జనం అంతా కలిసి రెడ్డిగారి యింటిముందరే ఉన్నారు.

ఇదంతా గమనిస్తున్నట్లు సూర్యభగవానుడు పడమటి కొండలమీద నిలబడినాడు. అతని మొగం బాగా కందిఉంది.

గొడ్లను యింటికి తోలుకొని వచ్చిన నాగులు యింటిముందర వాతావరణాన్ని చూచి నిలువునా నీరుగారిపోయినాడు. వాడి కాళ్ళు వణుకుతున్నాయి. సాయంకాలం పూట చల్లని గాలులు వీస్తున్నా వాడికి చిరుచెమటలు పోస్తున్నాయి. అడుగు ముందుకు పడకుండా అట్లానే నిలబడిపోయినాడు.

పలకల చప్పుడుతో గొడ్లు బెదిరి అటుయిటు పరుగెత్తి యింటిముందర చేరిన వీళ్ళవాళ్ళ అదిలింపులతో ఎటూ పోలేకుండా అలవాటుగా మళ్ళీ కొట్టంలోనే దూరాయి.

నాగులు ఒక్క లగువులో వాకిట్లోకి జొరబడినాడు. రెడ్డిగారి కాళ్ళమీద పడి ఆ కాళ్ళను కన్నీటితో తడుపుతున్నాడు. రెడ్డిగారి గుండె ద్రవించింది. ఆయన కూడా గుండె లవిసేలా ఏడుస్తున్నాడు.

"ఒరే నాగులూ!— లెయ్‌రా లెయ్. ఏడుస్తావుంటే పోయినోళ్ళు రాబోయ్యేది లేదుకానీ, ఆ గొడ్లెట్లా బెదిరిపొస్తావుండాయో సూడు. వాట్నట్లా గాటుకట్టు."


మోహనాన్నాయుడి మందలింపు వినబడింది. నాగులు రెడ్డిగారి కాళ్ళను వదిలిపెట్టి మోహనాన్నాయుడి కాళ్ళకు చుట్టుకొనిపోయినాడు.

"ఒరే నాగులూ! నీ బాధ నాకు తెలుసు!— అయినా మనమేం చెయ్యగలగతాం చెప్పు. ఎదెట్టెట్ట జరగాల్నో అట్లానే జరుగుతుంది. లెయ్‌రా లెయ్."

నాగులు మెల్లగా పైకిలేచినాడు. కొట్టంలో గొడ్లు కొన్ని బెదురుచూపులు చూస్తున్నాయి. కొన్ని ప్రురుపాడుతున్నాయి. కొన్ని సందుదొరికితే పరిగెత్తడానికి ఆయత్తమవుతున్నాయి. నాగులు అన్నింటినీ గాటకట్టుతున్నాడు.

ఇంటిముందర శవాన్ని పాడెమీద పెడుతున్నారు.

రెడ్డెమ్మ గుండెలు బాదుకొంటూ ఏడుస్తూ ఉంది. సుభద్ర కంటికి కడవడుగా ఏడుస్తూ ఉంది. రెడ్డిగారి నడుములు ఎప్పుడో విరిగిపోతే ఆయన చేతుల మోపున నిలబడి ఉన్నాడు.



నాగులు కండ్లు నిండుకొన్నాయి.

"తప్పు చేసిందొకడు, అనుభవించే దింకొకడు. ఇదేవైనా బాగుందా! ఈ నాయం యాడైనా ఉందా? ఏటు కాడ సుబ్రెడ్డి నాకోకల్పి చదువుతుండె. నాతో అడుతుండె. అట్లాంటి సూరిబాబును కొట్టని పెట్టించినోడ నే నెంత పాపాత్ముణ్ణి!" అని ఆలోచిస్తూ దృష్టిని పాడెమీదికి మరల్చినాడు.

ఆ పాడెమీద చిన్నరెడ్డి శవానికి బదులు తన తండ్రిశవం! ఆ శవంమీద తనతల్లి కాకిశోకం.

వాడిగుండె రాయిగా మారింది. అప్రయత్నంగానే చేయి గుండెమీదికి వెళ్ళింది. జేబులో అగ్గిపెట్టె తెరిచి వెలిగించి అటు ఇటు చూచినాడు. ఎవ్వరూ తన్ను పట్టించుకొన్నట్లు లేదు. ఇంకేం! పరుగందుకొన్నాడు.

శవం బయలుదేరింది.

రెడ్డెమ్మ, సుభద్ర గుండెలుబాదుకొంటూ శవానికి అడ్డం పడుతున్నారు. అడుగుముందుకు సాగనీకుండా గోలపెడుతున్నారు. వాళ్ళను సముదాయించడానికి ఎవరితరం కాలేదు. 'నా బిడ్డకంటే ముందు మమ్మల్ని గుంటలో పెట్టండో!' అని మొత్తుకొంటున్నారు.

మోహనన్నాయుడు తప్పకుండా జోక్యం కలిగించుకోవలసి వచ్చింది. ఎట్టెట్నో సతపోరి, బ్రతిమలాడి రెడ్డెమ్మను పక్కకు తొలగిస్తూంటే సుభద్ర కాళ్ళకు చుట్టుకొనిపోయింది.

నాయుడు ఒక్క-క్షణం చలించినాడు! వెంటనే నిగ్రహించుకొన్నాడు. ఆమె రెండుభుజాల్ని పట్టి పైకిలేపినాడు. ఆమె మొహంలోనికి సూటిగా చూచి నాడు. ఆ చూపులనిండుకు ఓదార్పు, అనురాగం, ఆత్మీయత చదువగలిగింది సుభద్ర. మారుమాట్లాడకుండా పైదొలగింది.

శవం ముందుకు సాగింది!

నాగులు గుడిసెముందు నిలబడుకొన్నాడు. వాడి మొగం బోనులోనుండి వెలువడిన పులిలా జేవురించింది. జేబులో చెయ్యిపెట్టాడు. అగ్గిపెట్టె చేతికందు కొన్నాడు. ఒక్క పుల్లనుగీచి వెలిగించినాడు. ఆ పుల్ల వెలుగుతూంటే తదేకంగా చూస్తూ నిలబడినాడు. అసురసంధ్యవేళలో ఆ అగ్గిపుల్ల వెలుగులో వాడిముఖంలో కోటివెలుగులు!

నాగులు గుడిసెలో అడుగుపెట్నాడు. తల్లి ఎదురైతే వంగి ఆమెపాదాలకు నమస్కరించినాడు. ఆమె రెండుచేతులతో వాడిని పైకిలేపి గుండెలకు హత్తు కొనింది. ఆపై ముద్దులతో ముంచెత్తింది.

పొద్దు గూట్లోపడింది.

## 9

"సెప్పే!– నీకు దణ్ణంపెడ్తాను సెప్పే!"

కొడుకును మట్టిపాల్జేసిన్నాడు మంచానపడిన రెడ్డెమ్మ, ఆ మంచంమీద పడుకొనే ప్రాధేయపూర్వకంగా అడుగుతూ ఉంది.

సుభద్ర వంచిన తలెత్తలేదు.

"ఎన్నెన్నే అడగతావుందేది! మూడు దినాల్నుండి అడగతావుంటే అరీగురీ మనకుండా వుండావే? సెప్పే!– ఉండే కడుపున్నంట సాలకుండా యింకా నా కడుప్పుంత ఎందుకు పెట్టుకుంటావే?– సెప్పే!"

ఏడాదికిందట వేసిన పడక ఎత్తలేదు రెడ్డమ్మ. ఒక్కగానొక్క కొడుకు పోవడంతో ఒకపూటతింటే యింకొకపూట తినకుండా చిక్కి శల్యమైపోయింది. అడిగినదానికి సమాధానం చెప్పలేదని కూతురిమీద కోపం. కోపంతో ఆయాసం. ఆయాసంతో కలిసి దగ్గు. మాట్లాడలేకపోతూంది, అయినా తప్పదు.

సుభద్ర కండ్లలో పలపల కన్నీళ్ళు!

"అడిగినదానికి బదులేదవమంటే ఏడస్తావెందుకే?– సెప్పే!– అసలేం జరిగిందో సెప్పే!"

సుభద్ర పెదవి విప్పలేదు.

"అయినొచ్చే యాళయిందే! ఆయిన సెవులోకానీ పడిందంటే యిద్దర్నీ నరికి పొలిసల్లేస్తారే?— నా తల్లి గదూ!— నా కడుపులో పెట్టుకొని కాపాడు కుంటానే!— సెప్పే!"

"మన యింటావంటా కూడా లేదుగదే!— యిదే నిజమయితే యింక ఊళ్ళో తలెత్తుకోని తిరగ్గలగతా[ఁ]నా? ... సెప్పే!— నన్నెందు కేపుకతింటావ్!"

సుభద్ర ఎంతగానో ప్రయత్నిస్తోంది. అయితే ఎట్లాచెప్పాలో తెలియడంలేదు.

"బంగారట్టా బిడ్డను సెరుపుకొన్నాక యింకా బతికుంటే ముదనష్టపుదాన్ని. నా మొకంచూస్తే నువ్వు సెప్పాలనుకొన్నా సెప్పలేవులేయే!— వద్దులే. నువ్వు సెప్పద్దులే!— ఈ పొద్దో రేపో నా బిడ్డను ఎతుక్కుంటా నేనే పోబోతావుండా. ఇంక నాకెందుకులేయే!— సెప్పద్దు. నువ్వు సెప్పద్దులే!"

సుభద్ర గుండెల్లో గునపాలు గుచ్చినట్లు తగులుతున్నాయి మాటలు. అయితే రాతిమీదపడిన గునపం ఫలితాన్ని సాధించలేనట్లే. ఆ మాటలు కూడా గాలికి పోతున్నాయి రెడ్డెమ్మలో సహనం నశించింది.

"నిన్ను గని ఫువ్వుల్లోపెట్టి సాకి సంతరించిందానికి తగినశాస్తేలేయే!— నువ్వు నిజం చెప్పబొయ్యేదిలేదు. నేనీ మంచంమీదనుండి లేచి తిరగబొయ్యేది లేదు. ఎప్పుడో ఒకప్పుడు పోబొయ్యే జలమ్మేగదా? యిప్పుడు నీ కండ్లముందరే పోతే పీడా యిరగడై పోతుంది." అంటూ చేతికి దొరికినదానితో శక్తికొద్దీ కొట్టు కోవడానికి ఆరంభించింది.

"అమ్మా!" అని అరుస్తూ సుభద్ర తల్లిచేతుల్ని పొదివి పట్టుకొనింది.

తల్లి అవస్థను చూచి బిడ్డ తల్లడిల్లిపోతూ ఉంది.

బిడ్డ నిస్సహాయతను చూచి తల్లి కుమిలికుమిలి ఏడుస్తూ ఉంది.

వ్యక్తంచేసుకోలేని వ్యక్తిగత బలహీనతలు'— అవ్యక్తంగా యిద్దర్నీ నలిపేస్తున్నాయి.

అంతలో వాకిట్లో అలికిడి. ఓబులేసురెడ్డి కిర్రుచెప్పుల సవ్వడి. ఆ సవ్వడి చెవినపడేసరికి సుభద్రనోట్లో గుడ్డకుక్కుకొని యింటివెనక్కు పరుగెత్తింది. అంతవరకు మతికిరాని దేవుడు అప్పుడు మనస్సులో పడేసరికి రెడ్డెమ్మ —స్వామిణ్ణి కృష్ణణ్ణి ఆపైన ఏడుకొండలవాడిని మూలుగుతో కలగలిపి స్మరిస్తూ ఉంది.

ఓబులేసురెడ్డి కిర్రుచెప్పుల్ని వాకిట్లో పట్టెమంచంముందు వదిల్నాడు.

నేరుగా యింట్లోకి నడిచి భార్య మంచంముందు నిలబడినాడు. రెడ్డెమ్మ గమనించే స్థితిలో లేదు. ఆమె ఏడుకొండలవాడిని మరింత గట్టిగా వేడుకుంటూ వుంది— తన్ను తొందరగా తీసుకునిపొమ్మని!

"రెడ్డీ!"

రెడ్డెమ్మను రెడ్డిగారు కోపంమీద ఉంటే 'ఒసే!' అని అరస్తాడు. కోపు మీద ఉంటే 'ఏంసే?' అని ఎకసెక్కాలాడ్తాడు. ప్రాపు కావాలనుకొన్నపుడు మాత్రం 'రెడ్డీ!' అని ముద్దుగా పిలుస్తాడు.

"రెడ్డీ! నాకు దయిర్నం సెప్పాల్సినదానివి నువ్వే యిట్లా డీలాపడిపోతే ఎట్లానే?— ఇంతగాదు యింకింత యేడ్చినా పోయినోళ్ళు రాబొయ్యేది లేదు గదా?— ఈ మంచానికి నువ్విట్లా కర్సుకొని ఏనాడో ఒకనాడు గుటుక్కుమంటే మల్లా నా గతేంకావల్ల? ఎదిగిన బిడ్డ యింట్లో ఉండాది కదా?— దాన్నెవ్వడి సేతిలోనైనా పెట్టల్నా? వద్దేనా?"

ఎదిగిన బిడ్డ మాట సెవుల్లో పడేసరికి ఆమె ఎద అట్టుడికినట్లు ఉడికి పోయింది. తమాయించుకోలేక 'బోరో!' మంది.

నోట్లో గుడ్డకుక్కుకొని పడగెత్తిన సుభద్ర యింటివెనక గోడచాట్లో నొప్పుకి 'వాక్ వాక్' మని వాంతిచేసుకుంటూ ఉంది. గొడ్లను మేపుకు తోలుకపో తూండిన నాగులునాడు ఒక్కక్షణం నిలబడినాడు. వాంతి చేసుకుంటూన్న సుభద్ర వైపు ఓరగంట చూసినాడు. తృప్తిగా తల పంకించినాడు. గొడ్లవెంట పడినాడు.

"ఇదో యిట్లా? యింక నన్నెట్లా సావమంటావే?— మాటమాటకు నువ్వు ఏడస్తా వుంటే నాకు మతిపోతా ఉండాది. నీయబ్బ తోడు. సెప్పేమాట సెవల్లో యేసుకోకుండా నువ్వే మంచానపడి అల్లాడు. నే నామంచాన పడి పొల్లాడ్తా. సరి పోతింది. ఇద్దరికీ కల్సి ఒక్కసారిగా కట్టేస్తారు పాడె!"

నిట్టూరాలు పోతూ ఓటిలేచి రెడ్డి నిలచినాడు. నిలబడినట్లుగానే తిరిగి వాకిట్లోకి వచ్చినాడు. పట్టెమంచంమీద కూలబడినాడు.

ఆ రోజే కాదు— రోజూ యింతే!

ఆ యింట్లో ముగ్గురి మధ్య సుభావం ముచ్చటలాడుతూ వుంది. శోక దేవత నట్టింట పీట వేసింది.

రోజులు భారంగా నడుస్తున్నాయి!

ఆ రోజు జామురాత్రి గావస్తా వుంది. రెడ్డెమ్మ అంతవరకు మూలిగి మూలిగీ అప్పుడే ఇట్లా కన్నుమూసినట్లుంది. రెడ్డిగారు పట్టెమంచంమీద

సన్నగా గురక పెడుతున్నారు. ఆయన ముభావంగా ఉండడం మూలాన ఈ మధ్య మేళగాళ్ళ తాళగాళ్ళ రాకపోకలు కూడా బాగా తగ్గినాయి. వాకిట్లో వెండి వెలుగుల ట్యూబ్‌లైట్ వెలవెలపోతూ ఉంది.

సుభద్ర మెల్లగా పైకి లేచింది. అంగుమీద అడుగేసుకుంటూ మెల్లగా యింటివెనక్కు వెళ్ళింది. ఇంతవరకు యింటివెనక కొట్టాల్లో రాత్రిపూట కాపుసారా భట్టీలు జరుగుతుండేవి ఇప్పుడు రెడ్డిగారి పరధ్యానంతో సారాయి వ్యాపారం బాగా పడిపోయింది. ఇప్పుడా కొట్టాల్లో మనిషిమాత్రా మసలడం లేదు. సుభద్ర ధైర్యంగా ఆ కొట్టాల్ని దాటింది. ఆ కొట్టాల కవతలే తమ యింటి కాంపౌండు గోడ. ఆ గోడ కానుకునే పెద్ద వేపచెట్టు. ఆ చెట్టుకింద చేరింది.

ఆమె ఎదురుచూస్తూ నిలబడింది!

ఆకు అల్లాడితే చాలు!— అతడేమో అన్నట్లుగా ఆ చీకట్లో కన్నులు విచ్చి చూస్తూ ఉంది. నేలమీద చెత్తచెదారం కదిలితే చాలు— ఆ చెత్తచెదారంమీద అతడు నడిచివస్తున్నట్లు భ్రమిస్తూ ఉంది.

గంట గడిచింది. రెండు గంటలు గడిచినాయి. అతడు రాలేదు. ఆమె ఓపిక నశించింది. రాలేదని బాధ. బాధలో కోపం కోపం, కసి. అన్నీ కలగలసినా ఏమీ చేయలేని నిస్సహాయత. నిస్సహాయతలో కన్నీళ్ళు!

అయినా మోహన్నాయుడు రాలేదు!

ఆమె మెల్లగా పైకి లేచింది. పైట చెరగుతో మొగం తుడుచుకొంది. చెంపలమీద జాలువారిన కన్నీళ్ళు పైటచెరుగును చేరుకున్నాయి. మెల్లగా బయలుదేరింది. కొట్టాలను దాటి యింట్లో అడుగుపెట్టింది. తల్లి మంచి నిద్రలో ఉంది. అక్కడినుండి వాకిట్లోకి నడిచింది. తండ్రి బాగా గురకపెడుతున్నాడు. వాకిలి దాటి పశువుల కొట్టాన్ని చేరింది. ఆ కొట్టంలో నాగులు కుక్కపిల్లలా ముడుక్కొని పడుకొని ఉన్నాడు. గొంతు బాగా తగ్గించింది. 'నాగులూ! నాగులూ!!' అని పిలిచింది. ఆ పిలుపుతో వాడు ఎగిరిపడి లేచినాడు. అది వాడికి అలవాటే!—

ఆమె ముందు నడుస్తూ ఉంది.

వాడు వెనక నడుస్తున్నాడు.

కన్నుపొడుచుకున్నా కనుపించని చీకటి. యింటిమీద చుక్కలు మాత్రం మినుక్కు మినుక్కు మంటున్నాయి. ప్రకృతి ప్రశాంతంగా నిద్రపోతూ ఉంది.

ఆమె వాకిలి దాటింది. ఇంటిపక్కన సందుదారిగుండా యింటి వెనక్కు

చేరింది. కొట్టాల్ని దాటింది. మళ్ళీ వేపచెట్టుకింద చేరింది. నా గు లు నీ డ లా వెన్నంటి ఉన్నాడు. ఆ చెట్టుకింద నిలబడి ఆమె దిక్కులు పరిశీలించి చూచింది. మెల్లగా తెసరాయించుకొనింది.

"నాగులూ!"

"సెప్పండమ్మా!"

"సరిపోతుందంట్రా యిది?"

"సన్నేం జెయ్యమంటారమ్మా?"

"అదేంటిరా అట్లంటావే?— చెయ్యాల్సిదంతా చేసేసి ఏఁవీ ఎరగనట్టు 'సన్నేం జెయ్యమంటావమ్మా?' అని అంటావే?"

"ఇదింకా బాగుందాదే!— మీ మణుసు లెప్పుడో కల్సిపోతే మ ణ స ల్ని మాత్రం నేను కలేసినా?— అదిగూడా మీ రిద్దరూ అంగలారిస్తేనే కదమ్మా?"

"నాగులూ!"— స్వరంమంద్రస్థాయిలో వినిపించినా కోపం వొంకర్లు తిరుగుతూ ఉందా పిలుపులో.

"నేనేమన్న యిర్సకపడ్తే నేనేం చేసేదమ్మా?— ఆయన్జెప్పిన మాట్లన్నీ దెచ్చి మీతో సెప్తి. మీర్జెప్పిన మాట్లన్నీ ఆయన్తో అంటి. అంతేగదమ్మా నేన్జేసింది."

సుభద్ర గుండె కుతకుత ఉడికిపోతూ ఉంది. ఆ తొలిరోజుల్లో వాడు కవ్వించిన మాట తీరుకు, యిప్పటి మాటతీరుకు పొంతనాలే కుదరటంలేదు. వాడి ఫిరాయింపు మాటలకు 'ఫటా'మని రెండంటించాలనుకొనింది. కానీ దానివల్ల ప్రయోజనం లేకపోగా పరిస్థితి తారుమారయ్యే ప్రమాదముంది. ఇంత అలాగ్గా తప్పించుకోగలిగినవాడు తప్పు తన నెత్తిన్నే రుద్దినా రుద్దుతాడు. అప్పుడు గతేం కావాలి?

అందుకే సుభద్ర జాగ్రత్తపడింది!

"అదిగాదు నాగులూ!— ఈ సంగతి ఆయనకు చెప్పి ఎన్నాళ్ళయిందిరా? ఆ పొద్దుట్నుంచీ మణిసి కనిపించినాడా?"

"ఆయన ఊళ్ళో లేడుగదమ్మా!"

"ఊళ్ళో ఉండకూడదనుకొన్న మనిషి ఎట్టుంటాడులేరా!"

"అట్లనదమ్మా! ఆయన శానా మంచోడు."

"మంచోడు కాబట్టే నా కొంప యిట్లా ముంచినాడు."

"దినఁవూ ఆయనకోసరం పొయ్యొస్తానే ఉండాను గదమ్మా?— ఆయ నింకా రాలేదంట. వస్తే ఊరికే వదిలిపెట్తానా? రానీయండమ్మా రానీయండి!"



"రావాలనుకోనుండే ఎప్పుడో వచ్చేవాడు నాగులూ! రాకూడదనుకొన్నాడు కాబట్టే మొకం తప్పించి తిరగతావుండాడు. ఇంట్లోనా– దినగండం నూరేండ్లాయుస్సుగా ఉంది. రోజూ అమ్మ రాచి రంపాన పెడతా ఉంది. ఎటూ చెప్పలేక నడిమంత్రాన నేను నలిగిచస్తావుండా! సరే! నువ్వెళ్ళు నాగులూ!"

"నేను పోయినాక నువ్వేదైనా అగాయిత్యానికి పాలుపత్తే!"

"పాపిష్టిజన్మాలంత తొందరగా పోవులేరా?"

"ఏంవో నాకు నమ్మకం కుదర్లేదమ్మా!– నామిందొట్టేసి సెప్పండమ్మా!–"

కాసేపు పిచ్చిగా నవ్వింది సుభద్ర.

"ఎందుకమ్మా అట్లా నవ్వుతుండారే?"

"నామీద నీకుండే అభిమానాన్ని చూసి."

"అమ్మా!"

"అవున్రా నాగులూ! ఈ లోకంలో నన్ను తప్పించి నా కెవరుండార్రా? తల్లి ఉంది. తండ్రి ఉన్నారు. బంధువు లున్నారు. ఇంతమంది వున్నా ఎవరితో నైనా ఈ మాత్రం చెప్పుకోగలుగుతున్నానా?"

సుభద్ర కంఠం గద్గదమైపోయింది.

"అమ్మా! బాదపడద్దండమ్మా. నువ్వు బాదపడ్తావుంటే నేను సూశ్నే నమ్మా! రొండు దినాలమ్మా. రొండే దినాలు. నాకు గడువియ్యండి. నాయుణ్ణి దెచ్చి మీ పాదాలకాడ పడేస్తా."

వాడి గుండెల అట్టడుగు పొరల్లో ఎక్కడో నక్కివుండిన మానవత మేలుకొన్నట్లనిపించింది.

"సరేలే నాగులూ! నువ్వు పోయి పడుకో పో."

"నువ్వు గూడా పదమ్మా!"

"నే నొస్తాన్లే పద నాగులూ! కొంపలో చెయ్యేసి దేవినట్లుంది. పడుకొన్నా నిద్రపట్టదు. చల్లగా ఉంది గదా యిక్కడే కాసేపు కూర్చుంటా."

అయిష్టంగానే ముందుకు నడిచాడు నాగులు.

సుభద్ర చెట్టుబోదెకు చేరగిలబడి కూర్చుంది.

అక్కడ కూర్చుని ఆ చెట్టువైపు చూస్తుంటే మనసు ఎట్టెట్టో పోతూ ఉంది. ఆ చెట్టుకిందనే కదా తను నాయుడుబావను కలుసుకొనింది!– ఆ చెట్టు కిందనే కదా బావచేతిలో చెయ్యిబెట్టి ప్రమాణం చేసింది. అప్పుడే కదా ఆ చెట్టు.... ఆకాశం... ఆకాశంలో నక్షత్రాలు .. భూమి.... దిక్కులూ– అన్నీ ఏకమై ఆశీర్వదించింది. ఆ చెట్టుకిందనే కదా తొలిసారిగా తన జీవిత కుసుమాన్ని బావచేతుల కందించింది!– ఓహో! అనాటి ఆ అనుభూతి!– ఆ ఆనందం! అట్లానే శాశ్వతంగా నిలిచిపోతాయనుకుంటే ఏమయింది?–

కడుపొచ్చింది!–

కడుపు రావడమంటే– ఆడదానికి కడుపు పండడం. ఏ ఆడదానికైనా కడుపు పండడమంటే అదొక వరం. అందులో అది తొలి చూలయితే ఆ

ఆనందమే వేరు. ఆ తృప్తి వేరు. ఆ సంబరాలు వేరు. ఆ సమయంలో యే అదద్దైనా ప్రపంచాన్నే జయించినట్లు తలపోస్తుంది. పదిమందిలో సగర్వంగా తలెత్తుకొని తిరుగుతుంది. అయితే తన గతి యేమయింది?– తన యింట్లో తన తల్లిముందరే తలవంచుకొని నిలబడవలసి వచ్చింది. ఆడదానికి యింతకన్నా మించిన నరకం లేదు.

అయితే ఈ నరకాన్ని అనుభవిస్తూ ఎందుకు బతకాలి? బతక్కూడదనుకొంటే చావాలి!– చస్తే మాత్రం సాధించేదేముంది? సాధించేదేమి ఉండదు కాబట్టే బతకాలి!– బతికితే తెల్లవారుతుంది. తెల్లార్తే పొద్దుమొగం చూడాల. పొద్దుమొగం చూచినట్లే తప్పనిసరిగా అమ్మమొగం కూడ చూడాల. చూస్తే?– అమ్మ నిలదీసి అడుగుతుంది. అడిగితే యేమని చెప్పాలి?

చెప్పాడానికేముంది? చెప్పవచ్చు ఏదో యేదైనా సరే!– ఎవరు ఏమనుకొన్నా సరే!– అమ్మతోనే కద. ఆ దేవుడే దిగివచ్చి అడిగినా 'నేను మోహన్నాయుణ్ణి ప్రేమిస్తున్నాను. పెండ్లిచేసుకొంటాను. ఆశీర్వదించు'. అయితే చేతిలో చెయ్యి బెట్టి ప్రమాణంచేసిన పెద్దమనిషి పదిరోజులుగా మొగం తప్పించుకొని తిరుగుతూంటే తానేమని చెప్పగలదు?

అమ్మ! నవమాసాలు కడుపులో పెట్టుకొని పెంచిన అమ్మ! ఈ తప్పును మాత్రం కడుపులో పెట్టుకోదా. తప్పకుండా పెట్టుకొంటుంది. లేవంటే కడుపు రగిలి చెడామడా నాలుగు తిడుతుంది. ఓపిక ఉంటే లేచి కొడుతుంది. కడుపు చించుకొంటే కాళ్ళదగ్గిరే పడుతుందని ఆమె భయం ఆమెది. అందుకే మంగలరంగిని వెంటనే పిలిపిస్తుంది. కడుపులు తీయడంలో ఆమె సిద్ధహస్తురాలట! అమ్మో! మంగలరంగి!– ఏదేదో పుల్ల పెడుతుందట! దానికి లొంగకపోతే నాటుమందులు తినిపిస్తుందట. దాని చేతిలోపడి బతికినవాళ్ళకంటే చచ్చినవాళ్ళే ఎక్కువ. అదొక బతికనేర్చిన ముండ. మనిషి బతికితే తన ప్రభావముంటుంది. చస్తే తిరిపాయనోళ్ళకు ఎవరేం చేస్తారంటుంది. ఒకవేళ దాని చేతిలోపడి చస్తే లోకం కోడైకూయదూ? అమ్మో! చచ్చికూడా ఆ అవమానాన్ని అమ్మా నాయన కంట గట్టేదానికంటె ఏ నుయ్యోగొయ్యో చూసుకొంటే సరిపోతుంది. ఎవరికెలాంటి సందేహమూ రాదు!–

ఆ నడిరేయి వేపచెట్టుకింద కూర్చుని రకరకాలుగా ఆలోచించింది సుభద్ర. ఎన్ని విధాలుగా ఆలోచించినా ఒక్కటే మార్గం సమ్మతంగా తోస్తూఉంది. ఏది

యేమైనా ఆ మార్గాన వెళ్ళడమే మంచిదనుకొనింది. సుభద్ర మనసు భద్ర మయింది.

*   *   *

దళవాయి తాపురంలో తెల్లవారింది!

ఓబులేసురెడ్డిగారు కాఫీ సేవించడానికి మంచంమీద రెడీగా కూర్చున్నారు. నాగులు కొట్టంలో పేడకళ్ళెత్తి పిప్పబోస్తున్నాడు. రెడ్డెమ్మ బొంతమీదపడి సన్నగా మూలుగుతూ ఉంది.

వేళకు సరిగ్గా గుండచెంబు కాఫీ గొంతులో పడకపోతే రెడ్డిగారికి నిజంగా పిచ్చెక్కుతుంది "ఏమే! నా మొకాన యాళకింత కాఫీకూడా కొట్టేరా!" అని అరుస్తున్నాడు ఆ మాట చెవుల్లో పడేసరికి రెడ్డెమ్మ 'ఏమే సుభద్రా! యాడ బోతివే?... నా కర్మిట్ట కాలిందనుకో!– ఆయనకు యాళకింత కాఫీ యివ్వ రాదంటే!" అని మంచంపైనుండే సందేశాన్ని వంటింటివైపు వదిలింది.

"అమ్మాయి కనిపించలేదుగదమ్మా!"

చేతిలో పాలచెంబు పెట్టుకొని పెద్దపాలేరు గోవిందు అంటున్నాడు.

"కనిపించకుండా కాశీకేమన్నా పోతిందా– ఆ యింటెనకనో ఆ కొట్టాల్లోనో ఉంటుంది సూడు తొందరగా అయ్యనకింత కాఫీ పెట్టమను. పోరా! పొయి సూడ్రా!"

గోవిందు పాలచెంబు వంటింట్లో పెట్నాడు. వాకిట్లోకి వచ్చినాడు. అప్పటికే ఓబులేసురెడ్డి రుసరుసలాడుతున్నాడు అదేమీ చూడనట్లుగా గోవిందు వాకిలిదాటి కొట్టంలో అడుగుపెట్నాడు. "నాగులూ! సుబద్రమ్మను కాని సూసినావంట్రా!" అని అడిగినాడు.

ఆ మాట చెవినిపడేసరికి నాగులుగాడికి గుండె దడపుట్టింది. చెమటలు పోస్తున్నాయి కాళ్ళు తడబడుతున్నాయి. ఎత్తబోతున్న పొరక్కట్టను అట్లానే వదిలిపెట్టి యింటివెనక్కు పరుగెత్తినాడు. వేపచెట్టుకింద చూచినాడు కనుపించక పోయేసరికి కొట్టాల్లో వెతుకుతున్నాడు.

"అయ్యా! సుబద్రమ్మ ....."

ఒక్క లగుపులో వాకిట్లోపడిన రెడ్డోరి పెద్దపేడ్యాగాడు రెడ్డిగార్ని చూసే సరికి ఎనవల్చుకొన్న అర్ధాంతరంలోనే ఆగిపోతే గసపోసుకొంటూ నిలబడినాడు.

"ఆ! సుబద్రమ్మ! ..." రెట్టించినాడు రెడ్డిగారు.

"మిసినుబాయిలో దూకి సచ్చిపొయ్యిందయ్యా!"

"ఆఁ! సుభద్ర మిసినుబావిలో దూకిందా!" - ఆశ్చర్యం, ఆవేదన, అందోళన అన్నీ కలగలిస్తే రెడ్డిగారి గొంతులో మాటగా వెలువడింది.

"అవునయ్యా!" సేద్యగాడు అనలేక అన్నాడు.

"అమ్మా! సుభద్రా! ఎంత అన్యాయం చేసినావమ్మా! ..." అని దీనాతి దీనంగా విలపిస్తూ రెడ్డిగారు మిషన్‌బావివైపు పరుగెత్తుతున్నారు.

ఈ మాట చెవినపడేసరికి ఒక్క గావుకేక పెట్టింది రెడ్డెమ్మ— 'అయ్యో నా బిడ్డా!'— అని.

రెడ్డిగారివెంట సేద్యగాళ్ళు, వాళ్ళవెంట నాగులు... ఈ వార్త చెవిన పడేసరికి ఊళ్ళోవాళ్ళు ఒకరివెంట ఒకరుగా మిషన్‌బావిదగ్గరికి పరుగెత్తినారు.

మిషన్ బావిదగ్గర అంతా గందరగోళమే!

"పాతురా! అయ్యో నా పాతురా! నీ కెందుకీగతి పట్టింది తల్లీ! ఏంవి తక్కువయిందని యింతపని కొడతెగినావమ్మా!" అని వాపోతూ రెడ్డిగారు రెండు చేతులు పైకెత్తి బావిచుట్టూ తిరుగుతున్నారు.

ఊరూవాడా ఏకమై బావిదగ్గర విలపిస్తూ ఉంది.

ఇద్దరుముగ్గురు బావిలో దిగినారు. నీళ్ళమీద తేలియాడుతున్న సుభద్రమ్మ శవాన్ని పైకితెచ్చినారు. బావిగట్టున పడుకోబెట్నారు

ముఖంనిండా పచ్చగా పసుపు పూసుకొనింది. పావలా కాసంత కుంకుమ బొట్టు నొసటాన ముచ్చటగా తీర్చిదిద్దుకొనింది. తల దువ్వుకొనింది. తలనిండా పువ్వులు పెట్టుకొనింది. పట్టుచీర కట్టుకొనింది. ముమ్మూర్తులా పెండ్లికూతురిలా తయారయింది. ఏమి చెక్కుచెదరలేదు.

బావిగట్టున పచ్చని తివాసీలాంటి పచ్చికమీద పడుకోబెట్టుండే ఆ చందనపు బొమ్మను చూచి అందరి గుండెలు కుతకుత ఉడుకుతున్నాయి.

నాగులు తలెత్తి ఒక్కసారి ఆమెవైపు చూచినాడు.

"సరిపోతుందంట్రా నాగులూ! నీ కిది సరిపోతుందా? ఎపుడో చేసిన తప్పుకు నన్ను బలిచేసినావు కదా!" అని సుభద్ర పిలబెట్టి అడుగుతున్నట్లుంది.

నాగులుగాడి గుండెలు పగిలిపోతున్నాయి. పగిలిపోతున్న గుండెల్ని పట్టుకొందామన్న ప్రయత్నంలో అప్రయత్నంగా చేయి గుండెలమీదికి వెళ్ళింది. జేబులో అగ్గిపెట్టె చేతికి తగిలింది. అంతే! వాడి గుండె రాయిగా మారింది. ఒక్కసారి మళ్ళీ సుభద్ర శవంవైపు దృష్టిని మరల్చినాడు.

కన్నీటి పొరలమధ్య తన తండ్రి శవం స్పష్టంగా కనిపిస్తూ ఉంది.

మొగంనిండా పసుపు పూసి.... రూపాయబిళ్ళంత కుంకంబొట్టు పెట్టి తలనిండా పువ్వులుపెట్టి....పాత పట్టుచీర గట్టి– రేవుకు తీసుకొనిపోతున్న తన తల్లి కంటపడింది.

వాడి గుండెలు ఉడుకుతున్నాయి!

శవాన్ని మోసుకొని యింటికి బయల్దేర్నారు. రెడ్డిగారు చేతులమోపున నడుస్తున్నాడు.

"వాడు లచ్చుంగాడా. నాయాలు సచ్చినోడెట్లా సచ్చినాడు. రెడ్డోరింటిని దెయ్యమై పట్టుకున్నాడుగదరా?"

"ఎందెప్పుడో ఒక జలమంలో చేస్తే యింకో జలమంలో అనబవిస్తా రంట్రాపుండ్రి. ఇప్పు డట్లాగాదురా తంబ్రీ!– ఈ సేత్తో సేస్తే ఆ సేత్తో అనబ వించాల్సిందే!"

"ఒరే! వొకడి కడుపు మనం గొట్టే దేవుడు మన కడుపు కొట్టడా?"

జనం రకరకాలుగా మాట్లాడుతూ ఆయన కల్లంతదూరంలో వెంట నడుస్తున్నా ఆయన చెవిన పడడంలెదు. ఆయన ఈ లోకంలో లేడు.

శవాన్ని మోసుకొని యింట్లో అడుగుపెట్నారు. వాకిలిదాటి హాల్లో ప్రవేశించినారు. ఆ హాల్లోనే రెడ్డెమ్మ మంచం. ఆ మంచంమీదనే ఆమె పడివుంది. ఆ మంచం పక్కన్నే తలకింద కాసిన్ని వడ్లుపోసి సుబద్ర శవాన్ని నడుకో బెట్నారు.

ఇంత జరుగుతున్నా రెడ్డెమ్మ అలిగురి మనడంలేదు. 'ఎందుకట్లావుందో!' అని అనుకొంటూ రెడ్డిగారు మంచాన్ని సమీపించినారు.

"రెడ్డీ!" అని పిలిచినారు. ఆ పిలుపులో ఎంతో అర్ద్రత. అయినా బదులు లేదు.

ఈ దెబ్బకు తట్టుకోలేక సొమ్మసలి పడిపోయిందేమో? అనుకొని చేత నయినంత అనునయంగా 'ఏం చేద్దాం రెడ్డీ! మన కర్మిట్లా కాల్తుందని కల్లోగూడా అనుకోలేదే? దెయ్యే! లేసి నీ బిడ్డను సూడే!– ఎందుకిట్లా మన కడుప్మంట పెట్టు కొనిందో అడుగే!' – అంటూ రెడ్డిగారు రెడ్డెమ్మను తట్టి లేపబోయినారు.

ఆమె శరీరం కట్టెలా చేతికి తగిలింది.

"రెడ్డీ!" అని అరుస్తూ రెడ్డిగారు కుప్పగా కూలిపోయినారు.

ఇంకెక్కడి రెడ్డెమ్మ? – ఆమె ప్రాణాలు ఎప్పుడో గాలిలో కలిసిపోతే!

"ఇంతన్యాయం పగోడిక్కూడా వద్దురా! తంబ్రీ!" అని ఊరు గొల్లు

మంటూ రెడ్డెమ్మను మంచంమీదనుండి కిందికి దించినారు. తలకింద వడ్లుపోసి కూతురి పక్కనే పడుకోబెట్నారు.

కూతురిపక్కన తల్లి. తల్లిపక్కన కూతురు! ఇద్దరూ నిద్రపోతున్న ట్లున్నారు. ఆ యిల్లు కాకిశోకంతో కాల్వలుగట్టుతూ ఉంది.

నాగులుగాడు అటుయిటు చూచినాడు. ఎవరిలోకంలో వాళ్ళున్నారు. అంతే! వాడు పరుగందుకొన్నాడు. గసపోసుకొంటూ గుడిసింటి ముందర ఆగినాడు. తృప్తిగా ఒక్కసారి గుండెలనిండుకు గాలి పీల్చుకొన్నాడు. జేబులోని అగ్గిపెట్టెను చేతికి తీసుకొన్నాడు. ఒకపుల్లను గీచినాడు. ఆ పొద్దు పొటమరింపువేళలో సద్దు సడీ నిద్రలేవబోతున్న వేళలో ఆ పుల్ల నిశ్చలంగా మండుతూ ఉంది. మండు తున్న మంట ఎరుపు. తూరుపుదిశ ఎరుపు. నాగులుగాడి కండ్లు ఎరుపు. దశకంతా పురంలోని కండ్లన్నీ ఎరుపు. అసలు లోకమంతా ఎర్రదనం ఎగ్గొట్టుకవస్తూంటే వాడి మొగంలో పువ్వులు పూస్తున్నాయి. ఆ తరువాత మరొక్క పుల్ల!–

గుడిసింట్లో అడుగుపెట్నాడు. వంగి తల్లి పాదాలకు నమస్కరించినాడు. ఆమె అతణ్ణి ముద్దులతో ముంచెత్తింది.

తూర్పున పొద్దెక్కుతూ ఉంది!

## 10

బాధల్ని వ్యథల్ని కథల్ని కన్నీళ్ళ కడుపున దాచుకొని కాలపురుషుడు యిదంతా తనకు సహజమే అన్నట్లుగా ముందుకుపోతున్నాడు.

ఏడాది గడిచినట్లే తెలియడంలేదు.

ఒకానొక సాయంకాలం –

రెడ్డిగారు పట్టెమంచంమీద కూర్చుని ఉన్నారు.

ఏడాదికిందట ఆయన ఆ పట్టెమంచంమీద కూర్చుని ఉన్నారంటే – ఆ దర్పం వేరు. ఆ దర్జా వేరు!

కానీ ఆ రోజు వానకు తడిసిన గువ్వలా ముడుక్కొని కూర్చుని ఉన్నారు!

అదే యిల్లు. అదే వాకిలి. అదే పందిరి. పందిరికింద అదే పట్టెమంచం. అదే ట్యూబ్‌లైట్. అవే వెండివెలుగులు. ఎందులోనూ ఏ మార్పు లేదు!

అయితే రెడ్డిగారి గుండెలనిండుకు చీకటి! వెండివెలుగుల చంద్రుణ్ణి ఉన్న ట్లుండి రాహువు మింగితే నింగినిండా అలుముకొనే చీకటి!!–

మేళగాళ్ళు తాళగాళ్ళు వస్తున్నారు. యథాస్థానాల్లో కూర్చుంటున్నారు. నాలుగు ఓదార్పుమాటల్ని పలుకుతున్నారు. వచ్చిన దారంపట్టిపోతున్నారు.

ఒకనాడు ఆ ఊరికే రచ్చబండగా వెలుగొందిన రెడ్డిగారివాకిలి ఈనాడు కళావిహీనంగా తయారయింది. కళాకాంతుల్ని పోగొట్టుకొన్న ఆ వాకిట్లో రాజ్యాన్ని పోగొట్టుకొన్న రారాజులా రెడ్డిగారు కూర్చున్నారు. కొడుకు గతించి ఏడాది అయింది కదా!– ఏడూడి ఎట్లా జరిపిస్తే బాగుండునో ?– అని ఆలోచిస్తున్నాడు.

కొడుకుమాట మనస్సులో మెదిలేసరికి గుండెల్ని మెలితిప్పినట్లు బాధ. ఒక్కగానొక్క కొడుకు. వాడికోసం తొక్కరాని దార్లన్నీ తొక్కి సంపాదించిన ఆస్తిపాస్తులు. కడకు చీమలు పెట్టిన పుట్టలవుతున్నాయి! – అని అనుకొనే సరికి రెడ్డిగారి మనసు ముక్కలు ముక్కలవుతూ ఉంది. కండ్లల్లోపల కన్నీళ్ళు రాలుతున్నాయి!

"అయ్యా!"

రెడ్డిగారు తలపైకెత్తి చూచినాడు.

ఎదురుగా నాగులూ!

ఎవరి కన్నబిడ్డయితే యేం పాపం వాడు!– ఏ కులంలో పుట్టినవాడైతే మాత్రమేం? ఎంత వినయం? ఎంత విధేయత? ఈ ఏడాదిగా వాడు కడుపులో పుట్టిన బిడ్డలకంటే ఎక్కువగానే చూసుకున్నాడు. పిలిస్తే పలుకుతున్నాడు. చెప్పిన పని క్షణాలమీద చేస్తున్నాడు. సేవలు చేస్తున్నాడు. ఓదారుస్తున్నాడు. ధైర్యం చెబుతున్నాడు. ఇంత చిన్న వయసులోనే ఎంత పెద్దబుద్ధి వాడికి! దేవుడు కొంతమందిని యిట్లా పుట్టిస్తాడేమో!–

ఇట్లా ఆలోచిస్తూనే ఓబులేసురెడ్డి ఆదరంగా వాడిపైపు చూచినాడు. చూస్తూ, "ఏందిరా నాగులూ!" అని అడిగినాడు.

"అన్నీ తెల్సిన పెద్దోళ్ళు మీరు. మీకు సెప్పేంతటోణ్ణాయ్యా!– ఎప్పుడూ యిట్లా యేమి సెయ్యక్నా కూసుంటే జరగాల్సిన పన్లెట్లా జరగతాయ్యా!"

"జరిగితేయేం? జరక్కపోతే యేందిరా!– పోనీ! యింకెవరికోసరవని జరగాల? కడుపులో పుట్టిన బిడ్డల్ని, కట్టుకున్న పెండ్లాన్ని, అందర్నీ పోగొట్టుకొని ఏకాకిగా మిగల్నానే!– ఇంక నేనేపైపోతే యేందిరా!"

"అయ్యా! అయ్యా! అట్లనద్దండయ్యా!"

"నాగులూ! దేవుడి కెందుకురా నామీదింత కసి!"

"అది మన కెట్లా తెలుస్తుందయ్యా!"




"ఇంతమందిని తీసకపోయినోడు నన్ను గూడా తీసుకోనిపొయ్యుంటే ఈ బాధంతా వుండేది కాదుగదరా!"

"మనంగూడా ఎప్పుడో ఒకప్పుడు పోవాల్సినోళ్ళమే గదయ్యా!"

"అది నిజవేననుకో!"

"మరి! ఎప్పుడో ఒకప్పుడు పోవాల్సినోళ్ళ గదా! దానికెందుకయ్యా యింత బాదపడ్తావుండారే!_ ఉండే రొండుదినాలైనా సుకంగా బతక్కూండా!"

"హుం! యింకేం సుకంరా! సుకపడేదాంతే నా మొకాన రాసుంటే యింత మందినిట్లా పోగొట్టుకొని ఈ పాడుబతుకు బతకతానా!"

"అద్దో! మల్లా తలసుట్టి నోటకాడికొస్తే ఎట్లాయ్యా!_ పోయినోళ్ళట్లా పోయినారు. వాళ్ళతో కల్సి మనంగూడా పోబొయ్యేది లేదుగదా! అందుకే సెప్తావుండా!"

"ఏంవని సెప్తావుండావురా?"

"సెప్తే ఏటో! సెప్పకపోతే ఏటో! అని శానా దినాలుగా మదంగులాలు పడ్తావుండానయ్యా!"

"నా దగ్గిరెందుకురా నీకా బయం?"

"సెప్పమంటారాయ్యా!"

ఓరగంట చూస్తూ తల గీరుకొంటున్నాడు నాగులు.

"గుణస్తా వెందుకురా.... సెప్పాలనుకునందేదో సెప్పరాదు?"

"ఏఁవను కోరుకదయ్యా?"

"ఒరెఒరె. నీతో పెద్ద పీకులాటైపోయ గదరా?.... సెప్పరాంటే!"

"అయ్యా...."

"ఊఁ...."

"మా యమ్మ!"

"అఁ! మీ యమ్మ!"– ఎగిరిపడినంత ఉత్సాహంగా అన్నాడు రెడ్డిగారీమాట.

నాగులు తృప్తిగా గాలి పీల్చుకొన్నాడు.

"మీతో మాట్లాడాలనిందయ్యా!"

"మీయమ్మ!.... నాతో!... మాట్లాడాలన్నిందా?"

వాడి మాటలు నిజంగావన్నంత సందేహాన్ని వెలిబుచ్చినాడు రెడ్డిగారు.

"మా యబ్బతోడయ్యా!– అమ్మగారు.... చిన్నమ్మగారు....పోయ్యింది మొదులుకొని 'ఒరే నాగులూ! అయ్యగారెట్టుంటూరా?!– ఇంక మంచీసెడ్డా మనం జూసుకోవాల్సిందే గదరా?– పాపం! అయనెంత బాదపడిపోతుండాడో? ఏఁవో?– అయ్యతో నేను మాట్లాడల్లరా?' అని సతపోర్తా వుందయ్యా!– మీతో అంటే యావంటారో యేఁవో అనుకొని నేను సెప్పలేదయ్యా!"

లచ్చిఁవి రెడ్డిగారి కండ్లముందు కెదిలింది. రెడ్డిగారి ముఖం విప్పారింది.

"నాగులూ! నువ్వు సెప్పేది నిజమేనారా?"

"మాయబ్బతో.... మీ సెచ్చిగా సెప్తావుండానయ్యా."

"అయితే పోరా! పోయి రమ్మను పో!"

"ఈడికొస్తే యేం బాగుంటుందయ్యా? .. ఎవరి కండ్లల్లోనైనా పడ్తే...."

"అది నిజమేననుకో?... అయితే యింకెట్ల సెయ్యాలన్నా!"

"ఏవుండాదయ్యా? రేత్రికి సామునుఁఇగినాక నేను మిసినుబాయికాడికి తీసుకొనొస్తా. అడ పంపుసెడ్డుండాది కదా?– పల్లా కావాలంటే మనింట్లో పనికి కుదిరించుకున్నట్లు కుదిరించుకుంటే యీడికే వచ్చేస్తుంది."

"ఇది బాగానే వుండాదిరా!"

"మీరు రడీగా వుండండయ్యా! గొడ్లకు నీళ్ళు తాపేసిన. తవుడు పెట్టేసినా. గాడ్నిండా కసువేసినా. ఇంక నాకేం పన్లేదు. మా యమ్మను తీసుకొనొచ్చి మిసినుదాయికాడ సెడ్లో పెట్టేసి పికాడికొస్తా!"

"మన సేద్దిగాళ్ళెవురైనా బాయికాడికొస్తే ఎట్లారా?"

"వాళ్ళిద్దరూ సినిమాకని పేటకు సెక్కేసినార్లేయ్యా!"

"సరే పో! నీ కోసరం ఎదురుసూస్తావుంటా!"

నాగులు ఒక్క లగువులో ఎగిరి వీధిలో పడినాడు. ఓబులేసురెడ్డిగారు ఎండన తోలాస్పుకొన్న గువ్వ అయినాడు. పట్టెమంచమీద పొందలేదు. పైకి లేచినాడు. వాకిట్లో లాంతర్ లైట్ మరీ కాంతివంతంగా మండుతూ వుంది. రెడ్డిగార్లో కొత్తరకం తెంపు. ఉత్సాహం ఉరకలువేస్తూంటే కాసేపు వాకిట్లో పచార్లు చేసినాడు. ఆ మీదట యింట్లోకి వెళ్ళినాడు. ఎక్కడొకటి అక్కడొకటిగా మిగులున్న బట్టతలమీద వెంట్రుకలకి వాసననూనె పట్టించినాడు. పెట్టె తెరచి తాను మంచి వయసుమీదున్నప్పుడు వాడుతూ వుండిన సిల్కుపంచ, లాల్చీ తొడుక్కున్నాడు. తాతలకాలంనాటి యినపెట్టె. దాని జాతకంలో కడుపు నింపు కోవడమేకాని ఖాళీచేసిన పాపాన పోలేదు. ఆరోజు దాని జాతకం తారుమారు అయింది. దాని కడుపు కొంత ఖాళీఅయితే రెడ్డిగారి లాల్చీజేబు బరువుగా మూలిగింది.

ఊరు మాటుమణిగింది.

అనుకున్న వేళకంటే నాగులుగాడు కొస్త ముందుగానే వచ్చినాడు. రెడ్డిగారి గుండె కొత్తనీళ్ళతో నిండిన చెరువయింది వాకిట్లో నిలబడి ఒకరినొకరు చూచుకొన్నారు. 'యింక ఎలబార్దామా!' అని రెడ్డిగారు చూపులతోనే ప్రశ్నిస్తే 'మీదే ఆలస్యం!' అన్నట్లుగా నాగులు ముందు నడుస్తున్నాడు.

రెడ్డిగారు వాడి వెంబడి నడుస్తున్నాడు.

ఊరు మంచి నిద్రలో వుంది. దారిలో ఎదురుపడిన కుక్కలు ఎగిరి పడుతున్నట్లు మొరగందుకొని నాగులుగాడి గొంతు విని తోకాడిస్తున్నాయి. ఊరి ముందర చింతతోపులో కీచురాళ్ళ రొద. రెడ్డిగారి గుండెల్లో తీయని నాద చెరువులో కొత్తనీళ్ళమీదనుండి కోపులు కోపులుగా వీస్తున్న గాలి...

నాగులుగాడు, రెడ్డిగారు ఊరుదాటి, ఊరిముందరి గెవిని దాటి, పొలిమేరల్లో మిషన్‌బావి దగ్గరికి చేరేటప్పటికి జాముపొద్దు దాటింది.

నాగులుగాడు ముందు రెడ్డిగారు వెనకగా మిషన్‌షెడ్లో ప్రవేశించినారు.

రెడ్డిగారికి ఒక్కక్షణం కనుమీద రెప్ప పడలేదు.

షెడ్లో నులకమంచం.... మంచంమీద తెల్లటి దుప్పటి... ఆ దుప్పటి మీద పరవిరిసిన మల్లెలు!... ఆ షెడ్డునిండా మల్లెలవాసన మత్తుగొలుపుతూ ఉంది.

రెడ్డిగారు నాగులుగాడివైపు ప్రసన్నంగా చూసినాడు.

లచ్చింవి ఒక మూలకు నక్కి తలవాల్చుకొని నిలబడి ఉంది.

రెడ్డిగారు మంచంమీద కూర్చున్నారు. ఆయన మంచంమీద కూర్చుంటూ ఉంటే ఏడాదికిందటి దర్పం దర్జా ఎగిసెగిసిపడుతూఉంది.

నాగులుగాడు తలుపు పట్టుకొని నిలబడి ఉన్నాడు. ఒక విధంగా చూస్తూ యింకొక విధంగా నవ్వుతూ తల గోక్కుంటున్నాడు.

"సరే! యింక నువ్వు పదరా నాగులూ!"— రెడ్డిగారన్నారు.

నాగులు తలుపు మూసుకొని బయటికి నడిచినాడు.

రెడ్డిగారి గుండె గుబగుబలాడుతూఉంది. నాలుక తడారిపోతూఉంది. వయసులో ఉన్న కుర్రవాడు తొలికలయికలో పడే తపనలాంటి తపన. రెడ్డిగారు గుటకలుమింగుతూ కూర్చున్నాడు.

కొన్నినిమిషాలు నిశ్శబ్దంగా కాలగమనంతో చేయికలిపినాయి

నాగులు మిషన్ షెడ్డుచాటులో పొంచి కూర్చున్నాడు. ప్రతినిమిషం ఒక యుగంగా నడుస్తూ ఉంది. అరు అల్లాడితే ఉలికిపడుతున్నాడు. సమయంకోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాడు.

రెడ్డిగారు మెల్లగా తెపరాయించినాడు.

అయినా లచ్చింవి వంచిన తల ఎత్తలేదు.

రెడ్డిగారు పైకండువాను సర్దుకొన్నాడు. లాల్చీ సరిచేసుకున్నారు. తన్ను తానే కిందినుండి పైకి ఒకసారి పరిశీలనగా చూచుకొన్నారు. తృప్తిగా ఉంది. ఈసారి కాస్త గట్టిగానే తెపరాయించినాడు.

అయినా లచ్చింవి వంచిన తలెత్తలేదు.

రెడ్డిగారికి కొసంత తెంపు వచ్చింది.

"రా లచ్చింవీ! రాయే!— ఎందుకట్లా వొదిగొదిగి నిలబడ్డావ్? రా కూసో!"

ముద్దుముద్దుగా పిలిచినాడు రెడ్డిగారు. లచ్చింవి వంచిన తలెత్తలేదు. కాలు ముందుకు కదపలేదు. దాని గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి.

"ఒసే నీయమ్మనుగొట్టా!— కొత్త పెండ్లికూతురు మేలుగదంటే నీ కంటే! పిలస్తానే వొచ్చి కూసుంటుంది."

"బతకలేకుండా మీ కాళ్ళకాడ కొచ్చిందాన్ని. అంతంత పెద్ద మాట లెందుకులేయ్యా!"— కొతికికొతికి పలికింది లచ్చింవి.

"బతకలేన్దానివా? ఎవురే నిన్నామాటనింది?— ఒసే పిచ్చిదానా? యింక నాకు

మాత్రం ఎవురుండారే! ఉందేదంతా ఎవురికి పెట్టబోతా?– నాగులు నా బిడ్డే అనుకో!"

"ఇట్లాంటి సమయాల్లో అట్లాంటి మాట లెవురైనా సెప్తార్లేయ్యా!"

"ఛఛ! అదేందట్లంటావే?"

"పెద్దోళ్ళ మాటలు గదయ్యా!"

"పిచ్చిదానా! నేను పెద్దోణ్ణయితే నిన్నెందుకు ఎతుక్కుంటా వస్తానే?"

"ఏంవో అయ్యా! యింతకాలం మీ నీడన్నే బతికినాం. ఈ పొద్దు మిమ్మల్ని నమ్ముకొనే నా బతుకు మీ సేతల్లో పెట్టావుండా. ఈ బతుకిట్లానే ఎగ వీదిస్తే...."

"అదంతా నా కొదిలేయే!– నేన్జూసుకుంటానుగానీ.. నువ్విట్టారా!– రా వచ్చి కూసోయే!"

"వొచ్చి కూసుంటానుగానీ నాదొక సిన్న మనవి!"

"ఏందే? అప్పుడే మొదులుపెట్టేసినావే? సరేసరే కానీ... "

"ఏంవీ లేదయ్యా!"

"ఇదింకా బాగుండాదే?– సిన్న మనవి సిత్తగించమన్నదీ నువ్వే?– సిత్తగిస్తానంటే యేంవీ లేదనేదీ నువ్వే!"

"తమరు స్తానమాగీరందయ్యా!"

"ఇప్పుడెందుకే?"

"అది నా కలవాటయ్యా!– మా యింటోడు బతికున్నప్పుడు కూడా అంతే!"

"ఒసే నీయమ్మనుగొట్టా! అ మాటప్పుడే సెప్పగూడదంటే!... ఏస్టయేస్ట ఎంతేస్టయ్‌పాయ్‌నే టయింవు!"

"స్తానవాడొస్తే శానా బాగుంటాదయ్యా!"

లచ్చింవి కిలకిలా నవ్వింది. రెడ్డిగారి గుండెల్లో గిలిగింతలు పెట్టినట్లయింది. ఒక్క ఊపులో పైకి లేచినాడు. లాల్చీ తీసి మంచంమీద పెట్నాడు. చవకాన్ని మొలకు చుట్టుకొన్నాడు. పంచ విప్పి మంచంమీద పెట్నాడు. కిర్రుమని తలుపు తెరిచినాడు.

నాగులుగాడు సంసిద్ధుడై కండ్లు చించుకొని చూస్తున్నాడు.

రెడ్డిగారు గబగబ వెళ్ళి కాలువలో దిగినాడు. పంపులో ఏకధారగా దూకుతున్న నీళ్ళకింద తల పెట్నాడు. తలమీద సమ్మెటతో బాదినట్లు దిమ్మనింది. అంతే! వికృతంగా అరుస్తూ అట్లానే కాలువలోకి వొరిగిపోయినాడు. రెండు నిముషాలు గిలగిల తన్నుకొన్నాడు. ఆ తరువాత కాలువలో అట్లానే నిగడక పోయినాడు.

నాగులు గబుక్కున లేచి అర్తో పెట్టిన వైర్‌ని చేతికి లాక్కొన్నాడు.

లచ్చిమి మంచంమీద పరిచిన దుప్పటిని ఒక్క పువ్వు కిందపడకుండా అదరాబాదరా మడిచి చంకలో పెట్టుకొనింది. మంచాన్ని లేవనెత్తి యధావిధంగా పెట్టింది. ఒక షెడ్‌లో మిగిలింది రెడ్డిగారి పంచ, లాల్చీ!— వాటిని చూస్తుంటే ఆమె శరీరం గగుర్పొడుస్తూ ఉంది. అటుయిటు వెదికింది. మూరెడు పొడుగుతుంట కర్రను చేతికందుకొనింది. ఆ కర్ర సాయంతో రెడ్డిగారి పంచను లాల్చీని తెచ్చి కాలువ గట్టున పెట్టింది.

నాగులు వంగి ఆమె పాదాలకు నమస్కరించినాడు.

అమాంతంగా జవురుకొని వాణ్ణి ముద్దులతో ముంచెత్తింది.

పరుగు నడకగా ఆమె వాడవైపు దారితీసింది.

నింగిమీద చుక్కలు నిగనిగ మెరుస్తున్నాయి!

* * *

తెల్లవారింది!

దశకంఠాపురంలో కూడా తెల్లవారింది.

అయితే దశకంఠాపురంలో ప్రతి మనిషిలో ప్రతి మనసులో ఒకటే సందేహం!— 'తెల్లారాళకే రెడ్డిగారెందుకు మిసన్‌బాయికాడికి పొయినాడబ్బా? పొయినాడుపో?— అట్టెట్లా కాలవలోపడి సస్తాడబ్బా!'— అని.

ఈ లోకంలో నిత్యనూత్నంగా ఎన్నో సమస్యలు!

పరిష్కారం దొరకని సమస్యలు!!

ఎన్నో ప్రశ్నలు!

సమాధానం దొరకని ప్రశ్నలు!!

రెడ్డిగారి చావుకూడా సమాధానం దొరకని ప్రశ్నగా మిగిలిపోయింది.

ఆ ఊళ్ళో యేనోటా ఒకటే మాట!

"నామాలు లచ్చింగాడు. నీళ్ళగెండంతో సస్తే సచ్చినాడుకానీ, ఈ కొంపనే నీళ్ళగెండంతో ముంచెగదబ్బా!"— అని.

ఎవరి సందేహం యేదైనా, యెవరి మాట యెట్లున్నా జరగవలసిన కార్యాలకు మాత్రం మోహన్నాయుడు ముందు పడినాడు.

ఆ పాయకట్టు పాయకట్టుగా రెడ్డిగారింటి ముందు నిలబడింది.

ఏ విషయంలో అయినా ఆ పాయకట్టు ప్రజలకు ఏకాభిప్రాయం కుదిరిందో లేదో కానీ రెడ్డిగారి కుటుంబానికి జరిగిన ఈ దుర్ఘటనమీద మాత్రం ఏకాభిప్రాయం కుదిరింది. అందుకే ప్రతి గుండె బాధపడుతూ ఉంది.

నాయుడిగారి నాయకత్వంలో రెడ్డిగారి శవం బయలుదేరింది. శవ సంస్కా రానికి బయలుదేరడం జాతర సంబరాల్ని గుర్తుచేస్తూ ఉంది.

శవం ఊరు దాటింది. ఊరి గెవిన్లో దింపుడుకళ్ళం. అక్కడ దించినారు. టెంకాయ కొట్నారు. కర్పూరం వెలిగించి హారతులిచ్చినారు అంతవరకు పాడె మీద తల యింటివైపుగా ఉంటుంది. అక్కడ పాడెను యిటు అటుగా తిప్పు కోవడంతో తల శ్మశానంవైపు తిరిగింది. అటున్న మనుష్యులు యిటు, యిటున్న మనుష్యులు అటుగా భుజాలు మార్చుకొంటారు. శవం బయలుదేరింది.

దింపుడు కళ్ళం ఆశ!— అది కూడా తీరిపోయింది!!

ఊరిగెవిని దాటింది. శ్మశానవాటిక చేరింది. చితిమీది కెక్కింది.

"రే! అగ్గిపుల్ల!" అని అరిచినాడు నాయుడు.

ఎక్కడున్నాడో! యేమో! నాగులు గబుక్కున అగ్గిపెట్టె చేతికందించినాడు. మోహన్నాయుడు ఒకసారి అగ్గిపెట్టెవైపు యింకొకసారి నాగులుగాడివైపు మార్చి మార్చి చూచినాడు. అది కూడ ఒక్క క్షణం మాత్రమే!

నాయుడు చాలా జాగ్రత్తగా గీచినాడు. చితికి నిప్పు పెట్నాడు. చేతిలోని అగ్గిపెట్టెను విసిరిపారేసినాడు. నాగులుగాడి దృష్టి ఆ అగ్గిపెట్టెమీదనే ఉంది.

చితి అంటుకొనింది. భగభగమండుతూ ఉంది!

శ్మశానవాటికకు వచ్చినవాళ్ళందరు ఆ చితివైపు తిరిగి ఒక్క దండం పెట్టి తిరిగి చూడకుండా వెళ్ళిపోతున్నారు. నాగులుగాడు అటుయిటు చూచినాడు. ఆ ఖాళీ అగ్గిపెట్టెను చేతికి తీసుకొన్నాడు. విసిరి ఆ చితిలో పారేసినాడు. రెండు చేతులు జోడించి ఒక్క దండం పెట్నాడు. గిరక్కున వెనక్కు తిరిగి నడుస్తు న్నాడు.

చితి బాగా అంటుకొనింది. ధగధగమండుతూ ఉంది.

అగ్గిపుల్ల!—

అగ్గిపుల్లలో అగ్గి ఉంది. అగ్గిపుల్లలోనే కాదు— మహాసాగర గర్భంలో బడబాగ్ని నిక్షిప్తంగా ఉంది. మహాపర్వతాల్లో ప్రళయాగ్ని పదిలంగా ఉంది. రాళ్ళరప్పల్లో ఉంది. చెట్టుకొమ్మల్లో ఉంది. నీలో ఉంది. నాలో ఉంది. ఈ సమాజంలోనే ఉంది— అగ్గిపుల్లలో దాగిఉన్నట్లు!

అగ్గిపుల్ల!— జేబులో భద్రంగా ఉంటుంది. చేతిలో క్షేమంగా ఉంటుంది. ఇంటి చూరులో చెక్కితే సురక్షితంగా ఉంటుంది. అయితే రాపిడి తగిలితే రాజుకొంటుంది. మండుతుంది. మండిస్తుంది. కాలుస్తుంది. కొంపల్ని కాలుస్తుంది కొంపల్నేకాదు— అవసరమైతే లోకాన్నికూడా!